నవంబర్
2017

139

సంపుటి : 12 సంచిక : 7 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో దక్షిణాసియా పురోగమనం
సామాజిక న్యాయం-కమ్యూనిస్టు దృక్పథం
అక్టోబరు విప్లవం వైపు బోల్షివిక్‌ల పురోగమనం
కొత్త శకంలోకి చైనా సోషలిజం
కులాల 'గీత'లు గీసిన భగవద్గీత
వర్గ పోరాటం అదనపు విలువ పంపిణి
దిక్కుతోచని స్థితిలో భారత ఆర్థికవ్యవస్థ
ప్రజారోగ్యాన్ని నాశనం చేసే 'నీట్'
బూర్జువా పార్టీల్లాగా సిపిఎం అధికారం కోసం ప్రజలను మభ్యపెట్టదు
దోపిడి వర్గాల మెడలు వంచిన ఆదివాసుల పోరాటం

స్ఫూర్తి

# దోపిడి వర్గాల మెడలు వంచిన ఆదివాసుల పోరాటం

**గోదావరి పరులేకర్**

భూస్వాముల వడ్డీ వ్యాపారుల దౌర్జన్యాలకు ఇకపై ఆదివాసులు తలవంచేందుకు సంసిద్ధంగా లేదు. వారి బలం వారి నిర్మాణంలోనే వున్నదనే వాస్తవాన్ని వారిప్పుడు గ్రహించారు'. ఆదివాసి సేవామండల్ 1945-46 వార్షిక నివేదికలో చెప్పిన మాటలివి.

రైతాంగం చెల్లించాల్సిన 'మక్తా' లెక్కలు భూస్వాములు రాసి పెట్టేవారు. సంవత్సరాల తరబడి పేరుకున్న బకాయిలు ఎప్పుడూ ఆ లెక్కల్లో వుండేవి. అందువల్ల రైతు ప్రతిదఫా తాను చెల్లించాల్సిన కౌలు మాత్రమే కాక ఈ బకాయిలకూ కొంత చెల్లించాలి. బకాయి పడినందుకు శిక్షగా మరి కొంత మొత్తం కలిపేవారు. రైతు దగ్గర నుండి సాధ్యమైనంత ఎక్కువ ధాన్యం కాజేయడమే వారి ఉద్దేశ్యం. రైతు చెల్లించిన మొత్తాలకు రశీదు ఇవ్వరు. అందువల్ల మరోసారి మక్తా చెల్లించేందుకు రైతు వెళ్లగానే, రైతును కుంగదీసే విధంగా మరికొంత బకాయి భాగం కలిపేవారు. తమకు పండిన ధాన్యమంతా కొలిచినా, ఈ క్రమంలో తాము ఆర్థాకలితో మాడుతున్నా ఇంకా విపరీతమైన బకాయిలు ఎలా పేరుకుంటున్నాయని భూస్వాములు చెప్పగలుగుతున్నారో అర్థమయ్యేదికాదు. భూస్వాములు దొంగ లెక్కలు రాసి, తమను మోసం చేస్తున్నారనే అనుమానం వారికి వుండేది. దీనికి పరిష్కారం ఏమిటో వారికి తెలియదు.

భూస్వాములకు చెల్లించాల్సింది ధాన్యం మాత్రమే కాదు. తన భూమిలో పండిన అపరాలు, కూరగాయలు, తాము పెంచిన కోళ్లగుడ్లు, తమ భూమిలో తామే పెంచిన చెట్ల ఫలితమైన చింతపండు, మామిడికాయలు, కొత్తిమీర కూడా ఇవ్వాలి. ఇవి చెల్లించకపోతే శిక్షగా అదనంగా ధాన్యం కొలవాలి. ఈ విధంగా అహరహం పెరిగే బకాయిలతో రైతుల నడుము విరుగుతుండేది. ఈ పద్ధతి బకాయిలు రద్దు అయినట్లు భావించాలని ఆ తీర్మానం కోరింది. ఈ తీర్మానానుసారం ఈ కింది నినాదం ద్వారా ప్రజలకు అందించారు. "గత మూడు సంవత్సరాలలో అంగీకరించిన కౌలు తప్ప అదనపు కౌలు అంగీకరించకండి! పాత బాకీలు చెల్లించ నిరాకరించండి".



రెండవ తీర్మానం కూడా దీనికి సంబంధించినదే. చింతపండు, మామిడికాయలు, కూరగాయల లాంటి వాటిలో భాగం ఇవ్వరాదనేది రెండవ తీర్మానం. ధాన్యం తప్ప ఇంకే వస్తువు మక్తా కోరరాదని అందులో వుంది.

ఈ రెండు తీర్మానాలను రైతాంగం అక్షరాల అమలు జరిపారు. తప్పుడు బకాయిలన్నీ గాలిలో కలిసిపోయాయి. బహిరంగ సభలోనే తీర్మానాలు చేయడంతో రైతాంగ ప్రజల మద్దతు లభించింది. బహిరంగంగానే పిలుపు ఇవ్వడం జరిగింది. సంవత్సరాల తరబడి వారు సాధించలేనిది వెంటనే వారు అమలు జరపగలిగారు. మొత్తం ఈ బకాయిలలో న్యాయంగాని, నిజంగాని లేకపోవడంతో నైతిక ధైర్యం భూస్వాములకు కొరవడింది. ఫలితంగా వారు ఎలాంటి నిరసనా లేకుండానే అంగీకరించవలసి వచ్చింది.

అయితే 1946కు రాజకీయ పరిస్థితిలో మార్పు వచ్చింది. 93వ సెక్షన్ క్రింద గవర్నరు పరిపాలన రద్దు అయ్యింది. కాంగ్రెస్ పార్టీ మంత్రి వర్గం ఏర్పరిచింది. ఆదివాసి సేనామండలి సంస్థాపకుడు శ్రీ. బి.జి ఖేర్ ముఖ్యమంత్రి అయినాడు. మొరార్జీ హోంమంత్రి అయినాడు. థానా జిల్లా కలెక్టరు శ్రీ బెడేకర్‌ను వేరే చోటకు మార్చారు. చారిత్రకమైన బర్డోలి సత్యాగ్రహం, ఉద్యమాలను అణచేందుకు సాధనంగా పనిచేసిన శ్రీ ఆల్‌మోలా కలెక్టర్‌గా వచ్చాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, సామ్రాజ్యవాద ఏజంటుగా ఉండిన ఆల్‌మోలా, కాంగ్రెస్ ప్రభుత్వ మద్దతుదారుగా మారాడు.

గడ్డికోతకు గత సంవత్సరం డిమాండ్ చేసిన కూలినే కోరాము. అంటే అడవులలో రు. 2.50, తీర ప్రాంతాలలో రూ. 3.00 డిమాండ్ చేశాం. 1945లో ఈ కూలీ ఇచ్చారు. కనుక 1946లో సహితం అంగీకరిస్తామని మేము నమ్మకంతో వున్నాము.

1946 జూలైలో జిల్లా కలెక్టరు శ్రీ అల్‌మోలా గడ్డిపొలాల యజమానుల ప్రతినిధులకు కిసాన్‌సభ ప్రతినిధులకు మధ్య సంప్రదింపులకు సమావేశం ఏర్పాటు చేశాడు. నేను, కామ్రేడ్ పరులేకర్ సమావేశానికి వచ్చేసరికి సమావేశం వాయిదా పడిందని చెప్పారు. ఇది వాయిదా కాదు. సంప్రదింపులు అనే ఆలోచనే రద్దు అయింది. ప్రభుత్వం కిసాన్ సభను, దాని డిమాండ్లను గుర్తించరాదని నిర్ణయించుకుంది. దానికను గుణంగానే సంప్రదింపులు రద్దు అయినాయి.

అడవి పనికి కిసాన్‌సభ రూ. 1.25 రూపాయలు డిమాండ్‌చేసింది. వ్యక్తి చేయవలసిన శ్రమ, పెరుగుతున్న ధరలు, ఇతర ప్రాంతాలలో ఇస్తున్న కూలిని పరిగణనలోకి తీసుకుంటే రూ. 1.25 డిమాండ్ సహేతుకమైన కూలికన్న తక్కువే. అతి తక్కువ జీవన ప్రమాణం అనుభవించే కుటుంబం కూడా ఈ మొత్తంతో బ్రతకడం ఊహకు అందని విషయం. అయినా కోట్ల రూపాయలు లాభాలు సంపాదించిన కాంట్రాక్టర్లు ఈ తక్కువ రేటును కూడా ఇచ్చేందుకు అంగీకరించలేదు. జిల్లా మేజిస్ట్రేటు చెట్లు పడగొట్టేందుకు రోజుకు రూపాయి కూలిగా ప్రకటించారు. రూ.1.25లు ఇవ్వ నిరాకరించేందుకు కాంట్రాక్టర్లను పరోక్షంగా ప్రోత్సహించడమే ఇది. 1945లో కన్నా 1946లో గడ్డికి మంచి రేటు వచ్చింది. 1945లో గడ్డిపొలాల యజమానులు కిసాన్ సభ డిమాండ్‌ను మించే కూలి చెల్లించారు. కీర్తిశేషులు శ్రీ దండేకర్ ఓ ప్రకటనలో కిసాన్ సభ డిమాండ్లు సహేతుకమైనవేనని అంగీకరించారు. ఇవన్నీ జరిగినా, కిసాన్ సభ పలుకుబడిని ప్రతి మలుపులోనూ దెబ్బతీయాలనే ఉద్దేశ్యంతో శ్రీ అల్‌మోలా 500 పౌనుల గడ్డికోతకు రు. 1.50, 2.00 కూలీగా నిర్ణయించాడు. ఎక్కువ చెల్లించేందుకు సిద్ధపడిన భూస్వాములు కూడా వెనుకడుగువేశారు. తగ్గించిన రేట్లకు గడ్డికోసేందుకు ఆదివాసులు సంసిద్ధం కాలేదు. మరలా ఇది వివాదాంశంగా తయారైంది. అడవి పనికి, గడ్డికోతకు తమ డిమాండ్లు నెరవేరే వరకూ సమ్మె చేయాలని కిసాన్ సభ పిలుపు ఇచ్చింది.

ఆదివాసుల ఐక్యత అమోఘం. వారి నిర్మాణంలో ఎక్కడా బలహీనమైన లింకు లేదు. అందువల్లనే సమ్మెకు పిలుపు ఇచ్చిన 48 గంటలలోనే చుట్టూతా మైళ్లకొద్దీ వున్న అడవి మూగబోయింది. అడవులలో పని ఆగిపోయింది.

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. దోపిడి వర్గాల మెడలు వంచిన ఆదివాసుల పోరాటం
   గోదావరి పరులేకర్ ........ 2
2. అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో దక్షిణాసియా పురోగమనం
   సీతారాం ఏచూరి ............. 4
3. సామాజిక న్యాయం-కమ్యూనిస్టు దృక్పథం
   ఎస్. వీరయ్య ................. 9
4. అక్టోబరు విప్లవం వైపు బోల్షివిక్‌ల పురోగమనం ...............................
   ఆర్.అరుణ్ కుమార్ ........ 12
5. కొత్త శకంలోకి చైనా సోషలిజం
   ఎస్. వెంకట్రావు ............ 14
6. కులాల 'గీత'లు గీసిన భగవద్గీత
   తెలకపల్లి రవి ................ 19
7. వర్గ పోరాటం అదనపు విలువ పంపిణీ
   ఎ. కోటిరెడ్డి ..................... 23
8. దిక్కుతోచని స్థితిలో భారత ఆర్థికవ్యవస్థ
   వి. శ్రీధర్..................... 27
9. ప్రజారోగ్యాన్ని నాశనం చేసే 'నీట్'
   ఎ. కలయారసన్ ........... 31
10. బూర్జువా పార్టీల్లాగా సిపిఎం అధికారం కోసం ప్రజలను మభ్యపెట్టదు
   బివి. రాఘవులు ............. 34



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**

**బి.వి. రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్. వీరయ్య**

**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:
**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్:** ఎడిటోరియల్ **9490099333**
**మేనేజర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# చరిత్ర

గతాన్ని గుప్పెట్లో పెట్టుకున్న వాడే భవిష్యత్తును శాసిస్తాడు అని 1984 నవలలో జార్జి ఓర్వెల్ చెప్పిన మాటలు నియంతలకు వర్తిస్తాయి. చరిత్రలో ప్రతి నియంత అధికారం చేపట్టగానే పాత చరిత్ర గ్రంథాలను నాశనం చేసి తనకు అనుకూలమైన చరిత్ర రాసుకోడానికి ప్రయత్నించాడు. చరిత్ర అంటే వారి దృష్టిలో ఒక రాజు స్థానంలో మరో రాజు, ఒక చక్రవర్తి స్థానంలో మరో చక్రవర్తి వచ్చి పరిపాలించడమే. కానీ చరిత్ర ప్రజల చేత నిర్మించబడుతుందన్న విషయం వారికి అర్థం కాదు. "థెబెస్ నగరపు ఏడు ద్వారాలు నిర్మించిందెవరు?/ రాజులు నిర్మించారని పుస్తకాలు నిండా రాశారు./ పెద్దపెద్ద బండరాళ్లను రాజులు లాగారా?" అని జర్మన్ రచయిత బ్రెఫ్ట్ ప్రశ్నిస్తే, "నైలు నదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది?/ తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవరు?" అని మహా కవి శ్రీశ్రీ గొంతెత్తారు.

ఏ యుద్ధం ఎందుకు జరిగిందో, ఏ రాజ్యం ఎన్నాళ్లుందో తారీఖులు దస్తావేజులు చరిత్ర కాదు. కానీ ప్రపంచ నియంతలందరి మాదిరిగానే మన దేశంలో సంఘపరివార్ శక్తులకు కూడా చరిత్ర అంటే యుద్ధాలు, రాజులు మాత్రమే. నియంతలందరి మాదిరిగానే వారు కూడా భవిష్యత్తును శాసించడానికి గతాన్ని గుప్పెట్లో పెట్టుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నంలో భాగమే చరిత్రను వారి మతతత్వ సిద్ధాంతానికి అనుగుణంగా మార్చడానికి చేస్తున్న ప్రయత్నాలు. ఆర్‌ఎస్‌ఎస్ పరివార్ దృష్టిలో మనది భారత దేశం కాదు, హిందూ దేశం. హిందువుల దేశం. కానీ హిందువులంటే ఎవరు? ఆర్యవర్తం నుండి మన దేశానికి వలస వచ్చిన పశుకాపరులైన ఆర్యులా, లేక అప్పటికే హరప్పా, మొహెంజొదారో వంటి గొప్ప నగరాలు నిర్మించుకున్న ఆర్యేతర నాగరికులా? వేదాలను ప్రమాణంగా తీసుకుని అనుత్పాదక వృత్తుల్లో స్థిరపడ్డ అగ్రవర్ణాలా, లేక ఉత్పాదక వృత్తుల్లోకి నెట్టబడ్డ శ్రామిక వర్గాలా? మన దేశ చరిత్ర కాషాయ సిద్ధాంతాన్ని అంగీకరించడం లేదు కనుక వాళ్లు చరిత్రనే తమ సిద్ధాంతానికి అనుగుణంగా మార్చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

చరిత్రను తమ గుప్పిట్లోకి తీసుకోడానికి సంఘపరివార్ శక్తులు చేస్తున్న ఈ ప్రయత్నంలో భాగంగానే నిన్న బాబ్రీ మసీదుపై రాద్ధాంత చేశారు, నేడు తాజ్‌మహల్‌పై చేస్తున్నారు. బాబ్రీ మసీదు కింద రామాలయం ఉందన్న పేరుతో చారిత్రక కట్టడాన్ని 1992లో కూల్చేశారు. ఇప్పుడు భారత దేశానికే తలమానికంగా ఉన్న తాజ్‌మహల్ కింద హిందూ దేవాలయం ఉందన్న ప్రచారాన్ని లంకించుకున్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను వీరోచితంగా ఎదురొడ్డిన టిప్పుసుల్తాన్‌ను దేశద్రోహిగా మార్చి ప్రచారం చేస్తున్నారు, మొఘలులను విదేశీయులుగా చిత్రీకరిస్తున్నారు. వాజ్‌పేయి నాయకత్వంలోని నాటి ఎన్డీఏ ప్రభుత్వ హయాంలోనే చరిత్రను మార్చివేసే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వంలో మరింత నగ్నంగా సాగుతోంది. నియంతృత్వ శక్తుల చేతుల్లో చరిత్ర ఎంతగా వక్రీకరణకు గురైనా అది తనను తాను సరిచేసుకుంటుంది. నరహంతకుడు హిట్లర్ జర్మన్ చరిత్రను వక్రీకరించాడు. కానీ నాజీల ఓటమితో మళ్లీ చరిత్ర సరిచేయబడింది. కానీ దానికి చాలా మూల్యం చెల్లించబడింది. తమ నియంతృత్వ పాలనను మరింత స్థిరపరుచుకోడానికి సంఘ్ పరివారం మన దేశ చరిత్రను వక్రీకరిస్తోంది. మన దేశమూ పెద్ద మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి రాకముందే లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఏకోన్ముఖంగా దాని ప్రయత్నాలను తిప్పికొట్టాలి.


**చందా వివరాలు**

విడిప్రతిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో దక్షిణాసియా పురోగమనం



రచయిత సిపిఎం ప్రధాన కార్యదర్శి

**సీతారాం ఏచూరి**

*(మహత్తర అక్టోబర్ విప్లవ శత వార్షికోత్సవాలను పురస్కరించుకుని 2017 సెప్టెంబరు 23-24 తేదీల్లో కేరళలోని కోచిలో సిపిఐ(ఎం) ఆధ్వర్యాన జరిగిన దక్షిణాసియా కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ప్రాంతీయ సదస్సులో ఏచూరి చేసిన ఆహ్వాన ప్రసంగ పూర్తి పాఠం ఈ దిగువనిస్తున్నాం- సంపాదకులు)*

నేడు మన ప్రాంతం (దక్షిణాసియా) ఎదుర్కొంటున్న సవాళ్లలో 'సామ్రాజ్యవాదం- జాతీయ సార్వభౌమత్వం- మతోన్మాదం- మత సంకుచితవాదం' అత్యంత ముఖ్యమైనవి. ఆ ఉద్దేశంతోనే సదస్సులో చర్చకు ఈ అంశాన్ని ఎంపికచేశాం. ఆయా దేశాల్లోని నిర్దిష్ట పరిస్థితులను విశ్లేషించి, వాటికి భాష్యాలు చెప్పడమే గాక, ఆ పరిస్థితులను మార్చాల్సిన బాధ్యత కూడా కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలుగా మనపై వున్నది. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న ఈ సవాళ్లను విశ్లేషించి, ఆయా నిర్దిష్ట పరిస్థితుల కనుగుణంగా మన స్పందన ఏ విధంగా ఉండాలో నిర్ణయించుకోవాల్సివుంది. పైన పేర్కొన్న నాలుగు అంశాలపై పోరాటాలు మన ప్రపంచంతో ఏదో ఒక విధంగా అంతస్సంబంధం కలిగివున్నవేననేది మా గట్టి విశ్వాసం. మన దేశాల్లో దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా, సకల మానవాళి విముక్తి కోసం సాగే పోరాటాల్లో అంతిమ విజయం చేకూరాలంటే, సామ్రాజ్యవాద వ్యతిరేకత, జాతీయ సార్వభౌమత్వ పరిరక్షణ, మతోన్మాదం, మత సంకుచిత వాదాల్ని ఓడించడం అనే ఈ నాలుగు రంగాల్లో విజయం సాధించాలి.

**అక్టోబర్ విప్లవ వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలి**

అక్టోబర్ విప్లవ ఫలితంగా ఆవిర్భవించిన సోవియట్ యూనియన్ నేడు కనుమరుగయింది. చరిత్ర పుటలకే పరిమితమైపోయిన ఆ విప్ల వాత్మక ఘటన శతవార్షికోత్సవాలను కమ్యూని స్టులు ప్రపంచ వ్యాపితంగా ఎందుకు జరుపు తున్నారని కొందరు మమ్మల్ని కొంటెగా ప్రశ్నిస్తు న్నారు. మానవాళి గతినే మార్చేసిన ఇరవయ్యో శతాబ్ది చరిత్రలో సోవియట్ రష్యా చాలా గొప్ప పాత్ర నిర్వహించింది. అది మానవాళి విముక్తికి ఎంతగా పాటుపడిందో యావత్ ప్రపంచానికి ఎరుకే. నేడు మనం ఇరవయ్యొకటో శతాబ్దిలో వున్నాము. ఏమాత్రమూ ఉనికిలో లేని ఆ ఘటన నుంచి నేర్చుకోవాల్సిందేముంటుందని ఎవరైనా అనొచ్చు. సోవియట్ రష్యా నేడు లేకపోవచ్చు. కానీ ఆ విప్లవం అందించిన స్ఫూర్తి ఇప్పటికీ చెక్కు చెదరలేదు. నేటి ప్రపంచంలో పెట్టుబడి దారీ వ్యవస్థ నుంచి సోషలిజానికి మానవాళి సాగించే పరివర్తనకు అదొక ఇరుసులా వుంటుం ది. ఆ విప్లవ వారసత్వం నాలుగు అంశాల్లో ఇప్పటికీ కొనసాగుతోంది. మానవాళి బంధ విముక్తి కోసం సాగే పోరాటాలను ముందుకు గొనిపోవడంలో కీలక భూమిక వహించిన ఆ నాలుగు అంశాల గురించి క్లుప్తంగా వివరిస్తాను.

1. పెట్టుబడిదారీ అభివృద్ధి సూత్రాల ఆధారంగా సమకాలీన ప్రపంచ పరిస్థితికి సంబంధించిన మార్క్సిస్టు అవగాహనను లెనిన్ మరింత మెరుగుపరిచాడు. పెట్టుబడి కేంద్రీకరణ, సంచయం పెట్టుబడిదారీ గుత్తాధిపత్యం ఏర్పడడానికి, దారితీసే నియమాలను మార్క్స్ గుర్తిస్తే, ఆ గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ అంతిమంగా సామ్రాజ్యవాద దశకు ఎలా దారి తీస్తుందో చెప్పడం ద్వారా లెనిన్ దానిని మరింత విస్తృతపరిచే ప్రయత్నం చేశాడు. ఈ సంక్లిష్టతలన్నిటి మధ్య ఒక విషయం స్పష్టం. సామ్రాజ్యవాదం యావత్ ప్రపంచాన్ని పెట్టుబడిదారీ దోపిడీ కక్ష్యలోకి తీసుకొచ్చింది. అదే సమయంలో ప్రపంచ వనరులపై ఆధిపత్యం కోసం ఈ సామ్రాజ్యవాద కేంద్రాల మధ్య తీవ్ర వైరుధ్యం కూడా వుంది. మార్క్సిజాన్ని సైద్ధాంతికంగా మరింత అభివృద్ధి పరచిన లెనిన్, సామ్రాజ్యవాద గొలుసును బద్దలు కొట్టా లంటే దానిలోని బలహీనమైన లింకును పట్టు కుని అక్కడ దెబ్బ కొట్టాలని చెప్పాడు. ఈ బలహీన లింకు ఇరవయ్యో శతాబ్ది మొదటి రెండు దశాబ్దాల్లో అంటే మొదటి ప్రపంచ యుద్ధం ఉధృతంగా వున్న సమయంలో బయట పడి, రష్యాలో అంతమైంది. రష్యన్ కార్మిక వర్గం సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధాన్ని విమోచన కోసం సాగే అంతర్యుద్ధంగా మలచడంలో సఫలీకృతమైంది. దీనిని బట్టి స్పష్టమయ్యే దేమిటంటే ప్రస్తుత పరిస్థితుల్లో సామ్రాజ్య వాదాన్ని నికరంగా వ్యతిరేకించకుండా ప్రపం చంలో ఏ దేశమూ విప్లవాత్మకంగా ఒక్క అడుగు కూడా ముందుకువేయజాలదు.

అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి ఆధ్వర్యంలో నడుస్తున్న నేటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగంలో సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యం అంతగా బయటకు రావడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో సామ్రాజ్యవాదంపై వర్గ పోరాటాన్ని ఉధృతం చేయకుండా పెట్టుబడిదారీ వర్గ పాలనపై రాజకీయ దాడిని ముందుకు తీసుకెళ్ల లేము. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ గొలుసులో బలహీన లింకులు వున్న దేశాల్లో ఈ పోరాటం పెద్దయెత్తున సాగించాల్సిన ఆవశ్యకత చాలా వున్నది.

2. సాపేక్షంగా చూస్తే, అంతగా అభివృద్ధి చెందని పెట్టుబడిదారీ రష్యాలో సామ్రాజ్యవాద గొలుసును అక్టోబర్ విప్లవం బద్దలుగొట్టింది. బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లోనే పెట్టుబడిదారీ వ్యవస్థ నుంచి సోషలిజా

నికి పరివర్తన మొదలవుతుందనేది అప్పటివరకు వున్న భావన. జర్మనీ సోషలిస్టు విప్లవకారులు కార్ల్ లీబ్‌నెక్, రోజా లగ్సెంబర్గ్‌ల హత్యతో జర్మన్ విప్లవం విఫలమైంది. అభివృద్ధి చెందిన జర్మన్ కార్మికవర్గం వెనుకబడిన రష్యన్ కార్మికవర్గాన్ని సామాజిక పరివర్తన దిశగా నడిపించడంలో ముందుంటుందని లెనిన్ ఆశించాడు. కానీ, అది విఫలమవ్వడంతో రష్యాలో సోషలిజాన్ని కాపాడుకోవడం ఓ సవాల్‌గా మారింది. ఒక దేశంలో సోషలిజం అన్న భావనతోపాటు వెనుక బడిన ఆర్థిక వ్యవస్థలో సైతం సోషలిజానికి

> **“ భారత్‌లో సిపిఐ(ఎం) ప్రజాతంత్ర విప్లవ దశ పూర్తి చేసేందుకు వ్యూహాత్మక లక్ష్యాన్ని నిర్ణయించుకుంది. సామ్రాజ్యవాదం, భూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారీ గుత్తాధిపత్యం ఈ మూడింటికి వ్యతిరేకంగా పోరాడడమే ఆ లక్ష్యం. సోషలిస్టు విప్లవ దశ వైపు సాగేందుకు ఈ మూడు కనీస కర్తవ్యాలను నిర్వర్తించాల్సి వుంటుంది. ”**




కోచిలో జరిగిన దక్షిణాసియా కమ్యూనిస్టు, వామపక్ష పార్టీల సదస్సులో ప్రసంగిస్తున్న సీతారామ్ ఏచూరి

పరివర్తన సాధ్యమేనని విప్లవ దశలకు సంబంధించిన సిద్ధాంతంలో లెనిన్ విశదీకరించాడు. అక్టోబర్ విప్లవ అనుభవంతో ప్రజాతంత్ర విప్లవ దశ నుంచి సోషలిస్టు విప్లవ దశకు పరివర్తన సాధించవచ్చున్న లెనిన్ సూత్రీకరణ ఇప్పటికీ ప్రాధాన్యత కలిగివుంది..

భారత్‌లో సిపిఐ(ఎం) ప్రజాతంత్ర విప్లవ దశ పూర్తి చేసేందుకు వ్యూహాత్మక లక్ష్యాన్ని నిర్ణయించుకుంది. సామ్రాజ్యవాదం, భూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారీ గుత్తాధిపత్యం ఈ మూడింటికి వ్యతిరేకంగా పోరాడడమే ఆ లక్ష్యం. సోషలిస్టు విప్లవ దశ వైపు సాగేందుకు ఈ మూడు కనీస కర్తవ్యాలను నిర్వర్తించాల్సి వుంటుంది.

3. వెనకబడిన దేశంలో సైతం విప్లవం విజయం సాధించాలంటే దానికి కార్మిక కర్షక ఐక్యత అత్యంత ఆవశ్యకం. పారిస్ కమ్యూన్ నుంచి తీసుకోవాల్సిన గుణపాఠం ఇదే. పారిస్ కమ్యూన్‌లో రైతులను తమ వైపు సమీకరించి, కమ్యూనార్డులకు వ్యతిరేకంగా వారిని నిలపడంలో పాలకవర్గాలు విజయవంతమయ్యాయి. దీనిని దృష్టిలో వుంచుకునే లెనిన్, వ్యవసాయ రంగంలో దోపిడీకి గురైన వర్గాలను విప్లవంలో కలిసొచ్చే మిత్రులుగా పరిగణించాలని నొక్కి చెప్పాడు. కార్మికవర్గ నాయకత్వంలో కార్మిక–కర్షక ఐక్యత అనేది సామాజిక పరివర్తన కోసం పోరాడే విప్లవకారుల చేతిలో ఒక తిరుగులేని ఆయుధంగా వుంటుంది. దక్షిణాసియా దేశాల్లో వ్యవసాయంపై ఆధారపడేవారు, గ్రామీణులు చాలా పెద్ద సంఖ్యలో వున్నారు. ఈ రీత్యా వర్గ పోరాటాన్ని ముందుకుగొనిపోయేందుకు కార్మిక కర్షక ఐక్యత తప్పనిసరి.

4. జాతీయ, వలసవాద సమస్యలపై లెనిన్ రాసిన సిద్ధాంత పత్రంలో వలసవాద వ్యతిరేక పోరాటాలను, సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రపంచ పోరాటాలతో మేళవించాల్సిన ఆవశ్యకత గురించి వివరించాడు. ప్రపంచవ్యాపితంగా సాగిన జాతీయ విమోచనా ఉద్యమాలను అర్థం చేసుకోవడానికి ఈ అవగాహన ఎంతగానో ఉపయోగపడింది. నాడు ఫ్రాన్స్‌లో నివసిస్తున్న హోచిమిన్ వియత్నాంలో ఫ్రెంచ్ దురాక్రమణకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టడానికి ఇదే ప్రేరణ నిచ్చింది. ఆ తరువాత రోజుల్లో హోచిమిన్ వీటిని నెమరువేసుకుంటూ దాని ప్రభావం గురించి ఇలా వివరిస్తాడు. “.... ఐ హ్యూమనైట్ పబ్లిషర్స్ ప్రచురించిన ‘జాతీయ , వలసవాదంపై లెనిన్ థీసిస్’ ప్రతినొకదానిని ఓ కామ్రేడ్ నాకు ఇచ్చి చదవమన్నాడు. ఆ సిద్ధాంత పత్రంలో వాడిన రాజకీయ పదబంధాలు ఒక పట్టాన బోధపడలేదు. దాంతో ఒకటికి రెండు సార్లు పట్టుదలతో చదివి చివరికి అందులోని ముఖ్య సారాంశాన్ని గ్రహించాను. అది నాకు చెప్ప లేనంత సంతోషాన్నిచ్చింది. నాలో కొండంత విశ్వాసాన్ని నింపింది. నా ఆలోచనలను పదు నుదేలేలా చేసింది. కళ్ల నుంచి ఆనంద బాష్పాలు రాలాయి. నేనొక్కడినే నా గదిలో కూర్చొని గట్టిగా అరిచాను. భారీ బహిరంగ సభనుద్దేశించి మాట్లాడేటప్పుడు గొంతు ఎలా బిగ్గరగా వుం టుందో ఆ మాదిరి స్వరం పెంచుతూ – “ప్రియమైన సహచరులారా! మన విమోచనకు ఏం కావాలో అది దొరికింది. ఇదే అసలైన మార్గం.” (లెనినిజం వెలుగులో నా పయనం, 1960, హోచిమిన్ సంకలిత రచనలు నాల్గవ సంపుటం నుంచి)

ఈనాడున్న ప్రపంచ పరిస్థితుల్లో సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రపంచ పోరాటాలను బలోపేతం గావించడం విప్లవకారులుగా మన ముందున్న ఒక ముఖ్యమైన కర్తవ్యం! వివిధ దేశాల్లో మరీ ముఖ్యంగా లాటిన్ అమెరికాలో ఈ పోరాటాలు విస్తృతంగా సాగుతున్నాయి. ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ఒకవైపు,

> "ఈ సంక్షోభం సామ్రాజ్యవాద దుందుడుకు స్వభావాన్ని, మానవాళిపై ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సాగించే క్రూరమైన దాడిని కళ్లకు కట్టింది. ప్రపంచ ఆధిపత్యం కోసం సామ్రాజ్య వాదం ఎలా తహతహలాడుతున్నదీ, మానవాళి సంపూర్ణ వికాసాన్ని, విముక్తిని, పురోభివృద్ధిని అది ఎలా అడ్డుకుంటున్నదీ తేటతెల్లం చేసింది."



కొచిలో దక్షిణాసియా కమ్యూనిస్టు, వామపక్ష పార్టీల సదస్సు జరిగిన ప్రాంగణం

సామ్రాజ్యవాద సైనిక జోక్యాలు, దాని అకృత్యాలకు వ్యతిరేకంగా మరో వైపు పోరాటాలు సాగుతున్నాయి.. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశీయంగా, ప్రపంచ స్థాయిలో జరిగే ఈ పోరాటాలు రెంటిని మేళవించి ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం వుంది. ఈ ప్రపంచ వ్యాపిత పోరాట శక్తి పెరిగేదానిపైనే మానవాళి విమోచన, సోషలిజం దిశగా అది సాగించే పరివర్తనా క్రమం ఆధారపడి వుంది.

అక్టోబర్ విప్లవ వారసత్వం నాలుగు ముఖ్యమైన అంశాలను ముందుకు తెచ్చింది. ఆ విప్లవ ప్రాధాన్యతను చాటి చెప్పేవే ఈ నాలుగు అంశాలు..

**ప్రస్తుత పెట్టుబడిదారీ సంక్షోభం**

ప్రస్తుత పెట్టుబడిదారీ సంక్షోభం, అది చూపుతున్న ప్రభావాలను బట్టి ఇది 1930 నాటి మహా మాంద్యం కన్నా తీవ్రమైనదని అర్థమవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ శాశ్వత లక్షణాలైన అణచివేత, దోపిడీ తీరును ఇది మరోసారి తిరుగులేని రీతిలో బయటపెట్టింది. ఈ సంక్షోభం ప్రపంచంలోని అసంఖ్యాక ప్రజానీకాన్ని అనేక విధాలుగా ఇక్కట్ల పాల్జేసింది. ఈ సంక్షోభం సామ్రాజ్యవాద దుందుడుకు స్వభావాన్ని, మానవాళిపై ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సాగించే క్రూరమైన దాడిని కళ్లకు కట్టింది. ప్రపంచ ఆధిపత్యం కోసం సామ్రాజ్య వాదం ఎలా తహతహలాడుతున్నదీ, మానవాళి సంపూర్ణ వికాసాన్ని, విముక్తిని, పురోభివృద్ధిని అది ఎలా అడ్డుకుంటున్నదీ తేటతెల్లం చేసింది.

అంతర్జాతీయ వర్గ శక్తుల బలాబలాల పొందిక సామ్రాజ్యవాదానికి అనుకూలంగా వున్న దరిమిలా అమెరికా మూడు ప్రకటిత లక్ష్యా ల ద్వారా తన ప్రపంచాధిపత్యాన్ని పటిష్టపరచు కోవాలని చూస్తున్నది. ఆ మూడు లక్ష్యాల్లో మొదటిది, మిగిలిన సోషలిస్టు దేశాలను రద్దు చేయడం. రెండవది, మూడవ ప్రపంచ దేశాలను అదిరించో బెదిరించో తన దారికి తెచ్చుకోవడం, ఈ విషయంలో ఇప్పటికే దాని ప్రయత్నాలు కొంతమేర ఫలించాయి. వలసపాలన నుంచి బయటపడ్డ తృతీయ ప్రపంచ దేశాలు ఏర్పాటు చేసుకున్న అలీనోద్యమ కూటమిపై ఒత్తిడి తెచ్చి తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. మూడవది, ప్రపంచంపై స్పష్టమైన సైనిక, ఆర్థిక ఆధిపత్యాన్ని చలాయించడం, ప్రత్యేకించి తనకు పోటీదారులుగా ముందుకొస్తున్నట్లు గ్రహించిన దేశాలను బలహీనపరచడం ఒక కార్యక్రమంగా పెట్టుకుంది. దీనిని అన్ని రంగాల్లో అమలు చేసేందుకు కొత్త ప్రపంచ క్రమాన్ని రూపొందిస్తున్నది. ఏకపక్ష యుద్ధాలు, సైనిక దురాక్రమణలు, సాయుధ శక్తిని విపరీతంగా పెంచడం వంటి చర్యలొక వైపు చేపడుతూ, మరో వైపు తన ఆర్థిక ఆధిపత్యాన్ని చలాయించడం ద్వారా ప్రపంచాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్నది.

సామ్రాజ్యవాద దశలో భాగమైన ప్రస్తుత ఈ ప్రపంచీకరణ పెద్దయెత్తున పెట్టుబడి కేంద్రీకరణకు, సంచయనానికి, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి నాయకత్వంలో పెట్టుబడి పోగుపడడానికి దారి తీస్తోంది. గత రెండు దశాబ్దాల అనుభవం దీనినే రుజువుచేస్తున్నది. పెట్టుబడి ఎక్కడికి కావాలంటే అక్కడికి నిరాఘాటంగా వెళ్లడానికి, ప్రపంచ వనరులను యథేచ్ఛగా కొల్లగొట్టడానికి వీలుగా ప్రపంచ క్రమాన్ని తిరిగి రూపొందిస్తున్నది. ఆర్థిక సరళీకరణ విధానాలను ముందుకు తీసుకెళ్లేందుకు పెట్టుబడి ప్రవాహానికి ఎక్కడా ఎలాంటి ఆంక్షలు లేకుండా చూడాలని అమెరికా షరతులు పెడుతోంది. దీనికి తోడు ఆర్థిక సంస్కరణల రూపంలో నయా ఉదారవాద విధానాల దాడి జోరందుకుంది. ఈ విధానాలు ప్రపంచ దేశాలకు అందునా వర్ధమాన దేశాల ఆర్థిక, రాజకీయ సార్వభౌమత్వానికి పెను ముప్పుగా దాపురించాయి.

**నయా ఉదారవాద దాడి**

గరిష్టస్థాయిలో లాభాలు పోగేసుకునేందుకు అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి, నయా ఉదారవాద విధానాల ఆదేశాలకనుగుణంగా ఈ కొత్త ప్రపంచ క్రమం రూపుదిద్దుకుంటున్నది. సరుకులు, పెట్టుబడి ప్రవాహానికి ఎలాంటి హద్దులు లేకుండా ప్రభుత్వ విధానాల పరంగా ఆంక్షలను తొలగించడం ఇందులో మొదటి పద్ధతి. వాణిజ్య సరళీకరణ వచ్చాక, ప్రత్యేకించి వర్ధమాన దేశాల్లో దేశీయ ఉత్పత్తిదారులను నిర్మూలించి, దేశీయ పరిశ్రమలను నాశనం చేస్తుంది. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఈ ధోరణి కనిపిస్తోంది. ఉత్పత్తి, వ్యాపార కార్య కలాపాలను బయట దేశాలకు తరలించడం పెట్టుబడి ప్రవాహానికి ఆంక్షలు లేకుండా చూడడం ద్వారా బహుళజాతి కంపెనీలు బయటి దేశాల్లో పెద్దయెత్తున ఉత్పాదక ఆస్తులను పోగేసుకోవడం, పెట్టుబడులను విస్తరింపజేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నాయి.. సమకాలీన సామ్రాజ్యవాదం కొత్త లక్షణమేమిటంటే, గరిష్టంగా లాభాలు ఆర్జించడం కోసం

ఒక వైపు నిర్బంధ పద్ధతులను అను సరిస్తూ, మరో వైపు ఇంతవరకు ఎక్కడా ఉనికిలో లేనటువంటి కొత్త దారులను వెతుకుతున్నది. పెట్టుబడిదారీ ప్రపంచమంతటా ముఖ్యంగా భారత్ లాంటి వర్ధమాన దేశాల్లో నయా ఉదారవాద దాడి పెట్టుబడుల ఉపసంహరణ, ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ రూపంలో సాగుతోంది. ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ అంటే ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం ద్వారా ప్రైవేట్ ఆస్తులు పెద్దయెత్తున పోగుపడేలా చూడడం. విద్య, వైద్యం, పౌర వసతులు, నీరు, ఇంధనం వంటి రంగాల్లో ప్రైవేటు పెట్టుబడి పెద్దయెత్తున పోగుపడేందుకు దోహదపడడం. వ్యవసాయ రంగంలోకి బహుళజాతి విత్తన, మార్కెటింగ్ కంపెనీలకు తలుపులు బార్లా తెరవడం ద్వారా వర్ధమాన దేశాల్లో వ్యవసాయ స్వావలంబనకు విఘాతమేర్పడుతోంది. ఇది రైతులను కష్టాల కొలిమిలోకి నెడుతోంది. వాణిజ్య సుంకాల తొలగింపు, బలవంతంగా రుద్దుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు వర్ధమాన దేశాలను చాలావరకు పారిశ్రామిక రహితంగా మార్చేస్తున్నాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజ్యం ఏ రూపంలో ఉన్నప్పటికీ అది నిరంకుశ పోకడలు పోతుంది. సమకాలీన సామ్రాజ్యవాద యుగంలో రాజ్యం పాత్ర అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి ప్రయోజనాలను మరింత ముందుకు తీసుకెళ్లడమే కాదు, దాని ప్రస్తుత అవసరాలను తీర్చే పని కూడా చేస్తుంది. సామాజిక బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పుకోవడం, ప్రజల పట్ల తన విద్యుక్త ధర్మాన్ని విస్మరించడాన్ని ఆర్థిక కార్యకలాపాల నుంచి అది వెనక్కి మళ్లడంగా మాత్రమే చూడరాదు. అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి ప్రయోజనాలను పరిరక్షించడానికనుగుణంగా రాజ్యం తన పాత్రను మార్చుకుంటోంది. ఈ క్రమంలో సామాజిక బాధ్యతను విస్మరించడం, ప్రజాతంత్ర సంస్థలను బలహీన పరచడం వంటి చర్యలకు అది ఒడిగడుతున్నది. శాసన నిర్మాణ ప్రక్రియపై ప్రజా సార్వభౌమత్వాన్ని హరించివేసి, నిరంకుశ పోకడలను అంతకంతకూ తీవ్రతరం చేస్తోంది.

**సామ్రాజ్యవాద దూకుడు, ముందుకొస్తున్న మత ఛాందసవాదం**

ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని సుస్థిర పరచుకునేందుకు ప్రపంచ ఆర్థిక వనరులపై మరీ ముఖ్యంగా చమురు, ఇంధన వనరులపై తన ఆధిపత్యాన్ని మరింతగా పెంచుకోవాలని

> **"అవి వామపక్ష, ప్రగతిశీల శక్తులపై ఒక పథకం ప్రకారం దాడి సాగిస్తున్నాయి. వాటిని బలహీన పరిచి, తామే అసలైన సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులమని మత ఛాందసవాద శక్తులు ప్రకటించుకుంటాయి. నిజానికి ఈ రెండూ కలిసి వామపక్ష శక్తులను బలహీనపరచేందుకు ప్రయత్నిస్తుంటాయి."**




దక్షిణాసియా కమ్యూనిస్టు, వామపక్ష పార్టీల సదస్సులో ఒక సమావేశం

అమెరికన్ సామ్రాజ్యవాదం తహతహలాడుతున్నది. ఇందుకోసమే అది పశ్చిమాసియాలో తిష్టవేసింది. పశ్చిమ, మధ్య ఆసియాలోచమురు, సహజవాయువు వంటి వనరులపై పట్టు బిగించేందుకు అమెరికా రూపొందించిన వ్యూహంలో ఆఫ్ఘనిస్తాన్ కీలక స్థానమాక్రమించడానికి ఇదొక ముఖ్య కారణం. ఈ ప్రాంతంలో ఇజ్రాయిల్ బలీయమైన సైనిక శక్తిగా ఎదగడానికి, పశ్చిమాసియా రావణకాష్టంలా రగులుతుండడానికి అమెరికా రాజకీయ, సైనిక జోక్యమే కారణం. తన మాట వినని ప్రభుత్వాలను కూలదోయడం, రాజకీయాలను శాసించడం వంటి చర్యల ద్వారా ఈ ప్రాంత వనరులను వశపరచుకోవాలని అమెరికా చూస్తున్నది. ఈ క్రమంలో తనకు అడ్డుతగిలిన ప్రభుత్వాలను కూల్చివేయడం తనకు సంక్రమించిన చట్టబద్ధ హక్కుగా అమెరికా భావిస్తున్నది. అది ప్రభుత్వాల్ని కూల్చిన చోటల్లా పచ్చి మితవాద లేదా మతోన్మాద శక్తులు తలెత్తుతున్నాయి. అవి వామపక్ష, ప్రగతిశీల శక్తులపై ఒక పథకం ప్రకారం దాడి సాగిస్తున్నాయి. వాటిని బలహీన పరిచి, తామే అసలైన సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులమని మత ఛాందసవాద శక్తులు ప్రకటించుకుంటాయి. నిజానికి ఈ రెండూ కలిసి వామపక్ష శక్తులను బలహీనపరచేందుకు ప్రయత్నిస్తుంటాయి. ఇరాక్‌ను అమెరికా సైన్యం ఆక్రమించుకున్నాక అక్కడ మతపరమైన చీలికలను తీవ్రతరం చేసింది, లౌకిక సమాజాన్ని నాశనం చేసింది. గతంలో ఇరాన్‌లో చమురు వనరులపై ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి అమెరికా తనకు తొత్తుగా వున్న షా ప్రభుత్వాన్ని అక్కడ ప్రతిష్టించింది. ఆ ప్రభుత్వం ఒక పథకం ప్రకారం కమ్యూనిస్టులపై క్రూర దాడులకు పాల్పడింది. అనేకమందిని చిత్రహింసల పాల్జేసింది. అభ్యుదయగాముక శక్తులు వదిలివెళ్లిన ఆ శూన్యాన్ని ఇస్లామిక్ మత గురువులు ఆక్రమించి, ప్రధాన ప్రతిపక్షంగా అవతరించారు. ఆఫ్ఘనిస్తాన్‌లోనూ ఇదే కథ పునరావృతమైంది. అక్కడ ఆనాటి సోవియట్ యూనియన్ బలపరచిన ప్రగతిశీల శక్తుల ఆధ్వర్యంలోని ప్రభుత్వాన్ని కూల్చేందుకు ముజాహిదీన్– తాలిబాన్– ఒసామాబిన్ లాడెన్ వంటి మతోన్మాద శక్తులను అమెరికానే సృష్టించి, వాటిని ఆ ప్రభుత్వంపైకి ఎగదోసింది. ఈ పరిస్థితుల్లో మెజారిటీ మతోన్మాదంపైన, మైనార్టీ మత ఛాందసవాదానికి సంబంధించిన ఇతర వ్యక్తీకరణలన్నిటిపైనా నికరంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా వుంది. మతతత్వ శక్తులు ఆధునిక భారత దేశ లౌకిక, ప్రజాతంత్ర పునాదులను (అంతులేని అసహనం, ఫాసిస్టు 'హిందూ రాష్ట్ర' తో కూడిన ఆరెస్సెస్ విజన్‌కి అనుగుణంగా) బలహీన పరచడంతోబాటు మన వర్గ శక్తుల సమీకరణకు ముందస్తు షరతు అయిన ప్రజాతంత్ర హక్కులపై పెద్దయెత్తున దాడులకు తెగబడుతున్నాయి. ఈ శక్తులే మన ప్రజల్లో మత పరమైన అప్పీళ్లు చేసి, విద్వేషాలను రెచ్చగొడుతున్నాయి. తద్వారా

**“ ఈ దాడికి ప్రతి ఘటన కూడా అదే స్థాయిలో ఎదురవుతున్నది. కష్టజీవులు, పీడిత, తాడిత ప్రజల జీవన ప్రమాణాలను దిగజార్చుతున్న ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడే శక్తులు ముందుకొస్తు న్నాయి. ఇవన్నీ రానున్న కాలంలో విప్లవ పోరాటాలను సంఘటితర పరచి, ముందుకు తీసుకెళ్లేందుకు అనువైన భూమికను కల్పిస్తు న్నాయి. ”**

కష్టజీవుల మధ్య ఐక్యతను నేరుగా దెబ్బ తీయాలని చూస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మతోన్మాద శక్తులను ఓడించేందుకు దృఢ నిశ్చయంతో పోరాడకుండా ఈ దేశాల్లో విప్లవ శక్తులు పురోగమించజాలవు. విభిన్న జాతులతో కూడిన భారత్‌కు సామాజిక, సాంస్కృతిక వైవిధ్యంలో ప్రపంచం లో మరే దేశమూ సాటిరాదు. సుసంపన్నమైన ఈ వైవిధ్యాన్ని దెబ్బతీసేందుకు విచ్ఛిన్నకర వాదులు అదేపనిగా దాడులు చేస్తున్నారు. వర్గ ఐక్యతను పెంపొందించడం ద్వారానే ఈ దాడు లను మనం తిప్పికొట్టగలం. వర్గ ఐక్యతను పెంపొందించా లంటే వర్గ సమస్య లపై బలమైన ఉద్యమాలు నిర్మించడం మినహా మరో మార్గం లేదు.

అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి దేశ సార్వభౌమత్వాన్ని, జాతి సమైక్యతను బలహీన పరిచేందుకు మూలవాసుల జాతీయవాదాన్ని, వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తుంది. ఇటువంటి సంకుచిత ధోరణులను రెచ్చగొట్టడం ద్వారా ప్రజల్లో చీలిక తేవాలన్నది దాని పన్నాగం. అందుకే ఈ జాతుల సంకుచిత, వేర్పాటువాద ధోరణులను మనం గట్టిగా వ్యతిరేకిస్తూనే, వాటి ప్రజాతంత్రయుతమైన ఆకాంక్షలను నెరవేర్చడం కోసం కృషిచేయాలి. వారిపై అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా సాగే పోరాటాలను బలోపేతం గావించాలి. అదే సమయంలో జాతీయ సార్వభౌమత్వాన్ని పరిరక్షించేందుకు, కష్టజీవుల మధ్య సంఘీభావాన్ని పెంపొందిం చడంలో కీలకమైన సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు గట్టిగా కృషిచేయాలి. సామ్రాజ్యవాద ప్రపంచీ కరణ వ్యతిరేక పోరాటం ద్వారా వర్గ ఐక్యతను పెంపొందించాలి.

### ప్రజా ప్రతిఘటనను బలోపేతం చేయాలి

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ మానవాళిపై అసాధారణ రీతిలో భారాలు మోపుతూ వారిని అనేక ఇక్కట్లకు గురిచేస్తున్నది. ఈ దాడికి ప్రతి ఘటన కూడా అదే స్థాయిలో ఎదురవుతున్నది. కష్టజీవులు, పీడిత, తాడిత ప్రజల జీవన ప్రమాణాలను దిగజార్చుతున్న ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడే శక్తులు ముందుకొస్తున్నాయి. ఇవన్నీ రానున్న కాలంలో విప్లవ పోరాటాలను సంఘటితర పరచి, ముందుకు తీసుకెళ్లేందుకు అనువైన భూమికను కల్పిస్తున్నాయి. ప్రతిదీ పెట్టుబడి శాసించే ఈ పద్ధతికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలి. ప్రస్తుత అంతర్జాతీయ వర్గ శక్తుల బలాబలాల పొందిక ప్రతికూల పరిస్థితులనెదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో ప్రజా పోరాటాలు ఏ మేరకు విజయం సాధిస్తే ఆ మేరకు పెట్టుబడి ఆధిపత్యాన్ని వెనక్కి తిప్పికొట్టొచ్చు. కార్మికవర్గం నాయ కత్వంలో వర్గ పోరాటాలు ఎంతగా పదును దేలుతాయన్నదానిపైనే పెట్టుబడి పాలనపై మనం ఎంతవరకు పైచేయి సాధిస్తామనేది ఆధారపడి వుంటుంది. విప్లవ పోరాటానికి మన వర్గ శక్తులను సంసిద్ధం చేయాలి. మానవాళి విముక్తి, సామాజిక పరివర్తన కోసం కార్మికవర్గ నాయకత్వాన పీడిత, తాడిత ప్రజానీకం అంతా కలిసికట్టుగా సాగించే పోరాటాలను సంఘటిత పరచి, వాటిని మరింత బలోపేతం గావించాలి.

పెట్టుబడిదారీ వ్యవస్థను ఎంతగా సంస్కరించినా సంక్షోభాల వలయం నుంచి అది బయటపడలేదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలోనే అంతర్గతంగా ఈ సంక్షోభం దాగివుంది. ఉత్పత్తి సామాజికం, వినియోగం వ్యక్తిగతం ఈ రెండిటి మధ్య వున్న మౌలిక వైరుధ్యమే ఈ సంక్షోభాలకు మూల కారణం. మానవీయ ముఖంతో కూడిన సంస్కరణలు తీసుకురావడం ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థను సంస్కరించవచ్చని సోషల్ డెమొక్రసీ కల్పించే భ్రమలను సైతం ఇది పటాపంచలు చేసింది. సంక్షోభ తీవ్రత ఎంతగా వున్నా పెట్టుబడిదారీ వ్యవస్థ దానంతటదే కూలిపోయే పరిస్థితి ఎన్నడూ వుండదు. ఇక్కడ మార్క్స్ విశ్లేషణను ఒక్క సారి గుర్తుకుతెచ్చుకోవాల్సిన అవసరముంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం వచ్చిన ప్రతిసారి అది ఉత్పత్తి శక్తుల్లో కొంత భాగాన్ని నాశనం చేయడమేగాక, ఉత్పత్తి శక్తులకు, అప్పటికి ఉనికిలో వున్న ఉత్పత్తి సంబంధాలకు మధ్య సమతౌల్యాన్ని పునరుద్ధరించుకుని మరింత బలంగా ముందుకొస్తుందని మార్క్స్ సూత్రీకరించాడు. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయాల్సిన అవసరమేర్పడింది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు సమాజంలోని కార్మిక,కర్షక, పీడిత, తాడిత వర్గాలు నిర్ణయాత్మక స్థితికి ఎదిగే లా చూడాలి. ఆ కృషిలో భాగంగా పెట్టుబడిదారీ పాలనకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలను ఉధృతం చేయడంతోబాటు రాజకీయ దాడిని పెంచాలి. పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వర్గ, ప్రజాతంత్ర శక్తులను సమీకరించి, పటిష్టపరచుకోవాలి. బాహ్య పరిస్థితులు –నిర్దిష్ట సంక్షోభ పరిస్థితి– విప్లవాన్ని ముందుకు గొనిపోయేందుకు అనువుగా వున్నా, వాటిని సొమ్ము చేసుకోగలిగే స్థితిలో కార్మిక వర్గం లేనప్పుడు ఫలితముండదు. పెట్టుబడి పాలనపై విప్లవం పైచేయి సాధించాలంటే కార్మికవర్గ నాయకత్వంలో వర్గ శక్తులను పటిష్టపరచుకోవాలి. లెనినిస్టు సూత్రాల ఆధారంగా నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించుకోవడం ద్వారా మన ప్రజల్లో వర్గ శక్తుల బలాబలాల పొందికను మనకు అనుకూలంగా మార్చుకునేందుకు వీలైన ఎత్తుగడలను రూపొందించుకోవాలి. మన స్వతంత్ర బలం పెంచుకోవడం ద్వారా పెట్టుబడి పాలనపై రాజకీయ దాడిని పెంచడం కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలుగా మన విధి. ముందే పేర్కొన్నట్లు ఆ నాలుగు రంగాల్లో మన పోరాటాలు విజయం సాధించాలి. ఈ విజయంపైనే దోపిడీ, పీడనల నుంచి ప్రజలను విముక్తం గావించే పోరాటంలో విజయం, మన అంతిమ లక్ష్యమైన సోషలిజం సాధన ఆధారపడి వుంటుంది. ఈ రోజున ఇక్కడ సమావేశమైన పార్టీలన్నీ రాబోయే కాలంలో మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, మీకందరికీ మరోసారి విప్లవాభినందనలు తెలియజేస్తున్నాను.

**అక్టోబర్ విప్లవం వర్ధిల్లాలి!**

**మార్క్సిజం, లెనినిజం వర్ధిల్లాలి!!**

**సోషలిజం వర్ధిల్లాలి!!!**

**అనువాదం : కె. గడ్డెన్న**

# సామాజిక న్యాయం - కమ్యూనిస్టు దృక్పథం

**ఎస్.వీరయ్య**



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

**కమ్యూనిస్టులు, సామాజిక శక్తుల ఐక్య కార్యాచరణ అంటే ఏమిటి?**
**సామాజిక న్యాయానికి, వర్గ పోరాటానికి మధ్య ఉన్న సంబంధం ఏమిటి?**
**వర్గ పోరాటం లేకుండా సామాజిక న్యాయం సాధించగలమా?**
**కులానికి, వర్గానికి సంబంధం / తేడా ఏమిటి?**
**కుల పోరాటానికి, ఆధిపత్య వ్యతిరేక పోరాటానికి తేడా ఏమిటి?**
**కమ్యూనిస్టులు కోరేదేమిటి?**

సామాజిక న్యాయం కోసం కమ్యూనిస్టులు కదలడంతో ఇలాంటివే అనేక ప్రశ్నలు ముందుకొస్తున్నాయి.

*

కుల వివక్ష వేళ్ళూనుకుని ఉన్న సమాజం మనది. ఆర్థిక, సాంఘిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ తదితర రంగాలన్నింటిలోనూ ఈ వివక్ష కొనసాగుతున్నది. కులవివక్ష అంతం కావాలని కమ్యూనిస్టులతో పాటు సమాజంలోని అనేక తరగతులు, సమూహాలు, వ్యక్తులు, సంస్థలు కోరుకుంటున్నారు. సాధించే మార్గం పట్ల అనేక ఆలోచనలు సాగుతున్నాయి. ఉద్యమాలు నడుస్తున్నాయి. ఎవరి దారిలో వారు, ఎవరి ప్రయత్నం వారు చేస్తున్నప్పటికీ అందరూ కోరుకునేది కుల వివక్ష, అణచివేత అంతం కావాలని. జ్యోతిరావు పూలే దంపతులు, బాబా సాహెబ్ అంబేద్కర్ వంటి సామాజిక ఉద్యమకారులు మొదలు కమ్యూనిస్టుల వరకూ సుదీర్ఘ కాలంగా ఈ కృషిలో నిమగ్నమయ్యారు. ఫలితం సాధించడానికి మాత్రం ఇంకా చాలా దూరంలోనే ఉన్నాము. అందుకే ఇప్పుడు కొత్త ఆలోచనలు, సరికొత్త మార్గాల అన్వేషణ మొదలైంది. అందుకనుగుణంగా కృషి కూడా ప్రారంభమైంది. కమ్యూనిస్టులు, సామాజిక శక్తులు కలిసి పనిచేస్తున్నారు. ఇది కొత్త ఆశలు రేపుతున్నది. ఇది ఒక మంచి పరిణామం. ఓర్పుతో, పట్టుదలతో, సైద్ధాంతిక స్పష్టతతో ఈ కృషి కొనసాగించాలి.

**సైద్ధాంతిక స్పష్టత**

సామాజిక శక్తుల లక్ష్యం పరిమితం. సామాజిక న్యాయమే లక్ష్యంగా వారి కృషి కొనసాగుతున్నది. కమ్యూనిస్టులు అంతటితో ఆగజాలరు. సామాజిక న్యాయంతో పాటు సమాజంలో అన్ని రకాల దోపిడీ ఆధిపత్యాలు అంతమయ్యేంత వరకూ పోరాడాలన్నదే వారి లక్ష్యం. అందువల్ల ఈ రెండు ప్రవాహాలు కలిసి ప్రయాణం చేసే క్రమంలో అనేక అంశాలు ముందుకురావడం సహజం. సామాజిక శక్తులు కోరుతున్నది రిజర్వేషన్లు, గుర్తింపు, ఆత్మగౌరవం, అన్ని రంగాలలో జనాభాకు తగిన వాటా. కమ్యూనిస్టులు ఈ పరిధి దాటి మరింత ముందుకు సాగవలసిన అవసరం ఉంది. బడుగు బలహీన వర్గాల విముక్తి కోసం పోరాటం కొనసాగిస్తారు. కలిసి నడిచే క్రమంలో సామాజిక శక్తులలో కూడా కొందరు విముక్తి మార్గంలో కమ్యూనిస్టులతో పాటు కొనసాగే అవకాశం కూడా ఉండవచ్చు. అదే జరిగితే సాధ్యమైనంత ఎక్కువమంది చివరికంటా కమ్యూనిస్టులతో పాటు నడవాలని కోరుకోవాలి. నడిచినంత దూరం వెన్నంటి తీసుకెళ్ళాలి. వెనుక నడవటం కాదు, మన వెంట తీసుకుపోవాలి. సామాజిక రంగంలో వర్గ పోరాటం ద్వారా ఇది సాధ్యం. సైద్ధాంతిక స్పష్టత లేనప్పుడు సామాజిక శక్తులకు, కమ్యూనిస్టులకు తేడా లేదన్న గందరగోళానికి గురవుతారు. ఫలితంగా వెనుక నడుస్తారు. సైద్ధాంతిక స్పష్టత ఉంటే వెంట తీసుకుపోయేందుకు చైతన్యపూరితమైన కృషి చేస్తారు.

**కులమూ, వర్గమూ ఒకటేనా?**

కులాన్ని, వర్గాన్ని అర్థం చేసుకోవడంలో కొంత గందరగోళం ఉంది. ఇదే సామాజిక శక్తులకు, కమ్యూనిస్టులకు మధ్య ఉన్న తేడాను గుర్తించడంలో గందరగోళాన్ని సృష్టిస్తుంది. దేశంలో కుల వ్యవస్థను, దాని పరిణామ క్రమాన్ని అధ్యయనం చేయాలి. దేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి మొదలైనప్పటినుండి కులంలో వర్గ విభజన మొదలైంది. స్వాతంత్ర్యానంతరం ఇది కొంత వేగం పుంజుకున్నది. అయినప్పటికీ కులవ్యవస్థ బలంగానే ఉన్నది. అందుకే కులము, వర్గము ఒక్కటే అనుకోవటంతోనే గందరగోళం ఏర్పడుతున్నది. దేశంలో 200 సం॥లకు పూర్వపు కులవ్యవస్థ, ఇప్పుడున్న కులవ్యవస్థ ఒక్కటే అని చెప్పగలమా? స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యానంతరం కులవ్యవస్థలో ఏ మార్పు లేదని ఎవరూ చెప్పజాలరు. ఎలాంటి మార్పు ఉన్నదన్నదే ప్రశ్న. ఆ మార్పు ఏ మోతాదులో ఉన్నదో కూడా పరిశీలించాలి. కులం, వర్గం ఒకటే అనుకుంటే కుల పోరాటానికి దారి తీస్తుంది. ఒకటి కాదనుకుంటే సామాజిక న్యాయం కోసం పోరాడటం ద్వారానే వర్గ పోరాటం ముందుకు సాగుతుందని అర్థమవు తుంది. వర్గ పోరాటం లేకుండా దోపిడీ నుండి విముక్తి లేదని కూడా అర్థమవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కులము, వర్గము ఒకటి కాదన్నది స్పష్టం. వివిధ కులాల్లో తరతమ స్థాయిల్లో వర్గ విభజన జరుగుతున్నది. కార్మికవర్గంలో నిరంతరం వివిధ సామాజిక తరగతుల నుండి కొత్తగా చేరుతున్నారు. కార్మికవర్గం బలోపేత మవుతున్నది. కులవృత్తులను వదిలి ఆధునిక కార్మికవర్గంలో చేరినప్పటికీ కులవ్యవస్థ ఇచ్చిన వారసత్వంగా కులభావాలను సైతం మోసుకొస్తు న్నారు.

**"భారత సమాజంలో కులం ఉన్నంత కాలం అది నిచ్చెనమెట్ల వ్యవస్థగానే ఉంటుంది. కుల వివక్ష కొనసాగుతుంది. ఈ వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడంలోనే కమ్యూనిస్టుల ప్రత్యేకత ఉంది. సామాజిక న్యాయం కోసం చేసే పోరాటం కుల నిర్మూలన దిశలో సాగాలి. కులం సంఘటితమయ్యే దిశలో కాదు."**

అందువల్ల కులంలో వర్గ విభజనతో పాటు వర్గంలో కుల భావాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇది కార్మికవర్గ ఐక్యతను సాధించడం లో కొత్త సవాళ్ళను విసురుతున్నది.

### కులం – పునాదీ, ఉపరితలం

కులం పునాదిలో ఉన్నదా లేక ఉపరితలంలో భాగమా అన్న ప్రశ్న కూడా ముందుకొస్తుంది. కులము, వర్గము ఒకటి కాదన్నప్పుడు ఈ చర్చకు మరింత అవకాశం ఏర్పడుతున్నది. అందుకే కులము, వర్గము ఒకటి కాదన్నది ఎంత నిజమో, ఈ రెండూ పూర్తిగా విడివడిపోలేదన్నది కూడా అంతే నిజం. భారత ఆర్థిక వ్యవస్థ సంక్లిష్టమైనది. ఫ్యూడల్ సంబంధాలను బద్దలుకొట్టకుండానే, ఫ్యూడల్ సంబంధాల పునాదుల మీదనే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను నిర్మించే ప్రయత్నం జరుగుతున్నది. కుల వ్యవస్థను ఫ్యూడల్ సమాజం సృష్టించిన విషయం మనకు తెలుసు. ఫ్యూడల్ సంబంధాలు ఎంత కాలం ఉంటే అంతకాలం కులం కూడా బలం గానే ఉంటుంది. అంతేకాదు, ఫ్యూడల్ వ్యవస్థలో కులానికి, వర్గానికి తేడా లేదు. స్థూలంగా వృత్తుల ప్రాతిపదికగా కులాలు ఏర్పడ్డాయి. ఏ మేరకు పెట్టుబడిదారీ విధానం బలపడితే ఆ మేరకు ఫ్యూడల్ సంబంధాల మీద వాటి ప్రభావం ఉంటున్నది. ఇది సహజం. భారతదేశానికి ఈస్ట్ ఇండియా కంపెనీ రాకపూర్వ పరిస్థితికి, స్వాతంత్ర్యం వచ్చేనాటి పరిస్థితికి ఆర్థిక, సామాజిక వ్యవస్థలో మార్పులు గమనించవచ్చు. స్వతంత్ర భారతదేశంలో సరళీకృత ఆర్థిక విధానాల ప్రారంభానికి ముందు పరిస్థితికి, ఆ తర్వాత పరిస్థితులకు తేడా గమనిస్తున్నాము. స్వాతంత్ర్యానంతరం కులాలలో వర్గ విభజన వేగం పుంజుకున్నప్పటికీ ఫ్యూడల్ సంబంధా లను నిర్మూలించేందుకు పాలకులు సిద్ధంగా లేరు. అందువల్ల ఫ్యూడల్ సంబంధాలు కొన సాగుతూనే ఉన్నాయి. ఆర్థికవ్యవస్థలో ఏమేరకు ఫ్యూడల్ సంబంధాలు కొనసాగుతాయో ఆ మేరకు కులం పునాదిలో కూడా ఉంటుంది. ఫ్యూడల్ సంబంధాలు పూర్తిగా ధ్వంసమై స్పష్టమైన పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భవించేంత వరకూ ఆయా మోతాదుల్లో ఇది కొనసాగు తుంది. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో పూర్వ కాలంలో లాగా కులము, వర్గము ఒకటి కాదు. కానీ కులం పునాదులు ఆర్థిక వ్యవస్థలో కూడా ఉన్నాయి. మారుతున్న పరిస్థితుల్లో ఇది ఏ మోతాదులో ఉందో నిరంతరం అధ్యయనం చేయాలి.

### సామాజిక న్యాయంతో కులం నశిస్తుందా?

ఇక్కడ మరి కొన్ని ప్రశ్నలు ముందు కొస్తున్నాయి. సామాజిక న్యాయం అమలు జరిగితే కులం పోతుందా? జనాభాకి అనుగుణంగా వాటా ఇస్తే కులం అంతరించి పోయే అవకాశం ఉన్నదా? కుల నిర్మూలన జరగకుండా కులవివక్ష అంతరిస్తుందా? సామాజిక న్యాయం లో అంతర్భాగంగా ధ్వనించే అంశాలు అర్థం చేసుకుంటే సమాధానాలు సులభమే. రిజర్వేషన్ అన్నా, వాటా అన్నా, గుర్తింపు అన్నా, ఆత్మ గౌరవం అన్నా... ఏ పేరు పెట్టినా ఇక్కడ కులం కొనసాగుతుంది. కులానికి గుర్తింపు, కులస్థులకు ఆత్మగౌరవము, రిజర్వేషన్, తగు నిష్పత్తిలో వాటా. అందువల్ల ఈ నినాదాలకు పరిమితులు న్నాయి. పరిమిత ఫలితాలనే సాధిస్తాయి. ప్రజాస్వామ్యయుతంగా బడుగు బలహీన వర్గాల హక్కును చాటుతాయి. అదే సమయంలో కులం కొనసాగుతుంది. ఈ పరిమితిని కూడా అర్థం చేసుకోవాలి. భారత సమాజంలో కులం ఉన్నంత కాలం అది నిచ్చెనమెట్ల వ్యవస్థగానే ఉంటుంది. కుల వివక్ష కొనసాగుతుంది. ఈ వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడంలోనే కమ్యూనిస్టుల ప్రత్యేకత ఉంది. సామాజిక న్యాయం కోసం చేసే పోరాటం కుల నిర్మూలన దిశలో సాగాలి. కులం సంఘటితమయ్యే దిశలో కాదు.

### కులాన్ని కాపాడుతున్న పెట్టుబడిదారీ వర్గం

భూస్వామ్య సంబంధాలతో రాజీపడ్డట్టే ఆ సమాజం సృష్టించిన కులవ్యవస్థతో కూడా పెట్టుబడిదారీ వర్గం రాజీపడింది. కులవ్యవస్థను పెట్టుబడిదారీ వర్గమే కాపాడుతున్నది. శ్రామిక వర్గాల ఐక్యతను విచ్ఛిన్నం చేయడం కోసం కులాన్ని, మతాన్ని ఆయుధంగా వాడుతున్నది. ఆయా కులాల్లోని కొంతమందికి పెట్టుబడి సమకూర్చడం ద్వారానూ, కాంట్రాక్టులు ఇవ్వడం ద్వారానూ తన వర్గంలో కలుపుకుంటున్నది. ఆయా సామాజిక తరగతులలోని అత్యధిక ప్రజానీకాన్ని సంక్షేమ పథకాలతో ఓటు బ్యాంకుగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఆయా సామాజిక తరగతుల నుండి పెట్టుబడిలో వాటాదారులుగానూ, కాంట్రాక్టర్లుగానూ మారిన కొద్దిమంది ధనికుల ద్వారా ఓటుబ్యాంకును నిర్మించుకునే ప్రయత్నం చేస్తున్నది. ఇందుకోసం కులాన్ని పెట్టుబడిదారీ వర్గమే కాపాడుతున్నది. అణగారిన సామాజిక తరగతుల నుండి చిన్న చిన్న పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు ఎదగడం కూడా తప్పుకాదు. పెట్టుబడిదారులుగానూ, కాంట్రాక్టర్లుగానూ ఎదిగే అవకాశాలు అగ్ర వర్ణాలకే కాదు, అందరికీ ఉండాలన్నది ప్రజా స్వామ్యబద్ధమైన కోరిక. పెట్టుబడిదారీ వ్యవస్థలో అతి కొద్దిమంది పెట్టుబడిదారులుగానూ, కాంట్రాక్టర్లుగానూ ఎదగడం, అత్యధికులు శ్రామికులుగా మిగిలిపోవటం సహజమే. అందుకే కమ్యూనిస్టులు బడుగు బలహీన వర్గాలకు చెందిన ఈ శ్రామిక జనం విముక్తి కోసం తమ కృషిని కొనసాగిస్తారు. ఉద్యమ క్రమంలో దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులలోని పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల (వారు చిన్న, మధ్యతరహా స్థాయివారే అయినప్పటికీ) ప్రయోజనాలకూ, శ్రామిక జనం ప్రయోజనాలకూ వైరుధ్యం తలెత్తినప్పుడు ఎవరివైపు నిలబడాలన్నదే ఇక్కడ పరీక్ష. ఇలాంటి సమయంలో కమ్యూనిస్టులు శ్రామికులవైపే నిలబడతారు. నిలబడాలి. కానీ అస్తిత్వవాదులు ఇందుకు భిన్నంగా స్పందిస్తారు. కమ్యూనిస్టులు, సామాజిక శక్తులు కలిసి నడిచే క్రమంలో ఇలాంటి పరీక్షా సమయాలు అనేక సందర్భాలలో ఎదురవుతాయి. ఈ వైరుధ్యాలు అనివార్యం. ఉద్యమ క్రమంలోనే ఇవి పరిష్కారమవుతాయి. ఆయా తరగతులలోని చదువుకున్న మధ్యతరగతి కూడా ఇలాంటి కీలక సమయాలలో శ్రామికులకు అండగా నిలవాలి. ఆ సామాజిక తరగతిలోని మెజారిటీ శ్రామిక జనం ప్రయోజనాలే

మొత్తం ఆ సామాజిక తరగతి ప్రయోజనాలుగా భావించాలి.

సామాజిక న్యాయం ప్రజాతంత్ర నినాదం. భూస్వామ్య విధానం నాశనం కాకుండా, ప్రజాస్వామ్యం పరిపుష్టం కాకుండా సమాజం ముందుకు పోదు. అందువల్ల ప్రజాతంత్ర నినాదాలన్నీ కమ్యూనిస్టుల నినాదాలు కూడా. కాకపోతే సామాజిక శక్తులు ప్రజాతంత్ర నినాదాలకు పరిమితమవుతారు. కమ్యూనిస్టులు కూడా వాటికే పరిమితం కాకూడదు. ఒకడుగు ముందు నడవాలి. విముక్తి మార్గంలో ఉద్యమం నడపాలి. కలిసివచ్చే సామాజిక శక్తులను విముక్తి మార్గం వైపు నడిపించాలి. అందుకే మనం గుర్తుంచుకోవాల్సిన విషయం వెనుక నడవడం కాదు, వెన్నంటి నడిపించాలి. కుల వివక్ష వ్యతిరేక పోరాటం, కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా పోరాటం, గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో సాగుతున్న పెత్తనంపై పోరాటం ఇందుకు తోడ్పడుతుంది. ఇది క్షేత్రస్థాయిలో... గ్రామం, వార్డు స్థాయిలో జరిగినప్పుడే ఫలితాన్నిస్తుంది. అంతిమంగా కుల నిర్మూలన దిశలో ఈ కృషి సాగాలి. సాధారణం గా ఫ్యూడల్ సంబంధాలు నాశనమైతే కులం పోతుందని నమ్ముతారు. ఫ్యూడల్ సంబంధాలు నశిస్తే పునాదిలో కులం స్థానం నశిస్తుంది. ఉపరితలానికే పరిమితమవుతుంది. కాబట్టి పెట్టుబడిదారీ వర్గమే కులాన్ని నిర్మూలిస్తుందని భావిస్తారు. కాసేపు ఇదే నిజమని భావించినా, పునాది నుండి వేరుపడినంత మాత్రాన ఉపరి తలంలో ఉండే కులభావాలు అంత సులభంగా నశించవు. ఇది సాధారణ మార్క్సిస్టు అవగాహన. కానీ భారతదేశంలో ఫ్యూడల్ సంబంధాల మీదనే పెట్టుబడిదారీ విధానం నిర్మించే ప్రయత్నం జరుగుతున్నది. కులం, వర్గం పరస్పరం పెనవేసుకుని పయనిస్తున్నాయి. కులాన్ని పెట్టుబడిదారీ వర్గమే కాపాడుతున్నది. అందువల్ల పెట్టుబడిదారీ విధానం అంతం కాకుండా కులనిర్మూలన సాధ్యం కాదు. కమ్యూనిస్టులు పూనుకోకుండా, వర్గ పోరాటం ఉధృతం చేయకుండా కేవలం సామాజిక శక్తుల కృషితో కులనిర్మూలన జరగదు. అందుకే పూలే, అంబేద్కర్‌లాంటి మహానుభావులు ఎంత నిజాయితీగా కృషి చేసినప్పటికీ కులవ్యవస్థ అంతం కాలేదు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటిలోనూ వర్గ పోరాటం జరగాలి. వర్గ పోరాటంతో పాటు కులనిర్మూలన కోసం కూడా పోరాడాలి.

“ కానీ భారతదేశంలో ఫ్యూడల్ సంబంధాల మీదనే పెట్టుబడిదారీ విధానం నిర్మించే ప్రయత్నం జరుగుతున్నది. కులం, వర్గం పరస్పరం పెనవేసుకుని పయనిస్తున్నాయి. కులాన్ని పెట్టుబడిదారీ వర్గమే కాపాడుతున్నది. అందువల్ల పెట్టుబడిదారీ విధానం అంతం కాకుండా కులనిర్మూలన సాధ్యం కాదు. ”



గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దళితుల ప్రదర్శన

**కుల పోరాటమా - వర్గ పోరాటమా?**

పాలకవర్గాలు కుల పోరాటాన్నే కోరుకుంటాయి. తద్వారా శ్రామికులను కులం పేరుతో విభజించవచ్చు అన్నది వారి ఎత్తుగడ. అందుకే కులవ్యవస్థను కాపాడుతున్నాయి. బడుగు బలహీన వర్గాల ప్రజలు విముక్తి కోసం ఉద్యమించకుండా వాటాలు, సంక్షేమం చుట్టే వారి ఆలోచనలు పరిమితం కావాలని కోరుకుంటున్నాయి. ఇందుకోసం అస్తిత్వ ఉద్యమాలను ప్రోత్సహిస్తున్నాయి. తెలుగులో అస్తిత్వం అంటున్నాము. ఇంగ్లీష్‌లో ఐడెంటిటీ అంటున్నారు. అస్తిత్వం అన్నా ఐడెంటిటీ (గుర్తింపు) అన్నా ఆచరణలో అది కులం అస్తిత్వం, కులం గుర్తింపుకే పరిమితం చేస్తున్న నినాదం. అంటే కుల నిర్మూలన కాదు, కులాన్ని కాపాడుతున్నది. అగ్రవర్ణాలు ఆధిపత్యం కోసం కులసంఘాలు పెడుతున్నారు. బడుగు బలహీన వర్గాల వారు హక్కుల కోసం కులసంఘాలు పెడుతున్నారు. ఈ రెండింటి మధ్య తేడా ఉన్నది. దళిత, గిరిజన, వెనకబడిన తరగతులకు చెందిన సంఘాల నినాదాల్లో, ఆందోళనా పోరాటాలలో ప్రజాస్వామిక అంశం ఉన్నది. సామాజిక న్యాయం కోరుకుంటున్నారు. అందువల్ల అగ్రవర్ణాల కులసంఘాలను, అణగారిన తరగతుల కులసంఘాలను ఒకే గాటన కట్టలేము. అందుకే తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అణగారిన తరగతుల పోరాటానికి కమ్యూనిస్టులు అండగా ఉంటారు. సామాజిక న్యాయం కోసం సాగుతున్న ఈ పోరాటంలో ఈ ప్రజాతంత్ర అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. దానికోసం కమ్యూనిస్టులు కూడా పోరాడతారు. అందుకే సామాజిక శక్తులు, కమ్యూనిస్టుల ఐక్య పోరాటానికి ఇది ప్రాతిపదిక. అదే సమయంలో దళిత, గిరిజన, వెనకబడిన తరగతులయినప్పటికీ వారి కులసంఘాలు తమ అస్తిత్వం గురించి, గుర్తింపు గురించి లేవనెత్తినప్పుడు అది కులాన్ని బలహీనపర్చే బదులు సంఘటితం చేస్తుంది. కుల నిర్మూలనకు బదులు కులాన్ని బలోపేతం చేస్తుంది. అందుకే సామాజిక న్యాయం కోసం సాగుతున్న ఈ సమరంలో ప్రజాస్వామిక అంశాన్ని ఆహ్వానిస్తూనే, దానితో పాటు వ్యక్తమయ్యే ఈ అస్తిత్వ అంశాన్ని కమ్యూనిస్టులు తిరస్కరిస్తారు. అంతిమంగా కులవ్యవస్థ బలహీనపడాలని కమ్యూనిస్టులు కోరుకుంటారు. చేసే ప్రతి పనీ

(మిగతా 22వ పేజీలో)

# అక్టోబరు విప్లవం వైపు బోల్షివిక్‌ల పురోగమనం

ఆర్.అరుణ్ కుమార్



రచయిత సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు

**తు**పాను వేగంతో సాగుతోన్న రష్యా పరిణామాల్ని ప్రవాసంలోనున్న లెనిన్ నిశితంగా పరిశీలిస్తున్నాడు. బయటి నుంచే బోల్షివిక్‌ల కార్యక్రమాలను నిర్దేశిస్తూనే మరోవైపు ప్రఖ్యాతిగాంచిన పుస్తకం 'రాజ్యమూ విప్లవమూ' పూర్తిచేయడంలో నిమగ్నమయ్యాడు. 1917 ఆగస్టులో రాయడం ప్రారంభించినకార్ల్ మార్క్స్, ఎంగెల్స్‌ల సిద్ధాంతాన్ని రష్యా విప్లవానుభవాలతో మిళితం చేసే ప్రయత్నం ఈ పుస్తకం.

కొర్నిలోవ్ తిరుగుబాటు వైఫల్యం రష్యా విప్లవ పురోగమనాన్ని వేగవంతం చేసింది. బోల్షివిక్ పార్టీ మాత్రమే విప్లవ ప్రతీఘాతక శక్తుల ఎత్తుగడలను అణచివేసి విప్లవాన్ని ముందుకు తీసుకెళుతుందని దేశంలోని జన సమూహాలు తెలుసుకున్నాయి. ప్రజల్లో వెలువెత్తిన ఈ విశ్వాసం సామాజిక శక్తుల్లో ప్రకంపనలు తెచ్చి సమాజాన్ని ఉత్తేజపరిచి విప్లవాన్ని మీటింది. వేర్వేరు తరగతులు, పార్టీల నైజాన్ని బహిర్గతం చేసింది. సోషలిస్ట్-రివెల్యూషనరీ(ఎస్ఆర్)ల తీరు తెలిసిపోయింది. వెన్షివిక్‌లు, ఏ పక్షం వహించాలో అర్థంకాని పెటీబూర్జువాలలో అయోమయం స్పష్టమైంది. దాదాపు క్రియా శూన్యతలోకి జారిపోయిన సోవియెట్‌లు అన్ని దశల్లోను పుంజుకుని సత్తువ తెచ్చుకున్నాయి. కొర్నిలోవ్ తిరుగుబాటు గురించి స్టాలిన్ "ఇది పోగుబడిన విప్లవ క్రోధానికి వరద గేట్లను ఎత్తింద"ని పేర్కొన్నాడు. విప్లవ క్రియాశీలత విస్తరించడాన్ని చూసి రష్యా పాలక వర్గాల్లోను ప్రకంపనలచ్చాయి. కేడెట్‌లు, మెన్షెవిక్‌లు, ఎస్ఆర్‌లతో కూడిన ప్రాంతీయ ప్రభుత్వం కూలిపోయింది. కేడెట్‌లు వైదొలగడంతో కెరెన్స్కీ నేతృత్వంలోని కొత్త 'ఫైవ్ మేన్' ప్రభుత్వం ఏర్పడింది. కార్మికులు, రైతులు, సైనికులకు.. కేడెట్‌లకు స్వతంత్రంగా 'డైరెక్టరీ' వ్యవహరిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. కానీ, ఇది పాక్షిక వాస్తవం మాత్రమే. నిజానికి, ప్రభుత్వం కేడెట్‌ల మీద, రాజ్యాన్ని నడుపుతోన్న బూర్జువా వర్గపు మనుషుల మీద పూర్తిగా ఆధారపడిపోయింది. సామ్రాజ్యవాద బూర్జువా వర్గంతో నేరుగా ఒప్పందాలు చేసుకుంటే ప్రజాగ్రహానికి గురికావాల్సివస్తుందని బూర్జవా వర్గం అర్థం చేసుకుంది. అందువలన భూస్వాములు, బూర్జువాల నియంతృత్వానికి కవచంలా మాత్రమే కెరెన్స్కీని వాడుకున్నారు. వాస్తవం ఒక్కటే.. కార్మికులు, రైతులు, సైనికుల నుంచి ప్రభుత్వం తెగతెంపులు చేసుకుంది.

విప్లవ ప్రతీఘాతక శక్తుల్ని ఓడించేందుకు విస్తరిస్తున్న 'రివల్యూషనరీ కమిటీ'లను నిషేధిస్తూ సెప్టెంబర్ 4న కెరెన్స్కీ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేసింది. తపాలా సిబ్బంది, రైల్వేకార్మికులు, శ్రామికులు, రైతులు, సైనికులకు చెందినవే ఈ కమిటీలు. వీటి విప్లవస్ఫూర్తి, వీరిపై బోల్షివిక్‌ల ప్రభావానికి భయపడి కెరెన్స్కీ ప్రభుత్వం వీరిని నేరస్తులుగా చిత్రీకరించడం మొదలెట్టింది. గతంలో విప్లవప్రతీఘాత వ్యతిరేక పోరులో వీరెంత వీరోచితంగా పోరాడరనే విషయాన్ని విస్మరించింది. ఈ దాడుల వల్ల బోల్షివిక్‌ల నేతృత్వంలోని ఈ విప్లవ కమిటీలు మార్గం నుంచి పక్కకు మరల్లేదు, బలహీనపడలేదు. విప్లవ ప్రతీఘాతక దాడుల్ని ఓడించడంలో వీరి పాత్ర, బూర్జువా కేడెట్‌లకు వ్యతిరేకంగా సలపిన పోరు ఈ కమిటీలను మరింత శక్తివంతం చేసింది.

ఉత్పత్తిని ఛిన్నాభిన్నం చేసేందుకు పెట్టుబడిదారులు, భూస్వాములు ప్రయత్నాల్ని ఉధృతం చేశారు. రైల్వేల పనితీరును అస్తవ్యస్తం చేసి ముడి పదార్థాలు, ఉత్పత్తుల సరఫరాను ప్రభావితం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు ధాన్యం రాకుండా అడ్డుకున్నారు. ఉత్పత్తిని నిలిపివేయడం, నష్టపరచడం, అంతరాయం కలిగించడం ద్వారా అనేక గనులు, కర్మాగారాల ఉత్పత్తిని నాశనం చేశారు. ధాన్యం, ఇతర వస్తువుల ఉత్పత్తి, పంపిణీలకు విఘాతం కలిగించడం ద్వారా దేశంలో పెద్ద సంక్షోభాన్ని సృష్టించొచ్చని, తద్వారా విప్లవం, విప్లవ వర్గాలపై ప్రజల్లో వ్యతిరేకత కలిగించాలని పెట్టుబడి దారులు ఎత్తుగడ వేశారు. పౌరసరఫరాల కొరత, కరువు పెరిగిపోయింది. పాలక వర్గాలు సృష్టించిన ఈ కృత్రిమ కరువు, ఉత్పత్తిలేమికి ముగింపు పలికేందుకు ప్రభుత్వం చేసిందేమి లేకపోగా, ఈ పరిస్థితికి కార్మికులు, రైతులు వారి సంఘాలను కారణంగా చూపుతూ వారిపై తుపాకులు ఎక్కుపెట్టింది. పాలక వర్గాల ప్రతినిధులుగా ప్రభుత్వంలో కొనసాగుతున్న ఎస్ఆర్‌లు, మెన్షెవిక్‌లకు వారి ఆగడాలకు వ్యతిరేకంగా గొంతు పెగలలేదు. జరుగుతున్న పరిణామాల్లోని వర్గ లక్షణాల్ని వివరిస్తూ.. సమయానుగుణంగా ఏం చేయాలో.. ఘటనలకు తగ్గట్టు వ్యవహరించటానికి బోల్షివిక్‌లను లెనిన్ సన్నద్ధం చేశాడు. సోవియెట్‌ల్లోని కేంద్ర కార్యనిర్వాహక శాఖల్లో మెజారిటీలో ఉన్నా అధికారం నిదానంగా తమ చేతుల నుంచి జారిపోతుందనే విషయాన్ని ఎస్ఆర్‌లు, వెన్షివిక్‌లు అర్థం చేసుకున్నారు. దీన్ని ఆపేందుకు, అధికారాన్ని నిలబెట్టుకునేందుకు వారు 'డెమోక్రటిక్ కాన్ఫరెన్స్'కు పిలుపునిచ్చారు. ఈ కాన్ఫరెన్స్ ప్రధాన అజెండా 'అధికారం' అనే ప్రశ్నను పక్కన పెట్టడం..! కార్మికులు, రైతులు, సైనికుల ప్రతినిధుల్ని ఆహ్వానించకుండా కర్మాగార యాజమాన్యాలకు, బ్యాంకర్లకు, బూర్జువా, భూస్వామ్య వర్గ ప్రతినిధుల వాణిని వినిపించేందుకు వేదికగా మార్చారు. కార్మికులు, రైతులకు భయపడి బూర్జువా వర్గంతో రాజీ కుదుర్చుకునే ప్రయత్నం చేసిన వీళ్లు మరోసారి, విప్లవం, ప్రజల్లోని మెజారిటీ వర్గాల ప్రయోజనాలకు ద్రోహం చేశారు.

'ప్రజలపై విశ్వాసలేమి, వారి చొరవ, స్వాతంత్ర్యాలపై భయం, విప్లవ శక్తిపై భీతి'యే ఎస్ఆర్‌లు, మెన్షెవిక్‌లు చేసిన మౌలిక పాపాలని

లెనిన్ పేర్కొంటాడు. ఇవే గందరగోళానికి, నిష్క్రియత్వానికి మూలకారణాలని చెబుతాడు. ఈ సమావేశానంతరం ఆరుగురు పెట్టుబడిదారి మంత్రులు కేంద్రంగా, వారి ఇష్టానుసారం వ్యవహరించేలా పదిమంది 'సోషలిస్ట్' ప్రతినిధుల్ని అడ్డుతెరగా పెట్టుకుని ఓ కొత్త మంత్రివర్గం రూపొందింది.

పెట్టుబడిదారులతో అనుసంధానించిన విధానాలతో ప్రజలు విసిగిపోవడంతో ఎస్ఆర్‌లు, మెన్షివిక్‌ల్లో అసంతృప్తి మొదలైంది. వారిలోని ఓ వర్గం రాజీ విధానాల్ని వ్యతిరేకిస్తూ ఓ 'వామపక్ష' గ్రూపుగా ఉద్భవించాయి. దాదాపు 40 శాతం మంది సభ్యులు రాజీ విధానాలపై వ్యతిరేకతను వ్యక్తంచేశారు.

ఈ కాలంలో రైతు, శ్రామిక వర్గాల కోసం రాజీలేని పోరాటం చేస్తున్న బోల్షివిక్‌ల ప్రతిష్ట పెరిగింది. రైతులు, ముఖ్యంగా పేద రైతులు నిర్ణయాత్మకంగా బోల్షివిక్‌ల వైపు మరలారు. సెప్టెంబర్ నెలలో రైతులు స్వాధీనం చేసుకున్న భూఎస్టేట్‌ల సంఖ్య గణనీయంగా పెరిగింది. రైతులు భూముల్ని ఆక్రమించుకుని.. నిర్మాణంలో నున్న 'కాన్స్టిట్యుయెంట్ అసెంబ్లీ' చేయాల్సిన చట్టం ద్వారా గానీ, ప్రభుత్వం నుంచి అనుమతి కోసం గానీ వేచిచూడకుండానే భూములు దున్నడం మొదలెట్టారు.

నగరాల్లో, కర్మాగార కమిటీలే బోల్షివిక్‌ల వైపు వెల్లువెత్తిన తొలి సంఘాలు. మెజారిటీ కర్మాగార కమిటీల్లో బోల్షివిక్‌లకే మద్దతు. అలాగే, కార్మిక సంఘాల్లోను బోల్షివిక్‌ల ప్రభావం భారీగా పెరిగింది. శ్రామిక శక్తిలో ఎక్కువ భాగమున్న పెట్రోగ్రాడ్ లోహ కార్మికుల నుంచి వచ్చిన బలమైన శ్రామిక వర్గ సంఘాలపై బోల్షివిక్‌ల ప్రభావం పడింది. నిదానంగా, మెన్షెవిక్‌ల ప్రభావంలోంచి వస్త్ర కార్మికులు బయటపడి బోల్షివిక్‌లకు దగ్గరయ్యారు. సెప్టెంబర్ కల్లా, కార్మిక వర్గాల్లో గట్టి పట్టు సాధించింది బోల్షివిక్ పార్టీ. జూన్ నాటికి 'ఆల్ రష్యన్ కాంగ్రెస్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్' ప్రతినిధుల నుంచి కేవలం 36.4 శాతం మంది మద్దతు మాత్రమే ఉన్న బోల్షివిక్‌లకు సెప్టెంబర్ కల్లా 58 శాతం మంది బలం చేకూరింది.

సెప్టెంబర్ తొలివారంలో బోల్షివిక్‌ల చేతుల్లో పెట్రోగ్రాడ్ సోవియెట్ నియంత్రణతో ఓ నిర్ణయాత్మక మలుపు సంభవించింది. కార్మికులు, రైతుల ప్రభుత్వాన్ని నెలకొల్పాలనే బోల్షివిక్‌ల ప్రతిపాదనకు అనుకూలంగా 229 ఓట్లు, వ్యతిరేకంగా 115 ఓట్లు వచ్చాయి. 51 గైర్హాజరీలున్నాయి. ఎస్ఆర్‌లు, మెన్షెవిక్‌లు ఈ ఫలితాన్ని

> ❝ కానీ, ఈసారి కూడా మరింత మెజారిటీతో బోల్షివిక్‌ల ప్రతిపాదనే నెగ్గింది. ఈ విజయపరంపర సెంట్రల్ సైబీరియా, మాస్కో, క్రోన్‌స్టాండ్ట్, ఫిన్‌లాండ్, ఎస్తోనియా, రెవాల్, డోర్పాట్, వెండెన్‌లతో పాటు పెట్రోగ్రాడ్ చుట్టుపక్కల ప్రాంతాల సోవియెట్‌ల కాంగ్రెస్‌ల్లోను బోల్షివిక్‌లకు మద్దతు వెల్లువెత్తింది. ❞



అఖిల రష్యన్ సోవియట్ల రెండవ మహాసభలో ప్రసంగిస్తున్న లెనిన్

గుర్తించేందుకు తిరస్కరించి తర్వాతి రోజు మళ్లీ ఓటుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సోవియెట్ (సభ)కు ప్రతినిధుల్ని కూడగట్టేందుకు భారీ ప్రయత్నమే చేశారు. కానీ, ఈసారి కూడా మరింత మెజారిటీతో బోల్షివిక్‌ల ప్రతిపాదనే నెగ్గింది. ఈ విజయపరంపర సెంట్రల్ సైబీరియా, మాస్కో, క్రోన్‌స్టాండ్ట్, ఫిన్‌లాండ్, ఎస్తోనియా, రెవాల్, డోర్పాట్, వెండెన్‌లతో పాటు పెట్రోగ్రాడ్ చుట్టుపక్కల ప్రాంతాల సోవియెట్‌ల కాంగ్రెస్‌ల్లోను బోల్షివిక్‌లకు మద్దతు వెల్లువెత్తింది. బోల్షివిక్ పార్టీలోని ప్రతి ఒక్క సభ్యుడికి పదుల మంది సైనికులు, రైతులు, కార్మికుల అండతో పార్టీ నిర్ణయాత్మక శక్తిగా మారింది. శ్రామిక వర్గాలు తాము బోల్షివిక్‌లుగా చెప్పుకోవడమూ మొదలైంది. పెరుగుతున్న బోల్షివిక్‌ల ప్రభావం పట్టణ కౌన్సిల్ ఎన్నికల్లోను ప్రతిబింబించింది. పెట్రోగ్రాడ్‌లో బోల్షివిక్‌లు 37 నుంచి 67 సీట్లను పెంచుకుని ఎస్ఆర్‌ల తర్వాత రెండో అతిపెద్ద పార్టీగా ఉద్భవించారు. వారికొచ్చిన ఓట్లు దాదాపు రెండింతలయ్యాయి. మాస్కోలో అయితే జూన్‌లో 12 శాతంగా ఉన్న ఓటింగ్ ఒక్కసారిగా 51 శాతానికి చేరింది. ఎస్ఆర్‌లు, మెన్షెవిక్‌లున్న లెఫ్ట్ గ్రూపుల్లో బోల్షివిక్‌లు నేతలుగా ఎదిగారు.

విప్లవ కమిటీల్లో, సోవియెట్‌లలో బోల్షివికీకరణ జరిగిందని ఈ పరిణామాలు చూపుతున్నాయి. ఈ పరిణామాలు మరోసారి నినాదాల్లో మార్పు అవసరాన్ని కల్పించాయి. 'ఆల్ పవర్ టు ది సోవియెట్స్' (సోవియెట్‌లకే పూర్తి అధికారం) మరోసారి రంగంలోకి వచ్చింది. ప్రాంతీయ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సోవియెట్‌ల ఉత్థానానికి, సోవియెట్‌లకే పూర్తి అధికారాన్ని బదలాయించాలనే డిమాండ్ ముందుకొచ్చింది. "సోవియెట్‌లకు అధికారమంటే... భూమిని, ఉత్పత్తుల్ని, ధాన్యాన్ని సక్రమంగా ఎలా పంపిణీ చేయాలో నేర్చుకొనబోయే... దేశ పాలన, ఆర్థిక వ్యవహారాల నియంత్రణ అంతా కూడా కార్మికులకు, రైతులకు బదలాయించడమే...".

"అన్ని కిటికీల్లోంచి సోషలిజం మనవైపే ఆసక్తిగా చూస్తోంది..." ఇదీ 1917 సెప్టెంబర్ నాటి రష్యా పరిస్థితి.

**అనువాదం: వారాల అజయ్‌కుమార్**

# కొత్త శకంలోకి చైనా సోషలిజం

## సిపిసి 19వ మహాసభల దిశానిర్దేశం



రచయిత సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, మార్క్సిస్టు ఎడిటర్

ఎస్. వెంకట్రావు

అయిదేళ్లకొకసారి జరిగే చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) జాతీయ మహాసభలు అక్టోబర్ 18 నుండి 24వ తేదీవరకు దేశరాజధాని బీజింగ్ నగరంలో జయప్రదంగా జరిగాయి. దేశ వ్యాపితంగా 8 కోట్ల 90 లక్షల మంది పార్టీ సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ 2,280 మంది ప్రతినిధులు మహాసభకు హాజరై నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సి జిన్‌పింగ్ ప్రవేశపెట్టిన నివేదికపై చర్చించి, ఆమోదించిన అనంతరం 205 మంది సభ్యుల నూతన కేంద్ర కమిటీని, మరో 171 మంది ప్రత్యామ్నాయ సభ్యులను మహా సభ ఎన్నుకుంది. కొత్త కేంద్ర కమిటీ ఈ నెల 25న సమావేశమై 25 మందితో నూతన పొలిట్ బ్యూరోను, ఏడుగురు సభ్యుల పొలిట్ బ్యూరో స్థాయీ సంఘాన్ని ఎన్నుకుంది. సి జిన్‌పింగ్ రెండోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

చైనా పార్టీ మహాసభల గురించి ఈ సారి చైనా ప్రజలే కాకుండా ప్రపంచం మొత్తం ఆసక్తిగా ఎదురు చూసింది. సాధారణంగా కమ్యూనిస్టు పార్టీ మహాసభలు జరిగేటప్పుడు విపరీతమైన దుష్ప్రచారాలకు పాల్పడే పశ్చిమ దేశాల మీడియా కూడా ఈసారి చైనా కమ్యూనిస్టు పార్టీ మహాసభలో ప్రధాన కార్యదర్శి నివేదికలోని అంశాల గురించి ఆసక్తిగా చర్చించడం విశేషం. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సోషలిస్టు చైనా ప్రబల ఆర్థిక శక్తిగా ఎదగడంతో బాటు ఏకధృవ ప్రపంచం నుండి బహుళ ధృవ ప్రపంచంవైపు పయనిస్తున్న అంతర్జాతీయ రాజకీయాల్లో చైనా ప్రముఖ పాత్ర నిర్వహించడం కూడా దీనికి కారణం.

గత అయిదేళ్ల కాలంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో చైనా ఆర్థిక, సామాజిక, శాస్త్ర-సాంకేతిక, సాంస్కృతిక రంగాల్లో సాధించిన విజయాలపై వర్క్ రిపోర్టులను మహాసభలో ప్రవేశపెట్టారు. ఈ కాలంలో చైనా ప్రపంచంలో రెండవ అతి పెద్ద ఆర్థిక శక్తిగా రూపొందింది. మరో నాలుగేళ్లలో- 2021లో శతవసంతోత్సవాలు జరుపుకోబోతున్న చైనా కమ్యూనిస్టు పార్టీ తన వందేళ్ల చరిత్రలో మార్క్సిజం - లెనినిజం సిద్ధాంతాన్ని చైనా నిర్దిష్ట పరిస్థితులకు వర్తింపజేస్తూ విప్లవాన్ని సాధించింది, సోషలిజం నిర్మాణంలో చోదక శక్తిగా పనిచేసింది. ప్రస్తుత 19వ జాతీయ మహాసభ కొత్త పరిస్థితిని విశ్లేషిస్తూ "కొత్త శకంలో చైనా లక్షణాలతో కూడిన సోషలిజం" అన్న కొత్త సూత్రీకరణ చేసింది. దీన్ని సి జిన్‌పింగ్ ఆలోచనా విధానం పేరుతో చైనా కమ్యూనిస్టు పార్టీ నిబంధనావళిలో చేర్చారు. నిజానికి చైనా మహా నేత మావో సె టుంగ్ నాయకత్వంలో చైనాలో విప్లవం జయప్రదం అయినప్పటినుండి పార్టీ చేసిన వివిధ విశ్లేషణలను పార్టీ నిబంధనావళిలో చేరుస్తూ వచ్చారు. ఇవి మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని చైనా నిర్దిష్ట పరిస్థితులకు వర్తింప జేయడంలో మరింత పరిపుష్టం గావించాయని పార్టీ పేర్కొంది. ఆవిధంగా చైనా కమ్యూనిస్టు పార్టీ 'మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనా విధానం, డెంగ్ సియావో పెంగ్ సిద్ధాంతం, మూడు ప్రాతినిధ్యాల సిద్ధాంతం, అభివృద్ధికి సంబంధించిన శాస్త్రీయ దృక్పథం' అనే సైద్ధాంతిక పునాదిమీద నడుస్తుంది. ఇప్పుడు 'నూతన శకంలో చైనా లక్షణాలతో సోషలిజంపై సి జిన్‌పింగ్ ఆలోచనా విధానం' అన్న దాన్ని కూడా చేర్చారు.

మావో జీవించి ఉండగానే మావో ఆలోచనా విధానం అన్న సూత్రీకరణను నిబంధనావళిలో చేర్చారు. డెంగ్ చనిపోయిన తరువాత చైనా లక్షణాలతో సోషలిజం అన్న సిద్ధాంతాన్ని చేర్చారు. జియాంగ్ జెమిన్ ప్రధాన కార్యదర్శిగా ఉండగా మూడు ప్రాతినిధ్యాల సిద్ధాంతాన్ని చేర్చగా, హూ జింటావో హయాంలో అభివృద్ధికి సంబంధించిన శాస్త్రీయ దృక్పథం అన్న సూత్రీకరణను చేర్చారు. మావో తరువాత ఇప్పుడు మొట్టమొదటిసారిగా సి జిన్‌పింగ్ జీవించి ఉండగానే ఆయన పేరుతో కొత్త సూత్రీకరణను నిబంధనావళిలో చేర్చడం విశేషం.

**కొత్త శకంలోకి చైనా లక్షణాలతో సోషలిజం**

చైనా లక్షణాలతో కూడిన సోషలిజం కొత్త శకంలోకి ప్రవేశించిందని సి జిన్‌పింగ్ 19వ మహాసభలో ప్రవేశపెట్టిన నివేదికలో తెలియజేశారు. ఈ కొత్త శకానికి అనుగుణంగా సోషలిజం నిర్మాణ వ్యూహాన్ని మహాసభ రూపొందించింది. ఇందులో రెండు దశలుంటాయి. మొదటి దశ 2021 (పార్టీ ఆవిర్భావ శతవార్షికోత్సవ సంవత్సరం) నుండి 2035 వరకు సుమారు 15 సంవత్సరాలు సాగుతుంది. రెండవ దశ 2035 నుండి 2049 (చైనా విముక్తి శతవార్షిక సంవత్సరం) వరకు మరో 15 ఏళ్ల పాటు సాగుతుంది.

1960వ దశకంలో సాంస్కృతిక విప్లవ కాలంలో 'మహా ముందడుగు' అన్న దుందుడుకు నినాదం నుండి చైనా కమ్యూనిస్టు పార్టీ బయట పడిన తరువాత డెంగ్ సియావో పెంగ్ చైనాలో సోషలిజం నిర్మాణానికి సుదీర్ఘకాలం పడుతుందని చెప్పారు. ఉత్పత్తి శక్తులు అంతగా అభివృద్ధి కాని చైనాలో సోషలిజం ప్రాథమిక దశలో ఉందని చెపారు. ఈ దశలో సోషలిజం నిర్మాణానికి ఆయన హయాంలో పార్టీ రూపొందించిన వ్యూహం 'చైనా లక్షణాలతో సోషలిజం నిర్మాణం' గా స్థిరపడింది. దేశంలో సంపద సృష్టించడం,

పేదరికాన్ని నిర్మూలించడం, ప్రజల కనీసావసరాలు తీర్చడం ఈ దశ ప్రధాన లక్ష్యం. చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం ఈ వ్యూహాన్ని వివిధ దశల్లో జయప్రదంగా అమలు పరచడం వల్ల చైనా ఆర్థికంగా శరవేగంతో అభివృద్ధి చెందింది. అత్యంత పేద దేశంగా, 'తూర్పున రోగగ్రస్థ దేశం'గా పేరు గాంచిన చైనా చారిత్రకంగా అతి కొద్ది కాలంలో ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందింది. పారి శ్రామిక విప్లవ కాలం నుండి కొన్ని శతాబ్దాల పాటు ప్రపంచాన్ని దోచుకుని అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలకు దీటుగా అనతి కాలంలోనే చైనా అభివృద్ధి సాధించిందంటే దానికి కమ్యూనిస్టు పార్టీ దూరదృష్టి, కృషి కారణం.

అయితే ప్రభుత్వ రంగంతోపాటుగా ప్రయివేటు రంగాన్ని, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా సంపద పెంచుకునే కార్యక్రమం వల్ల దేశంలో ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య అసమానతలు విపరీతంగా పెరిగాయి. పర్యావరణానికి తీవ్రమైన హాని జరిగింది. వినిమయ దారీ సంస్కృతి బాగా వ్యాపించింది. నూతన శకంలో ఈ రుగ్మతల నుండి బయట పడాలని సి జిన్‌పింగ్ పిలుపునిచ్చారు.

2021 నాటికి చైనాలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించి ఆర్థిక వ్యవస్థను ఒక మోస్తరు సౌభాగ్యవంతమైన దేశంగా మార్చడం, ఆ ఆర్థిక పునాది మీద రాబోయే 30 ఏళ్లలో చైనాను 'మహత్తర ఆధునిక సోషలిస్టు దేశం'గా రూపొందించడం కొత్త శకంలో కమ్యూనిస్టు పార్టీ లక్ష్యంగా నిర్దేశించారు. ఈ శకంలో దేశంలో ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య అసమానతలు తగ్గించడానికి కృషి చేస్తారు. ప్రభుత్వ రంగాన్ని పటిష్ట పరుస్తారు. సోషలిజాన్ని సంపూర్ణ అభివృద్ధివైపు తీసుకుపోతారు. ఈ శకం మొదటి దశలో 2035 నాటికి ఆర్థిక వ్యవస్థ ఆధునీకరణను పూర్తి చేస్తారు. రెండో దశ పూర్తయ్యేనాటికి చైనాను 'సౌభాగ్యవంతమైన, బలమైన, ప్రజా తంత్రయుతమైన, సాంస్కృతికంగా పురోగమించిన, సామరస్యపూరితమైన, సుందరమైన మహత్తర ఆధునిక సోషలిస్టు దేశంగా' రూపొందించడానికి కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా కృషి చేయాలని మహాసభ నిర్దేశించింది.

**"ఈ శకం మొదటి దశలో 2035 నాటికి ఆర్థిక వ్యవస్థ ఆధునీకరణను పూర్తి చేస్తారు. రెండోదశ పూర్తయ్యే నాటికి చైనాను 'సౌభాగ్యవంతమైన, బలమైన, ప్రజా తంత్రయుత మైన, సాంస్కృతికంగా పురోగమించిన, సామరస్య పూరితమైన, సుందరమైన మహత్తర ఆధునిక సోషలిస్టు దేశంగా' రూపొం దించడానికి కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా కృషి చేయాలని మహాసభ నిర్దేశించింది."**


చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ మహాసభలో నివేదిక ప్రవేశ పెడుతున్న ప్రధాన కార్యదర్శి సి జిన్‌పింగ్

ఈ లక్ష్యం సాధించాలంటే చైనా సమాజంలో నేడు నెలకొన్న ప్రధాన వైరుధ్యాన్ని పరిష్కరించడం అవసరం అని పార్టీ ప్రధాన కార్యదర్శి నివేదికలో పేర్కొన్నారు. దేశంలో 'అసమాన, అసంపూర్ణ అభివృద్ధికీ, ప్రజల్లో మంచి జీవనం కోసం పెరుగుతున్న అవసరాలకూ మధ్య ఉన్న వైరుధ్యం' ఇది. మరింత ఉన్నత జీవనం కోసం ప్రజలు కోరుకుంటున్న అవసరాలు ఈనాడు బాగా విస్తృత మవుతున్నాయి. వారి భౌతిక, సాంస్కృతిక అవసరాలు పెరగడమే కాదు, మరింత ప్రజాస్వామ్యం కోసం, చట్టబద్ధమైన పాలన కోసం, ధర్మం, న్యాయం, భద్రత, మరింత మెరుగైన వాతావరణం కోసం వారి డిమాండ్లు కూడా పెరుగుతున్నాయి అని నివేదిక పేర్కొంది.

దీనిపై చైనా పార్టీ పత్రికల్లో ఈ క్రింది వివరణ ఇచ్చారు: చైనా యువకులు నేటికీ మరింత మంచి చదువుల కోసం అమెరికా, యూరప్ తదితర దేశాల్లోని మంచి విశ్వ విద్యాలయాలకు వెళుతున్నారు. అంటే అటువంటి చదువు కావాలని వారు కోరుకుంటున్నారు. అలాగే దేశంలో సుందర ప్రదేశాలను సందర్శించాలనీ, కొన్నాళ్లు అక్కడ విశ్రాంతి తీసుకోవాలనీ కోరుకుంటున్నారు. కానీ వారి అవసరాలకు తగ్గ సదుపాయాలు దేశంలో లేవు. అత్యుత్తమ వైద్యం తమకు అందుబాటులో ఉండాలని కోరుకుంటున్నారు. ఇటువంటి సదుపాయాలన్నిటినీ దేశంలోనే నిర్మించినప్పుడు మాత్రమే పెరుగుతున్న ప్రజల అవసరాలను తీర్చగలం. కొత్త వైరుధ్యాన్ని పరిష్కరించగలం.

ఈ వైరుధ్యాన్ని పరిష్కరించాలంటే చైనా ఆర్థిక వ్యవస్థలో కొన్ని మార్పులు చేయాలని సి జిన్‌పింగ్ ప్రకటించారు. చైనా ఆర్థిక వ్యవస్థ శీఘ్రాభివృద్ధి దశ నుండి ఉన్నత ప్రమాణాలుగల అభివృద్ధివైపు పరివర్తన చెందాలి. ఆధునిక ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసే క్రమంలో దేశం నిజ ఆర్థిక వ్యవస్థపై కేంద్రీకరించాలి. చైనా మరింత బలంగా మారాలంటే, మరింత పనితనం పెంచుకోవాలంటే, మరింత మెరుగైన అభివృద్ధి సాధించాలంటే దేశంలో ప్రభుత్వ పెట్టుబడిని ప్రోత్సహించాలి. చైనా సంస్థలను ప్రపంచ స్థాయిగల, ప్రపంచ స్థాయిలో పోటీపడగల సంస్థలుగా అభివృద్ధి చేయాలి. దేశ ప్రజల వినియోగంపై ఆధారపడి అభివృద్ధి సాధించడానికి చైనా ప్రాధాన్యత నిస్తుందని జిన్‌పింగ్ చెప్పారు. అదే సమయంలో చైనా ప్రపంచానికి తన తలుపులు మూసివేయబోదనీ, నిజానికి అది మరింత తెరుస్తుందనీ పేర్కొన్నారు.

దేశంలో చట్టబద్ధ పాలనను మరింత బలపరచడం కోసం చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర స్థాయిలో ఒక నాయకత్వ గ్రూపును ఏర్పాటు చేస్తుంది. రాజ్యాంగం ప్రకారం అన్ని

> **“ చైనా ప్రజా సైన్యం పైన పార్టీకి తిరుగులేని నాయకత్వం ఉంటుంది. కొత్త శకంలో కూడా వనరుల పంపిణీలో మార్కెట్ శక్తులకు “నిర్ణయాత్మక పాత్ర” ఉంటుంది. వీటితోబాటు అవినీతిపై యుద్ధం, ఒక బెల్టు, ఒక రోడ్డు అభివృద్ధి కార్యక్రమం, సరఫరా వైపు సంస్కరణలు వంటి అంశాలను కూడా నివేదికలో పేర్కొన్నారు. ”**



చైనా విప్లవ నేతలు మావో సె టుంగ్, డెంగ్ సియావో పింగ్

వ్యవస్థలూ నడుచుకునేట్లు ఇది చూస్తుంది.

చైనాను రెండు దశల్లో ఆధునికం చేసే క్రమంలో సుందరంగా తీర్చిదిద్దాలి, అంటే అర్థం మనిషికీ, ప్రకృతికీ మధ్య సామరస్యంతో కూడిన సహజీవనం నెలకొల్పడమేనని నివేదిక వివరణ ఇచ్చింది. వాతావరణ పరిరక్షణకు చైనా అధిక ప్రాధాన్యత నిస్తుంది. ప్రభుత్వ సహజ వనరులను నిర్వహించడానికీ, సహజ పర్యావరణ వ్యవస్థ లను అంటే అడవులు, నదులు, సముద్రాలను రక్షించడానికీ, రక్షిత అటవీ ప్రాంతాలను పెంపొందించడానికీ రెగ్యులేటరీ సంస్థలను నెలకొల్పుతుందని నివేదికలో పేర్కొన్నారు.

నిజానికి పర్యావరణ పరిరక్షణ కోసం చైనా ప్రభుత్వం ఇటీవల కాలంలో తీవ్రమైన చర్యలు తీసుకుంటోంది. ఒకనాడు చైనా రాజధాని నగరం బీజింగ్‌లో వాతావరణ కాలుష్యంతో ఊపిరి పీల్చుకోడానికి ఇబ్బంది పడే పరిస్థితి ఉండేది. గత అయిదేళ్ల కాలంలో బీజింగ్ చుట్టుపక్కల వేలాది కాలుష్యకారక పరిశ్రమలను తొలగించారు. ఉత్తర ప్రాంతంలో అనేక బొగ్గు గనులను మూసేశారు. పునరుత్పత్తి ఇంధన వనరులను ముఖ్యంగా సౌరవిద్యుత్‌ను వినియో గించుకోవడానికి పెద్ద ఎత్తున ప్రాధాన్యత నిస్తు న్నారు. ఎంతగానంటే ఇటీవలనే సౌరవిద్యుత్ రంగంలోకి ప్రవేశించిన చైనా నేడు 130 గిగా వాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేస్తూ ప్రపంచంలో నెంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించింది. 2014 నాటికి ప్రపంచంలోని మొత్తం సౌర విద్యుత్తు స్థాపక సామర్థ్యంలో 70 శాతం చైనాలోనే ఉంది. గత ఒక్క ఏడాదిలోనే దేశంలో ఈ విద్యుత్తు ఉత్పత్తి 81 శాతం పెరిగింది. 2030 నాటికి దేశ ఇంధన అవసరాల్లో 20 శాతాన్ని పునరుత్పత్తి ఇంధనంతో పూరించాలని ప్రణాళిక వేసింది.

2035 నాటికి చైనా సైన్యం ఆధునీకరణ పూర్తి చేయాలని నివేదికలో నిర్దేశించారు. 2020 నాటికి సైన్యంలో యాంత్రీకరణను పూర్తి చేస్తారు. సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడం ద్వారా వ్యూహాత్మక సామర్థ్యాన్ని పెంపొందిస్తారు. 2049లో చైనా విముక్తి శతవార్షికోత్సవం నాటికి చైనా ప్రజా సైన్యం ప్రపంచ స్థాయి సైనికశక్తిగా ఎదగాలని నిర్దేశించారు. చైనా ఏ స్థాయికి అభివృద్ధి చెందినప్పటికీ ఆధిపత్యానికీ, దురాక్రమణలకూ సంకల్పించదని సి జిన్‌పింగ్ స్పష్టం చేశారు. అవినీతిపై గత అయిదేళ్ల కాలంలో జరిపిన యుద్ధాన్ని విజయవంతంగా ముగిస్తామని నివేదికలో పేర్కొన్నారు.

గతంలో మాదిరిగానే కొత్త శకంలో చైనా లక్షణాలతో సోషలిజం నిర్మించడంలో కూడా చైనా కమ్యూనిస్టు పార్టీ చోదక శక్తిగా పనిచేస్తుంది. “దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ, అన్ని రంగాల్లోనూ అభివృద్ధి కృషికి పార్టీ నాయకత్వం వహిస్తుంది” అని జిన్‌పింగ్ నివేదికలో చెప్పారు. “చైనా లక్షణాలతో సోషలిజాన్ని నిర్మించడంలో చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అత్యంత ముఖ్యమైన ఆధారం, ఈ వ్యవస్థకు పార్టీయే మహత్తర బలం అని ఈ మహాసభ ఉద్ఘాటిస్తున్నది” అని నివేదిక ప్రకటించింది. చైనా ప్రజా సైన్యం పైన పార్టీకి తిరుగులేని నాయకత్వం ఉంటుంది. కొత్త శకంలో కూడా వనరుల పంపిణీలో మార్కెట్ శక్తులకు “నిర్ణయాత్మక పాత్ర” ఉంటుంది. వీటితోబాటు అవినీతిపై యుద్ధం, ఒక బెల్టు, ఒక రోడ్డు అభివృద్ధి కార్యక్రమం, సరఫరా వైపు సంస్కరణలు వంటి అంశాలను కూడా నివేదికలో పేర్కొన్నారు.

### ఒక మోస్తరు సౌభాగ్యవంతమైన దేశం

2020 నాటికి చైనాను ఒక మోస్తరు సౌభాగ్య వంతమైన దేశంగా అభివృద్ధిచేయడం కమ్యూనిస్టు పార్టీ తక్షణ లక్ష్యంగా 19వ మహాసభ నిర్ణయించింది. నిజానికి 2002లో జరిగిన పార్టీ 16వ మహాసభలోనే ఈ లక్ష్యం నిర్ణయించారు. తరువాత 17,18 మహాసభల్లో ఈ లక్ష్య సాధనకు కృషిని ముందుకు తీసుకు పోయారు. ఈ పునాది మీద ఆధారపడి తరువాతి మూడు దశాబ్దాల్లో దేశాన్ని మహత్తర ఆధునిక సోషలిస్టు దేశంగా నిర్మించాలనేది తదుపరి లక్ష్యం. 2020 నాటికి చైనాను ఒక మోస్తరు అభివృద్ధి చెందిన దేశం స్థాయికి... అంటే ఐరోపాలోని అనేక మధ్యస్థ దేశాల స్థాయికి తీసుకుపోవాలంటే శాస్త్ర– సాంకేతికాభివృద్ధి, విద్య మీద కేంద్రీకరించాలని మహాసభ నిర్దేశించింది. పరిశోధన, అభివృద్ధికి నిధులు మరింత పెంచడం, ఉన్నత సెకండరీ విద్యను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావడం ఈ కృషిలో భాగం. ఆవిష్కరణల ఆధార అభివృద్ధి, కార్మికుల నాణ్యత పెంచడం, గ్రామీణ ప్రాంతాలను పట్టణీకరించడం ఇందులో భాగం

గా ఉంటుంది. మొత్తం మీద ప్రజల పెరుగుతున్న అవసరాలను తీర్చడం ద్వారా సమాజంలో ఏర్పడిన వైరుధ్యాన్ని పరిష్కరించాలన్నది ఈ కాలంలో పార్టీ అనుసరించే వ్యూహం.

**గత అయిదేళ్లలో చైనా అభివృద్ధి**

2008లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడిన తరువాత అమెరికా, ఐరోపా దేశాలతో బాటు అనేక వర్ధమాన దేశాల ఆర్థిక పురోగమనం తల్లకిందులైంది. ఎగుమతి ప్రధానంగా నడుస్తున్న చైనా మీద కూడా దాని ప్రభావం పడింది. అయితే చైనా ప్రభుత్వం మారిన పరిస్థితులకు అనుగుణంగా ఆర్థిక విధానాల్లో మార్పులు చేసుకుంది. ప్రజల కొనుగోలు శక్తిని గణనీయంగా పెంచే ప్రత్యామ్నాయ విధానాల వైపు మళ్లింది. ఫలితంగా సంక్షోభ కాలంలోనూ దాని ఆర్థికాభివృద్ధి కొనసాగుతోంది. కమ్యూనిస్టు పార్టీ 18వ జాతీయ మహాసభల తరువాత గడచిన అయిదేళ్ల కాలంలో చైనా సాధించిన అభివృద్ధి దీనికి నిదర్శనం.

**ఆర్థికాభివృద్ధి:** 2013 -2016 మధ్య నాలుగేళ్ల కాలంలో చైనా స్థూల జాతీయోత్పత్తి ఏటా 7.2 శాతం పెరిగింది. ఈ కాలంలో వర్ధమాన దేశాల సగటు అభివృద్ధి 4 శాతం కాగా ప్రపంచ సగటు 2.6 శాతం. ఈ ఏడాది చైనా జిడిపి వృద్ధి 6.9 శాతం ఉంటుందని అంచనా. భారత దేశ వృద్ధి అంచనా 5.7 శాతం. వస్తూత్పత్తి రంగంలో చైనా నేటికీ ప్రపంచ నెంబర్ వన్‌గా ఉన్నప్పటికీ దాని సేవా రంగం జిడిపి కన్నా ఎక్కువగా పెరుగుతోంది. అందువల్ల 2012లో జిడిపిలో సేవా రంగం వాటా 45.3 శాతం ఉండేది. ఈ అయిదేళ్లలో అది 51.6 శాతానికి పెరిగింది. 2017 ప్రథమార్థంలో ఇది మరింత పెరిగి జిడిపిలో 54.1 శాతానికి చేరుకుంది.

**ఉద్యోగ కల్పన:** ఈ కాలంలో చైనా పట్టణ ప్రాంతాల్లో ఏడాదికి 1 కోటి 30 లక్షలు చొప్పున ఉద్యోగాలు సృష్టించింది. 2017 తొలి ఎనిమిది మాసాల్లో 97 లక్షల ఉద్యోగాలు కల్పించారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణా లకు వచ్చి ఉద్యోగాలు చేసే వారి సంఖ్య ఈ కాలంలో ఏడాదికి 1.8 శాతం చొప్పున పెరిగిం ది. ఉద్యోగ కల్పనలో గణనీయమైన అభివృద్ధి సాధించింది కాబట్టే ఈనాడు చైనాలో నిరుద్యోగం ప్రపంచంలోనే తక్కువగా ఉంది. యువతలో నిరుద్యోగం-అభివృద్ధి చెందిన ఓఇసిడి దేశాల్లో 14.6 శాతం, భారత్‌లో 31 శాతం ఉండగా చైనాలో 11.22 శాతం మాత్రమే ఉంది.

**ప్రజల ఆదాయం:** 2012 -2016 మధ్య అయిదేళ్ల కాలంలో చైనా ప్రజల తలసరి

> **“19వ మహాసభలు జరుపుకొనే నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీలో 8.9 కోట్ల మంది సభ్యులున్నారు. దేశ జనాభాలో వీరి సంఖ్య 6.8 శాతం. 1921లో చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. ఆ సంవత్సరం తొలి మహాసభ జరుపుకొన్నప్పుడు పార్టీలో సభ్యుల సంఖ్య కేవలం 50 మంది. నాటి నుండి నేటివరకు దాదాపు శతాబ్ద కాలంలో చైనా కమ్యూనిస్టు పార్టీ అనేక ఒడిదుడుకుల నెదుర్కొంది. అశేష త్యాగాలు చేసింది.”**



జియాంగ్ జెమిన్, హూ జింటావో

ఆదాయం ఏడాదికి 7.4 శాతం చొప్పున పెరిగింది. 2012లో తలసరి వార్షిక ఆదాయం 7,311 యువాన్లు (సుమారు 73,000 రూపాయలు) నుండి 2016 నాటికి 23,821 యువాన్లకు (సుమారు 2 లక్షల 30 వేల రూపాయలకు) పెరిగింది. 2016లో భారత తలసరి వార్షికాదాయం రూ. 93,000 తో పోల్చినప్పుడు చైనీయుల ఆదాయం రెండున్నర రెట్లు ఎక్కువ.

ఈ కాలంలో చైనాలో గ్రామీణ పేదరికాన్ని గణనీయంగా తగ్గించారు. మారుమూల గ్రామీణ ప్రజల తలసరి ఆదాయాన్ని ఏటా 10.7 శాతం పెంచుతూ గ్రామీణ పేదల సంఖ్యను అయిదేళ్లలో 10 కోట్ల నుండి నాలుగు కోట్లకు తగ్గించారు. 2020 నాటికి దేశంలో అసలు పేదరికం లేకుండా చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని కమ్యూనిస్టుపార్టీ కృషి చేస్తోంది.

**పరిశోధన, అభివృద్ధి:** చైనా ఆర్థిక వ్యవస్థ ఆధునీకరణలో భాగంగా కమ్యూనిస్టు ప్రభుత్వం పరిశోధన, అభివృద్ధి రంగంపై పెద్ద ఎత్తున ఖర్చు చేస్తోంది. అయిదేళ్ల కాలంలో ఈ రంగంపై ఖర్చును 52.2 శాతం పెంచింది. జిడిపిలో పరిశోధన, అభివృద్ధిపై ఖర్చు వాటా అయిదేళ్ల క్రితం 1.91 శాతం ఉండేది కాస్తా 2016 నాటికి 2.11 శాతానికి పెరిగింది.

**రానున్న అయిదేళ్లకు ప్రజా సంక్షేమ లక్ష్యాలు**

సిపిసి 19వ మహాసభ రానున్న అయిదేళ్లకు గాను ప్రజా సంక్షేమానికి కొన్ని లక్ష్యాలు నిర్దేశించింది. అవి:

2020 నాటికి దేశంలో పేదరికం లేకుండా చేయాలి. అలా చేయాలంటే మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో చిట్టచివరి వ్యక్తిని కూడా పేదరికం నుండి బయట పడేయడం లక్ష్యంగా పనిచేయాలి.

సీనియర్ సెకండరీ విద్య అందరికీ అందుబాటులో ఉండేట్లు చేయాలి. దేశంలో మారుమూల గ్రామాలతో సహా అందరికీ తప్పని సరి విద్య గరపాలి. ప్రీ స్కూల్ విద్య, ప్రత్యేక అవస రాలకు విద్య, ఆన్‌లైన్ విద్యను ప్రోత్సహించాలి. ఉన్నత ప్రమాణాలు గల వైద్యం అందించేందుకు చైనా విలక్షణ వైద్య సేవలను రూపొందించాలి. ఆసుపత్రుల యాజమాన్యాన్ని ఆధునీకరించాలి.

రానున్న తరాలను దృష్టిలో పెట్టుకుని

> **“ సోషలిజానికి నూకలు చెల్లాయనీ, కమ్యూ నిజానికి కాలం చెల్లిందనీ సామ్రాజ్యవాదులు ఒక వైపు ప్రచారం చేస్తూ వుంటే కమ్యూనిజమే ప్రజలను పేదరికం నుండీ, ఆకలి, అవిద్య, అనారోగ్యాలనుండీ విముక్తి గావించే ఏకైక సిద్ధాంతమనీ, సోషలిజంలో మాత్రమే ప్రజలు నిజమైన అభివృద్ధి సాధిస్తారనీ చైనా నిరూపించింది. ”**

పర్యావరణ నాగరికతను నిర్మించాలి. నదులు, పర్వతాలు, అడవులు, సముద్రాలు ఇతర పర్యావరణ వ్యవస్థలను కాపాడుకుంటూ 'సుందరమైన' చైనాను నిర్మించుకోవాలి.

పౌరుల ఉపాధి, వేతనాలు క్రమంగా పెరిగేట్లు చూడాలి. నాణ్యమైన ఉద్యోగాలు కల్పించడం, ఉత్పాదకతకూ, ఆర్థికాభివృద్ధికీ అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగాలి.

పౌరులందరికీ మరింత మెరుగైన గృహాలు సమకూర్చాలి. దేశంలో స్పెక్యులేషన్ కోసం కాకుండా ప్రజల నివాసం కోసం గృహనిర్మాణం జరగాలి అని 19వ మహాసభలో సి జిన్‌పింగ్ ప్రవేశపెట్టిన నివేదిక పేర్కొంది.

### చైనా ప్రజల అభివృద్ధికి చోదక శక్తి

19వ మహాసభలు జరుపుకొనే నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీలో 8.9 కోట్ల మంది సభ్యులున్నారు. దేశ జనాభాలో వీరి సంఖ్య 6.8 శాతం. 1921లో చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. ఆ సంవత్సరం తొలి మహాసభ జరుపుకొన్నప్పుడు పార్టీలో సభ్యుల సంఖ్య కేవలం 50 మంది. నాటి నుండి నేటివరకు దాదాపు శతాబ్ద కాలంలో చైనా కమ్యూనిస్టు పార్టీ అనేక ఒడిదుడుకుల నెదుర్కొంది. అశేష త్యాగాలు చేసింది. ఫ్యూడల్ బంధనాలనుండి, విదేశీ ఆధిపత్యం, దురాక్రమణల నుండి, కొమింటాంగ్ సైనిక నియంతృత్వం నుండి చైనా ప్రజలను విముక్తి గావించే క్రమంలో జరిగిన వీరోచిత పోరాటాల్లో అనేక లక్షల మంది పార్టీ సభ్యులు ప్రాణాలు త్యాగం చేశారు. ఈ పోరాటానికి నాయకత్వం వహించి చైనా ప్రజల విముక్తికి చోదక శక్తిగా పనిచేసింది చైనా కమ్యూనిస్టు పార్టీ. మావో నాయకత్వంలో పార్టీ మార్క్సిజం-లెనినిజాన్ని చైనా పరిస్థితులకు సృజనాత్మకంగా వర్తింప చేయడం ద్వారా విప్లవాన్ని జయప్రదం చేసింది. 1949లో చైనా విముక్తి చెందింది. అప్పటికి దేశం అన్ని రంగాల్లోనూ పూర్తిగా వెనుకబడి ఉంది.

విప్లవ ప్రభుత్వం దున్నే వారికి భూమి పంచింది. భారీ పరిశ్రమలు, ప్రాజెక్టులు నెలకొల్పింది. ప్రజలకు ప్రాథమిక విద్య, వైద్యం సమకూర్చింది. ఈ చర్యలు చైనా సమాజంలో కొత్త జవసత్వాలు నింపాయి. కానీ పార్టీలో తలెత్తిన దుందుడుకు వాదం సమాజాభివృద్ధి స్థాయితో నిమిత్తం లేని నినాదాలు ఇవ్వడం వల్ల 1966 నుండి ఒక దశాబ్దం పాటు చైనా సమాజం తీవ్రమైన సమస్యల నెదుర్కొంది. 1978లో డెంగ్ సియావో పింగ్ నాయకత్వంలో ఈ తప్పిదాలను దిద్దుకుంటూ 'చైనా లక్షణాలతో కూడిన సోషలిజం' నినాదం కింద అనేక ఆర్థిక సంస్కరణలు చేపట్టింది. 1982లో జరిగిన 12వ మహాసభ ఈ నినాదాన్ని, ఆర్థిక సంస్కరణలను ఆమోదించింది మొదలు వివిధ మహాసభల్లో నాటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి వ్యూహంలో మార్పులు చేసుకుంటూ వస్తోంది.

1989లో చైనా సోషలిస్టు వ్యవస్థ 'ప్రజాస్వామ్య ఉద్యమం' రూపంలో సోషలిస్టు వ్యతిరేక ఉద్యమాన్ని ఎదుర్కొంది. అమెరికా సామ్రాజ్యవాదుల దర్శకత్వంలో బీజింగ్‌లోని తియాన్‌మెన్ చౌక్‌లో జరిగిన ఈ తిరుగుబాటును పార్టీ జయప్రదంగా ఎదుర్కొంది. తరువాత 1990 దశకం ప్రారంభంలో సోషలిజానికి తగిలిన ఎదురుదెబ్బలను కాచుకుంది. చరిత్ర అంతమైందనీ, కమ్యూనిజానికి కాలం చెల్లిందన్న నినాదాలు, సిద్ధాంతాలను తిప్పికొట్టింది. మార్క్సిజం లెనినిజాన్ని కాలమాన పరిస్థితులకు సృజనాత్మకంగా వర్తింపజేస్తూ ప్రపంచంలో అత్యంత వెనుకబడిన చైనాను నేడు ఆర్థిక, సామాజిక, శాస్త్ర-సాంకేతిక, సైనిక రంగాల్లో శక్తివంతమైన దేశంగా మార్చింది. నిజానికి 30 ఏళ్ల కాలంలో 80 కోట్ల మంది ప్రజలను పేదరికం నుండి విముక్తిగావించి సోషలిస్టు చైనా ప్రపంచ చరిత్రలోనే ఒక మహాద్భుతం చేసిందని ప్రపంచ బ్యాంకు ఒక సర్వే నివేదికలో పేర్కొంది. సోషలిజానికి నూకలు చెల్లాయనీ, కమ్యూనిజానికి కాలం చెల్లిందనీ సామ్రాజ్యవాదులు ఒక వైపు ప్రచారం చేస్తూ వుంటే కమ్యూనిజమే ప్రజలను పేదరికం నుండీ, ఆకలి, అవిద్య, అనారోగ్యాలనుండీ విముక్తి గావించే ఏకైక సిద్ధాంతమనీ, సోషలిజంలో మాత్రమే ప్రజలు నిజమైన అభివృద్ధి సాధిస్తారనీ చైనా నిరూపించింది. అందుకే చైనా కమ్యూనిస్టు పార్టీ ఇంతింతై వటుడింతై అన్నట్లు 1921లో పుట్టినప్పుడు 50 మంది సభులతో ఉండేది నేడు 9 కోట్ల మందితో జర్మనీ జనాభాను మించిపోయేంత ఎదిగింది. సోషలిజానికి ఎదురుదెబ్బ తగిలినప్పుడు చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యుల సంఖ్య సుమారు 4.6 కోట్లు. ఈ పాతికేళ్లలో అది రెట్టింపైంది.

అయితే చైనా సమాజానికి సమస్యలు లేవని కాదు. సోషలిస్టు సమాజంలో పెట్టుబడిదారీ సంస్కరణలు తెచ్చినప్పుడు ఆ వ్యవస్థకు సంబంధించిన అనేక రుగ్మతలు కూడా వచ్చి చేరాయి. గాలికోసం కిటికీలు తెరిచినప్పుడు ఈగలు కూడా వస్తాయి, వాటిని జాగ్రత్తగా నిర్మూలించడం మినహా మరో మార్గం లేదని డెంగ్ సియావో పెంగ్ చెప్పారు. సమాజంలో ప్రవేశించిన రుగ్మతలు కమ్యూనిస్టు పార్టీలోకి కూడా వస్తాయి. చైనా పార్టీ ఇటీవలి కాలంలో ఎదుర్కొంటున్న పెద్ద సమస్య అవినీతి. పార్టీలోనూ, అధికారుల్లోనూ అవినీతి విపరీతంగా పెరిగిపోయి చివరికి పార్టీ జవసత్వాలనే తినేసే స్థితికి చేరుకుందని చైనా పార్టీ నాయకత్వం గుర్తించింది. 18వ మహాసభలో సి జిన్‌పింగ్ ప్రధాన కార్యదర్శి అయ్యాక అవినీతిపై పార్టీ యావత్తూ పెద్ద యుద్ధం చేసింది. పార్టీ కేంద్ర కమిటీ కింద 'క్రమశిక్షణా పర్యవేక్షణ కోసం కేంద్ర కమిషన్' ను నియమించింది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించినందుకు 12 లక్షల మంది సభులపై చర్యలు తీసుకున్నట్లు, 2.4 లక్షల మంది పార్టీ నాయకులకు శిక్ష విధించినట్లు కమిషన్ తన నివేదికలో తెలిపింది. అనేక మంది అవినీతి అధికారులను జైలుకు పంపారు, తీవ్రమైన అవినీతికి పాల్పడిన వారికి మరణ శిక్ష విధించారు. అవినీతిపై యుద్ధంలో పూర్తి విజయం సాధించాలని జిన్‌పింగ్ మహాసభలో ప్రకటించారు.

ఇటువంటి సమస్యలను అధిగమిస్తూనే 140 కోట్ల మంది చైనా ప్రజలను పేదరికం నుండి విముక్తి చేసి, చైనాను అనతి కాలంలోనే ప్రపంచంలో రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్ది, సోషలిజం ఔన్నత్యాన్ని విశ్వమంతటా వ్యాప్తి చేస్తున్న చైనా కమ్యూనిస్టు పార్టీకి 19వ మహాసభల సందర్భంగా జేజేలు.

❋

విశ్లేషణ

# కులాల 'గీత'లు గీసిన భగవద్గీత

**తెలకపల్లి రవి**



రచయిత ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

వేదాలు, ఉపనిషత్తులు,భగవద్గీత– ఇవే భారతీయ సంప్రదాయమనీ, సంస్కృతి అని రోజూ ప్రవచనాలు వింటూనే వుంటాం. ఈ మాటలకు అర్థాలేమిటి? వాటి పరమార్థ మేమిటి? అన్న చర్చ చాలా తక్కువగా జరుగు తుంటుంది. పైగా వాటి గురించి ప్రశ్నించడమే పాతకమని ప్రచారాలు, దాడులు కూడా జరుగుతుంటాయి. వేల సంవత్సరాలుగా ఈ దేశంలో పూజలందుకుంటున్న వేదాలు, పురాణాలు, ఇతిహాసాలను చారిత్రిక దృష్టితో గాక అరకొర అవగాహనతో అవహేళన చేసే వారు కూడా తెలియకుండానే అలాటి శక్తుల కుట్రలకు దోహదం చేస్తుంటారు. అవహేళన కన్నా అవగాహన ముఖ్యం.

వేదాలు అంటేనే వూగిపోయేవారు ఆ పదానికి వున్న అర్థమే మర్చిపోతుంటారు. విద్ అంటే జ్ఞానం. విద్య విద్యార్థి అనడం అందుకే. విదితం అంటే తెలిసింది అని. అనుభవైకవేద్యం అంటే అనుభవంలో వున్నది అని అర్థం. కనుక వేదం అన్నది ఒక యుగపు జ్ఞానం మాత్రమే తప్ప దానికి వేరే అతీత స్థానం లేదు. వేదాలలో వున్న పదాలు, పదార్థాలు, దేవుళ్ల పేర్లు, ఆచారాలు ఇప్పుడు చలామణి అవుతున్న చాలా విశ్వాసాలు, నమ్మకాలతో పొసగవు. అందుకే ఉపనిషత్తులు రాశారు. ఉపనిషత్తు అంటే దగ్గరగా వుండేది అని అర్థం. వాటిని వేదాంతం అన్నారు. నిజంగానే అవి వేదాంతం పేరిట మసిపూశాయి. తర్వాతి అవసరాల ప్రకారం వేదాలను చిత్రించడం కోసమే ఉపనిషత్తులు. తర్వాత వచ్చిన వర్ణ వ్యవస్థ శూద్రులు వేదాలు చదవకూడదని శాసించింది. చదవకూడదు గాని అనుసరించాలి. అదెలా సాధ్యం? అందుకే ఆ సారాంశంతో ఇతిహాసాలు రాశామన్నారు. రామాయణ మహాభారతాలు ఇతిహాసాలు. వీటిని శూద్రులు వినొచ్చు. ఇలా ఈ దేశం వేదభూమి అంటూనే అసలైన వేదాలలో వున్న సత్యాలనూ సామాజిక పరిణామ క్రమాన్ని సామాన్య ప్రజలకూ, శ్రమజీవులైన శూద్ర కులాలకూ, దళితులకూ అందకుండా చేశారన్నమాట.

**భక్తి మార్గం– విష్ణు అవతారం**

మహాభారతాన్ని పంచమ వేదం అన్నారు. కృష్ణుడు అందులో ఒక పాత్రధారి మాత్రమే కాదు సూత్రధారి కూడా. ద్రౌపదీ స్వయంవర ఘట్టంలోనే ఆయన ప్రవేశిస్తాడు. కురుక్షేత్ర యుద్ధం ముగిసి పాండవులు రాజ్యాధికారం, స్వర్గారోహణం చేసిన తర్వాత తనూ ఒక వేట గాడి బాణపు వేటుకు అస్తమిస్తాడు. ఇదిగో ఆ కురుక్షేత్ర యుద్ధంలో తన తండ్రులూ, తాతలూ, సోదరులను హతమార్చడానికి వెను కాడుతున్న అర్జునుని కార్యోన్ముఖం చేయడానికి చెప్పిందే గీత. కృష్ణుడు అవతారపురుషుడు గనక అది భగవద్గీత. వైదికం జన బాహుళ్యాన్ని దేవుడికి దూరంగా వుంచేసింది. వారు గుళ్లకు వెళ్ల కూడదు. ఇళ్లలోనూ విగ్రహాలు పెట్టుకోకూడదని శాసించింది. కాని తాము చెప్పే ఆచారాలను వారెందుకు పాటించాలి? ఈ ప్రశ్నను బౌద్ధం పటాపంచలు చేసింది. అన్ని తరగతుల వారూ, ఆఖరుకు మహిళలు కూడా చేరే వీలు కల్పించింది. ఇలా వైదికం వదిలి బౌద్ధం వైపు పరుగులు తీయడం పురోహితవర్గానికి ఆందోళన కలిగించింది. అందులోంచి పుట్టిందే భక్తి ఉద్యమం. బ్రాహ్మణుల పాత్రలేకుండా దేవుడిని పూజించడానికి వీల్లేదన్న అది వరకటి నిబంధనలు సడలించారు. దేవాలయాల నిర్మాణం ప్రారంభించారు. అప్పటికి ఆర్యులు నిలదొక్కుకున్నారు. అనార్యదేవుడైన శివుడు, వేదాలలోని బ్రహ్మ, ఇంద్రుడు వెనక్కు పోతున్నారు. వేదాలలో ఇంద్రుడు అతి గొప్ప దేవుడు. ఇప్పుడు ఉపేంద్రుడు అంటే విష్ణువు ప్రధాన దేవుడవుతున్నాడు. తన అవతారమే కృష్ణుడు. భగవంతుడైన ఆయన కథే భాగవతం. అంటే కృష్ణలీలలు. ఈ భగవంతుడు చెప్పిన గీతమే భగవద్గీత. వేదకాలంనాటి గీతలు మార్చిన కొత్త గీతం.

అయితే ఈ గీత గురించి భారతీయ సమాజంలో అనేక భ్రమలున్నాయి. భాష్యాలున్నాయి. అపోహలు కూడా వున్నాయి. స్వాతంత్ర్య పోరాట కాలంలో తిలక్, గాంధీ వంటి వారు గీతను మార్గదర్శకంగా భావించారు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సుందరయ్య కూడా గీతలో నీ కర్తవ్యం నీవు నిర్వర్తించు అని చెప్పిన మాట విద్యార్థిదశలో తనను ప్రభావితం చేసిందని ఆత్మకథలో రాసుకున్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా వుండగా అవినీతి కుంభకోణాలు బహిర్గతమైనప్పుడు నా ధర్మం నేను నెరవేర్చానని అన్నారు.

కర్మన్యే వాధికారస్తే మాఫలేసు కథాచణ.. నీ ధర్మం నీవు నిర్వర్తించు ఫలితం గురించి ఆలోచించకు అన్నది గీతా సారంగా చాలా మంది చెబుతుంటారు. నిస్పృహలో కూరుకు పోయినప్పుడు కర్తవ్యంవైపు నడిపేదిగా గీతోపదేశాన్ని పరిగణిస్తుంటారు. చాతుర్వర్ణం మయా సృష్టం గుణకర్మ విభాగశ: అని అందులో కృష్ణుడు చెప్పిన దాన్ని సామాజిక న్యాయం కోరేవారు ఎత్తిచూపుతుంటారు. గుణాన్ని బట్టి కర్మ అనే రెండోభాగాన్ని చూపిస్తూ పుట్టుకను బట్టి గాక గుణాన్ని బట్టి కులం అని కృష్ణుడు చెప్పాడని సనాతనవాదులు చెబుతుంటారు. ఈ మధ్య ప్రొఫెసర్ కంచ ఐలయ్య అయితే యాదవుడైన కృష్ణుడు చెప్పిన గీతను తర్వాత బ్రాహ్మణీయ శక్తులు తిరగరాశాయని కొత్త వింత వాదన తీసుకొచ్చారు. కాని అది వూహామాత్రమే. ఎవరు రాసినా మార్చినా తరతరాల గీతను ఎలా అర్థం చేసుకోవాలి?

**విరుద్ధ బోధనలు– విశ్వరూపం**

అప్పటికాలానికే గాక ఇప్పటికి కూడా ప్రజల మనసులను కల్లోలితం చేసే నైతిక, సామాజిక సమస్యలపై ఆశువుగా చేసిన సుదీర్ఘ ప్రసంగం లాటిది భగవద్గీత. అందులో చెప్పిన కర్తవ్యమేమిటి? దానికి ప్రాతిపదిక ఏమిటి? అర్జునుడిని యుద్ధానికి పురికొల్పడానికి దానికి సంబంధమేమిటి? ఈ ప్రశ్నలకు ఒకే సమా

“ సామాజిక విభజనను తీసుకొచ్చి క్షత్రియుడుగా అర్జునుడు యుద్ధరంగం నుంచి పారిపోవడం అవమానమని మొదట బోధిస్తాడు. గెలిస్తే రాజ్యం ఓడిపోతే వీరస్వర్గం నీ స్వంతమవుతాయని ఆశపెడతాడు. అయినా అర్జునుడు అంగీకరించడు. గురువులను పెద్దలను చంపి రాజ్యం తెచ్చుకోవడం కంటే బిచ్చమెత్తుకోవడం మంచిదంటాడు. ”

ధానం వర్ణ వ్యవస్థ, రాజ్యాన్ని వ్యవస్థనూ సంరక్షించడం. అదే ఏకైక కర్తవ్యం. ఇంద్రుడు తప్ప వేరే దేవుడి ప్రస్తావన లేని వేదకాలపు నమ్మకాలు పక్కనపెట్టి, తనే దేవుడని చెప్పు కుంటున్న విష్ణు అంశ కృష్ణుడు చెప్పే నీతులు పాటించడమే కర్తవ్యం. కృష్ణుడు తానే మూర్తీభవించిన వేదసారం అంటూ మొదలుపెడతాడు. అయితే అదే సమయంలో అందమైన భాషతో వశపర్చుకునే వేదాలలో కొట్టుకుపోవద్దని, ఆ బోధనలను పక్కనపెట్టాలని అర్జునుడికి చెబుతాడు. వేదాలలోని నీతికి కట్టుబడి వుండటం మూర్ఖత్వమని స్పష్టం చేస్తాడు. అయినా అర్జునుడు విచారం నుంచి బయటపడక పోవడంతో వర్ణధర్మాలు తీసుకొస్తాడు. అతని మనసు మార్చడం కోసం ఆత్మకు చావులేదనీ వారెవరూ నిజంగా అంతం కారని కృష్ణుడు కొత్త బోధ చేస్తాడు. పాత వస్త్రాల స్థానంలో కొత్తవి వేసుకున్నట్టే ఆత్మ ఒక శరీరంలోంచి మరో శరీరంలోకి వస్తుందంటాడు. ఈ వాదనా పనిచేయదు. సామాజిక విభజనను తీసుకొచ్చి క్షత్రియుడుగా అర్జునుడు యుద్ధరంగం నుంచి పారిపోవడం అవమానమని మొదట బోధిస్తాడు. గెలిస్తే రాజ్యం ఓడిపోతే వీరస్వర్గం నీ స్వంతమవుతాయని ఆశపెడతాడు. అయినా అర్జునుడు అంగీకరించడు. గురువులను పెద్దలను చంపి రాజ్యం తెచ్చుకోవడం కంటే బిచ్చమెత్తుకోవడం మంచిదంటాడు. అప్పుడు కృష్ణుడు ఫలితం ఆశించకుండా పనిచేసే నిష్కామకర్మ గురించి చెబుతాడు. కర్మ నుంచి ఎవరూ తప్పించుకోలేరు. వాటిని నిర్వహించడం వల్ల వారికి పాపపుణ్యాలు అంటవని భరోసా ఇస్తాడు. ఎవరి పని వారు చేయకపోతే ప్రపంచమే వుండదంటాడు. పైగా అవన్నీచేసేది, చేయించేది తానేనని నమ్మకంగా చెబుతాడు. ఇలా ఎన్నిచెప్పినా అర్జునుడిలో మార్పు రాకపోవడంతో సహనం నశించిన కృష్ణుడు విశ్వరూపం అనేపేరిట అతన్ని భయపెట్టే భీకర రూపం ప్రదర్శిస్తాడు. (తెలుగు సినిమాల్లో చివరన ఎన్టీఆర్ చూపే మనోహరమైన విష్ణు స్వరూపం కాదని గుర్తించాలి)అనేక ముఖాలు ఉదరాలు చేతులు కాళ్లు భయంకరమైన కోరలు నోట్లోంచి మంటలు పదిలక్షల సూర్యుల కాంతి, దేవతలు రాక్షసులు మానవులు ఆయనలోకి దూకి మరణజ్వాలల్లో కాలిపోవడం, ఒకటేమిటి- వూహించలేనంత భయానకంగా, జుగుప్సగా అదే సమయంలో ప్రశాంతంగా గోచరించాడు. భయకంపితుడైన అర్జునుడు ఆ రూపం ఉపసంహరించవలసిందిగా ప్రార్థించాడు. కృష్ణుడు చెప్పినట్టు చేసేందుకు సిద్ధమైనాడు.

తాత్విక గ్రంథంగా చెప్పే గీతలో లెక్కలేనన్ని వైరుధ్యాలుంటాయి. కృష్ణుడు వేదాలను పాటించ నవసరం లేదంటాడు, తనే వేదం అంటాడు. కర్మయోగం గొప్పదంటాడు, ఏ పని చేయకుండానే యోగసిద్ధి పొందవచ్చునంటాడు. యుద్ధం గెలిస్తే రాజ్యం వస్తుందంటాడు, కాని ప్రతిఫలం ఆశించకుండా పనిచేయమంటాడు. ఈ వైరుధ్యాలను అర్జునుడే ఎత్తిచూపినప్పుడు పొంతనలేని సమాధానాలిస్తాడు. దీనంతటికీ కారణం ఒక్కటే-పాత సమాజ నీతులలో పెరిగిన అర్జునుణ్ని మారుతున్న కాలానికి, రాజ్యం అవసరాలకు అనుగుణంగా యుద్ధంలో దింపాలి. కాని దానికి తాత్వికమైన తొడుగు కావాలి. అందుకే రకరకాల అంశాలు పరస్పర విరుద్ధమైనవి కూడా కలబోసి గందరగోళ పర్చాడు. ఆ పైన విశ్వరూపం చూపి లోబర్చుకున్నాడు. ఇప్పటికీ దైనందిన జీవితంలో కొందరు ఏదేదో చెప్పేస్తారు, వినకపోతే బెదిరించి లొంగదీసుకుంటారు. ఇక్కడ వర్గ నీతి కూడా వుంది. ఫలితం ఆశించకుండా పనిచేయాలన్నది కిందివర్గాల కోసం.రాజ్యం వస్తుందనే ఆశ పై వారి కోసం!

**కులమే ధర్మం**

ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా వున్న కుల ప్రస్తావన చూద్దాం.

న కాంక్షే విజయం కృష్ణా- న చ రాజ్యం సుఖాని చ!

కిం నో రాజ్యేన గోవింద- కిం భోగైర్జీవితేన వా!! **(1-32వ శ్లోకం)**

(కృష్ణా! నాకు విజయము గాని రాజ్యము గాని సుఖములు గాని అక్కరలేదు. ఈ రాజ్యము వల్ల సుఖాల వల్ల భోగాల వల్ల జీవితం వల్ల ప్రయోజనం ఏమిటి)

క్లైబ్యం మాస్మ గమః పార్థ-నైతత్త్వయ్యుపపద్యతే!

క్షుద్రం హృదయ దౌర్బల్యం- త్యక్త్వోత్తిష్ఠ పరంతప!**(2-3)**

(పార్థా! పురుషత్వం కోల్పోవద్దు. నీ వంటి పురుషుడికిది ఉచితం కాదు. ఓ పరంతప, క్షుద్రమైన ఈ హృదయ దౌర్బల్యాన్ని విడనాడి యుద్ధానికి నడుం బిగించు)

ఈ ఆత్మ ఏ కాలమునందును పుట్టదు. గిట్టదు. పుట్టి వుండలేదు. ఇది అజన్మ. నిత్యము. శాశ్వతము, పురాతనము. శరీరము చంపబడినను ఇది చావదు**(2-20)**

స్వధర్మాన్ని బట్టి చూసినా నీవు సందేహించనక్కరలేదు. క్షత్రియునికి యుద్ధాన్ని మించిన నీతి దాయక కర్తవ్యం ఏదీ లేదు. ఓ పార్థా, ఇలాంటి యుద్ధం క్షత్రియులకు లభించడం అదృష్టం. ఇది స్వర్గానికి తెరిచిన ద్వారం. ఈ యుద్ధం నీకు ధర్మబద్ధం. ఒక వేళ నీవు దీనిని ఆచరించకపోతే స్వధర్మం నుంచి పారిపోయినవాడవవుతావు. దానివల్ల కీర్తిని కోల్పోతావు. పైగా పాపము చేసిన వాడవవుతావు **(2-31,32,33 శ్లోకాలు)**

ఇలా భోగభాగ్యాలు వస్తాయని చెప్పిన కృష్ణుడే మళ్లీ 44వ శ్లోకానికి వచ్చేసరికి వివేకహీనులు మాత్రమే భోగభాగ్యాలలో తలమునకలవుతుంటారని విమర్శిస్తాడు. అంతేగాక 45వ శ్లోకంలో అసలు వేదాలు ప్రతిపాదించే త్రిగుణాలకు అతీతుడవు కమ్మంటాడు. బుద్ధియుక్తులైన జ్ఞానులు కర్మఫలాలను పరిత్యజించి జనన బంధాల నుంచి విముక్తులవుతారనీ, కష్టాల నుంచి విముక్తి పొందుతారని 51వ శ్లోకంలో వివరిస్తాడు. దేనిమీద ఆసక్తి లేనివాడే స్థిత ప్రజ్ఞుడనీ, తాబేలు తన అవయవాలను లోపలికి ముడుచుకున్నట్టు ఇంద్రియాదుల నుంచి, విషయాల నుంచి ఉపసంహరించుకుంటేనే బుద్ధి స్థిరంగా వుంటుందని 57,58 శ్లోకాలలో బోధిస్తాడు. మరి జ్ఞానమే అంత శ్రేష్టమైనదైతే నన్నెందుకు భయంకరమైన యుద్ధంలోకి దింపుతున్నావని అడుగుతాడు అర్జునుడు. ఈ కలగాపులగపు మాటలతో బుద్ధి భ్రమకు లోనుచేస్తున్నావని కూడా సూటిగానే చెబుతాడు. అప్పుడు కృష్ణుడు సాంఖ్యులకు జ్ఞానయోగం ద్వారా, యోగులకు కర్మయోగం

ద్వారా పరమపదం ప్రాప్తిస్తుందని కొత్త సూత్రం చెబుతాడు. ఇదంతా మూడవ అధ్యాయంలో వస్తుంది. కర్మ చేయకుండా వుండటం అసంభవమని అంటూనే ఆత్మతోనే తృప్తిపొందేవాడు నిత్య సంతుష్టుడని అలాంటి వాడికి ఏ కర్తవ్యమూ వుండదని మరో మాట చెబుతాడు. (17,18శ్లోకాలు) అసలు తనకు ఏ కర్తవ్యమూ వుండదని, అన్నీ పొందినప్పటికీ కర్తవ్యం చేస్తూనే వున్నానని, లేకపోతే లోకాలు నాశనమై పోతాయని చెబుతాడు(22,23 శ్లోకాలు) మూడవ అధ్యాయంలోని ఈ భాగాన్నే తదుపరి కొనసాగిస్తూ సృష్టి రహస్యమంతా తనలోనే వుందని ప్రకటిస్తాడు.

"తర్వాత అయిదో అధ్యాయానికి వచ్చే సరికి అర్జునుడు నీవు ఒకసారి కర్మ మంచిదనీ, మరోసారి అకర్మ మంచిదని చెబుతున్నావేమని సందేహం వెలిబుచ్చుతాడు. కర్మ సన్యాసం కంటే కర్మ యోగం, అంటే ఆచరించడం శ్రేష్టమైనదంటూ తద్వారా కులాల వారీ కర్మలు చేయడం మంచిదని చెప్పేస్తాడు."



ఇలా పరస్పర విరుద్ధంగా చెబుతున్న కృష్ణుడిని అర్జునుడు నీవు నిన్నమొన్న పుట్టిన వాడివి కదా. అంతా నేనేనని ఎలా చెబుతున్నావని నిలదీస్తాడు. అప్పుడు కృష్ణుడు దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించేందుకు ప్రతి యుగంలో తను అవతరిస్తుంటానంటూ సంభవామి యుగేయుగే శ్లోకం(4-8) చెబుతాడు. కర్మల వల్ల ఫలాలు కోరుకునేవారు తనను ఆరాధిస్తారంటాడు. కర్మలు ఎలా చేయాలంటే-

గుణాన్ని బట్టి కులం కాదు, పుట్టుకతోనే..

చాతుర్వర్ణ్యం మయాసృష్టం- గుణకర్మ విభాగశ: తస్యకర్తారమపి మా విద్యకర్తార మవ్యయం **(4-13)**

ఇందులో రెండో సగాన్ని తీసుకుని గుణ కర్మలను బట్టి తప్ప పుట్టుకతో కులాలు వస్తాయని కృష్ణుడు చెప్పలేదని వాదిస్తుంటారు. ఈ మధ్య పరిపూర్ణానంద స్వామి ప్రత్యేకంగా ఇదే చెబుతున్నారు. కాని అర్జునుడు మనస్తత్వాన్ని బట్టి యుద్ధం చేయలేనంటూ వుంటే క్షత్రియుడవు గనక తప్పక చేయాలని చెప్పడం కులధర్మమే. అసలు కర్మ అంటే ఏమిటో, అకర్మ అంటే ఏమిటో మహాపండితులకు కూడా తెలియడం లేదని ఆయనే చెబుతాడు. తర్వాత అయిదో అధ్యాయానికి వచ్చే సరికి అర్జునుడు నీవు ఒకసారి కర్మ మంచిదనీ, మరోసారి అకర్మ మంచిదని చెబుతున్నావేమని సందేహం వెలిబుచ్చుతాడు. కర్మ సన్యాసం కంటే కర్మ యోగం, అంటే ఆచరించడం శ్రేష్టమైనదంటూ తద్వారా కులాల వారీ కర్మలు చేయడం మంచిదని చెప్పేస్తాడు. ఫలితాన్ని ఆశించకుండా కర్మలు చేయాలంటాడు. అక్కడి నుంచి తదుపరి మూడు అధ్యాయాలలోనూ తనే భగవంతుడినని తనపైన మనసు లగ్నం చేస్తే ముక్తి వస్తుందని అంటాడు. ఇతర దేవతలను కూడా పూజించే వారు తనను పూజిస్తే ఫలితం దక్కదంటాడు. తనను పూజించేవారు దుర్మార్గులైనా సత్పురుషుడే అవుతాడని చెబుతాడు(9-30) అంతకన్నా విపరీతం ఏమంటే కులాలలో పై కులాల వారు పుణ్యాత్ములనీ కింది కులాల వారు పాపులని సూటిగా చెప్పేస్తాడు

మాం హి పార్థ! వపాశ్రిత్య- యే పి స్యు: పాపయోనయ!

స్త్రియా వైశ్యాస్థథా శూద్రా:- తేపి యాంతి పరాం గతిమ్ **(9-32)**

(పార్థా: స్త్రీలు, వైశ్యులు, శూద్రులు, అట్లే పాప జన్మ కలవారు కూడా నా శరణుపొంది నన్ను చేరతారు)

కింపునర్బ్రాహ్మణా: పుణ్యా - భక్తా రాజర్షయస్థథా

అనిత్యమసుఖం లోకం- ఇమం ప్రాప్య భజస్వ మామ్ **(9-33)**

ఇక పుణ్యాత్ములైన బ్రాహ్మణులు, రాజులు నన్ను శరణుపొందితే వారు పరమపదాన్ని చేరతారని చెప్పవలసిన పనిలేదు. ఈ మానవ శరీరం క్షణ భంగురం. దు:ఖ భాజనం. కనుక నిరంతరం నన్నే భజించు.

ఇలా 9,10 అధ్యాయాలలో తన గొప్పతనాన్ని, అయోమయ వేదాంతాన్ని అదేపనిగా చెప్పిన కృష్ణుడు 11వ అద్యాయంలో భయంకరమైన విశ్వరూపం చూపిస్తాడు. అర్జునుణ్ని భయకంపితుణ్ని చేసినా తన అనుగ్రహం వల్ల ఆ రూపం చూడగలిగాడని అంటాడు. అతని అభ్యర్థనపై మామూలు రూపానికి వచ్చేస్తాడు. తర్వాత ఆరు అధ్యాయాలలోనూ మళ్లీ తన విశ్వజనీనత, వివిధ లక్షణాల వివరణ నడుస్తుంది. కాని అసలు సందేశం మిగిలివుంది.

ఆఖరుదైన 18వ అధ్యాయంలో కుండ బద్దలు కొట్టినట్టు కుల ధర్మాలు మరింత సూటిగా, బండగా చెప్పేస్తాడు. గుణాలను బట్టి కర్మలు అనే నిర్వచనాన్ని వెనక్కు నెట్టి, సత్వ, తమో, రాజస గుణాలు ప్రకృతి సిద్దంగానే వస్తాయని, వాటి ప్రకారమే మనుష్యుల కర్మలు నిర్ణయించబడతాయని**(18-40 శ్లోకంలో)** చెప్పేస్తాడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల కర్మలు, అట్లే శూద్రుల కర్మలు వారి వారి ప్రకృతి సిద్ధ గుణాలను బట్టి విభజించబడి వున్నాయన్నాడు **(18-41శ్లోకం).**

నిశ్చలత, నిగ్రహం, సన్యాసం, శుచిత్వం,సహనం, పారదర్శకత, జ్ఞానం, దేవుడిపై విశ్వాసం ఇవి బ్రాహ్మణుల స్వాభావిక కర్మలు **(శ్లోకం 42).** శౌర్యం, తేజస్సు, ధైర్యం, దక్షత, యుద్ధం నుంచి పారిపోకపోవడం, దానం, ఈశ్వరభావం, తదితరమైనవి క్షత్రియుల స్వాభావిక కర్మలు**(శ్లోకం 43).** వ్యవసాయం, పశుపోషణ, వాణిజ్యం, ఇవన్నీ వైశ్యుల

స్వాభావిక కర్మలు. పరిచర్య(శారీరక శ్రమ) శూద్రుల స్వాభావిక కర్మ(**శ్లోకం44**). ఇలా నిర్దేశించిన తమ తమ స్వాభావిక కర్మలలో తత్పరులైన వారు దేవుడైన తనమీద మనసు లగ్నం చేయడం ద్వారా ఉత్తమ గతి పొందుతారని హామీనిస్తాడు కృష్ణుడు. క్షత్రియుడుగా స్వభావ కర్మ కారణంగా యుద్ధం చేసి తీరాలని శాసిస్తాడు(**శ్లోకం60**). సర్వధర్మాలను పరిత్యజించి తన శరణు వేడితే అన్ని పాపాల నుంచి విముక్తున్ని చేస్తానంటాడు(**శ్లోకం 66**)

**ఇదంతా విన్న తర్వాత అర్జునుడు తన మోహం తొలగిపోయిందంటాడు.**

కనుక భగవద్గీతను వివరంగా పరిశీలిస్తే అందులోచెప్పింది రాజ్యరక్షణ కోసం గీసిన కులగీతలేనని తేలిపోతుంది. అవి స్వభావాన్ని బట్టి నిర్ణయించబడవు, ప్రకృతి సిద్ధంగానే అంటే పుట్టుకతోనే జరిగిపోతాయి. అప్పటికి నాలుగు వర్ణాలే వుండగా తర్వాత పంచములంటూ అయిదో తరగతిని సృష్టించి, అతి దారుణంగా చాకిరీ చేయించుకోవడమే గాక మనుషులుగా కూడా చూడ లేదు. ఈ వివక్ష ఇప్పటికీ అనేక రూపాల్లో కొనసాగుతూనే వుంది.

భగవద్గీతలో శ్లోకాలను ఘంటసాల గానంలో విని ఆనందించవచ్చుగాని వాటికి స్వాములు సన్యాసులు చెప్పే కపట వ్యాఖ్యానాల బుట్టలో పడకూడదు. గీతను, కృష్ణున్ని దూషించడం కంటే అందులో సామాజిక సత్యాలను అన్వేషిం చడం, కులాల మూలాలను బహిర్గతం చేయడం కీలకం. కృష్ణుడు అర్జునుణ్ని సమ్మోహన పరిచి, భయపెట్టి, లోబర్చుకుని వుండొచ్చు. కాని అదే మోహంలో ఇప్పటికీ కొట్టుకుపోవడం అర్థ రహితం. మోడీ ప్రభుత్వం వచ్చాక భగవద్గీతను జాతీయ గ్రంథంగా చేయాలని విదేశాంగ మంత్రి ప్రతిపాదించడం, ఆయన విదేశీ పర్య టనలలో దాన్ని తీసుకుపోయి తన కానుకగా ఇవ్వడం కూడా లౌకికతత్వంతో పొసిగేవి కావు. భగవద్గీతను అర్థం చేసుకోవడానికి ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన యోధుడు సారథి చాలా ఉపయోగపడుతుంది. అందులో శ్లోకాలకు అచ్చతెనుగులో వాస్తవికార్థాలు వున్నాయి. ఇవి ఆధ్యాత్మికత పేరుతో ఇష్టానుసారం చేసిన భాష్యాలకు పూర్తి భిన్నంగా వుండటం చూస్తాం. ఇందులో గీతలోని విషయాన్ని తప్ప కాల నిర్ణయం, సమాజ పరిణామం వంటి అంశాల లోతుల్లోకి వెళ్లలేదు. డిడి కోశాంబి, దేవీ ప్రసాద్‌చటోపాధ్యాయ,రాంభట్ల కృష్ణమూర్తి, నంబూద్రిపాద్ వంటివారి రచనలు చదివితే ఆ విధమైన స్పష్టత వస్తుంది. ❋

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!
**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# సామాజిక న్యాయం - కమ్యూనిస్టు దృక్పథం

(11వ పేజీ తరువాయి)

కుల నిర్మూలన దిశలో తోడ్పడా లని కోరుకుంటారు. అస్తిత్వం అన్నా, ఐడెంటిటీ అన్నా అవి ప్రగతి నిరోధక అంశాలే. కులాలు బలపడటానికి, కుల పోరాటానికి తోడ్పడే అంశాలే. పోరాటం సాగవల్సింది కొన్ని కులాల మీద కాదు. కులవివక్ష మీద, ఆధిపత్యం మీద పోరాటంగా సాగాలి. అస్తిత్వ భావాలు, పోరా టాలు యాదృచ్ఛికంగా వచ్చినవి కాదు. భారతదేశంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి తీరులోనే ఈ అస్తిత్వ ఉద్యమాలకు పునాది ఉన్నది. ఈ నేపథ్యాన్ని కూడా అర్థం చేసుకోవాలి. తరతరాలుగా వ్యాపారం, పరిపాలన కొన్ని కులాలకు కేటాయించబడిన సమాజం ఇది. పెట్టుబడిదారులు, భూస్వాములు కొన్ని ప్రత్యేక కులాలనుండే ఎక్కువమంది ఎదగడానికి ఈ పరిస్థితి దారితీసింది. ఉత్పత్తిలో భాగస్వాములు కానివారే భూస్వాములుగానూ, పారిశ్రామిక వేత్తలుగానూ ఎదిగారు. దళిత, గిరిజన, వెనకబడిన తరగతులకు చెందిన అత్యధికులు శ్రామికులుగానే మిగిలారు. స్వాతంత్ర్యానంతరం వచ్చిన నూతన అవకాశాలను (రిజర్వేషన్లు, పథకాలు) వినియోగించుకుని ఈ తరగతులలో నుంచి కూడా కొంతమంది కొంతమేరకు ఎదిగారు. ఈ నేపథ్యంలోనే సమాన వాటా, గుర్తింపు, ఆత్మగౌరవము వంటి నినాదాలు ముందుకొచ్చాయి. ఈ పరిణామక్రమాన్ని సక్రమంగా అర్థం చేసుకోవాలి. ప్రజాతంత్ర నినాదాలకు, ప్రగతి నిరోధక అస్తిత్వ అంశాలకు మధ్య ఉన్న విభజన రేఖను, వైరుధ్యాన్ని అర్థం చేసుకోవడమే కమ్యూనిస్టుల ప్రత్యేకత. భావోద్వేగాలకు లోనుకాకుండా పథకం ప్రకారం బడుగుల విముక్తి కోసం కృషి చేయడమే కమ్యూనిస్టుల ప్రత్యేకత.

**శూద్రులకు ఆస్తీ, చదువు నిషేధం**

వృత్తుల అభివృద్ధి క్రమంలో నిచ్చెనమెట్ల కులవ్యవస్థను సిద్ధాంతంగా మలిచి ప్రజల మీద రుద్దింది మనువాదం. దళితులకు, శూద్రులకు ఆస్తిని, చదువును నిషేధించింది. ఫలితంగా వీరిలో అత్యధికులు శ్రామికులుగానే మిగిలి పోవడమే కాక చదువులకు దూరంగా నెట్టి వేయబడ్డారు. పూలే, అంబేద్కర్ వంటి సామా జిక ఉద్యమకారుల కృషి గానీ, బ్రిటిష్ పాలనలో చోటుచేసుకున్న సంస్కరణలుగానీ ఈ పరిస్థితిలో కొంచెం మార్పుకు దారి తీశాయి. స్వాతంత్ర్యా నంతరం ఈ మార్పు మరింత వేగం పుంజు కున్నప్పటికీ చదువుకునే అవకాశాలు పెరిగినా ఆస్తి మాత్రం కొందరిదిగానే ఉంటున్నది. అది భూస్వాముల, పెట్టుబడిదారుల స్వంతంగానే ఉంటున్నది. తమ గుప్పిట్లోని ఆస్తిని కాపాడుకు నేందుకే పెట్టుబడిదారీ వర్గం కులాన్ని వాడు కుంటున్నది. ఈ భూమి, ఈ పరిశ్రమలు అందరి వీ కావాలి. వీటిమీద అందరికీ హక్కు రావాలి. ఇది కొద్దిమంది చేతుల్లో ఉండటానికి వీల్లేదు. అందరికీ అన్ని అవకాశాలూ అందుబాటులో ఉండాలి. దానికోసం పోరాడాలి.

**భావోద్వేగాలు ఎవరికోసం....?**

సంచలనాలు, భావోద్వేగాలు పాలకులకూ, పాలకవర్గాలకే ఉపయోగపడతాయి. కులాల మధ్య, మతాల మధ్య జరిగే ఘర్షణలు వారికే తోడ్పడతాయి. అందుకే సామాజిక న్యాయం కోసం చేసే ప్రతి పనీ కులవివక్షకు వ్యతిరేకంగా, మిత్రులను కూడగట్టేదిగా ఉండాలి. కులాన్ని బలహీనపర్చేందుకూ, అంతిమంగా కుల నిర్మూలనకు తోడ్పడేదిగా ఉండాలి. అందుకు భిన్నంగా కులాలు బలపడితే, మరింత సంఘటి తపడితే పాలకవర్గాల పాచికలు పారినట్టే. ఈ సున్నితమైన విభజన రేఖను అర్థం చేసుకో వడంలో విఫలమైతే మనకు తెలియకుండానే పాలకవర్గాలకు ఉపయోగపడతాం. వారి ఉచ్చులో చిక్కుకుంటాం. అందుకే మనం చేసే ప్రతి పనీ శ్రామికుల ఐక్యతకూ, ఆధిపత్యం మీద పోరాటానికీ, కుల నిర్మూలనకూ ఉపయోగపడాలి. ❋

**ఈ వారం ప్రత్యేకం**

# వర్గ పోరాటం అదనపు విలువ పంపిణి

**ఎ. కోటిరెడ్డి**



రచయిత ప్రజాశక్తి సహాయ సంపాదకులు

కార్మికులు, వ్యవసాయ కార్మికుల వేతనాలు పెరగాలని, రైతాంగానికి గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, ఇతర పీడిత ప్రజల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కాలని కమ్యూనిస్టులు ఆందోళనలు చేసే సందర్భాలలో ఈ ఆందోళనల వలన దేశ ఆర్థికాభివృద్ధి దెబ్బతింటుందని, దేశంలోకి పెట్టుబడులు రావని, పెట్టుబడులు రాకపోతే ఉద్యోగాలు రావని, కాబట్టి కమ్యూనిస్టులు, కార్మికసంఘాలు చేసే ఆందోళనలు దేశవ్యతిరేకమైనవని బూర్జువావర్గ మేధావులు నిరంతరం ప్రచారం చేస్తుంటారు. పెరిగిన ధరలను తగ్గించాలని, పేదలు, వృద్ధులు, జీవనాధారం లేని పీడిత ప్రజల సమస్యలపై కమ్యూనిస్టులు ఆందోళనలు చేస్తుంటారని, వీరి ఆందోళనల వలన ప్రయోజనం ఏమీ ఉండదని, పోరాటాలంటూ వీరు వీధుల్లోకి వస్తే ధరలు తగ్గుతాయా అని ప్రచారం చేస్తుంటారు. కమ్యూనిస్టులంటే గిట్టనివారు ఈ ప్రచారాన్ని భుజాన వేసుకుని మోస్తూ, సాధారణ ప్రజలను తప్పుదారి పట్టిస్తుంటారు. కమ్యూనిస్టులను గురించి అంతగా పట్టించుకోనివారు, కమ్యూనిస్టుల పట్ల సానుభూతి ఉండేవారిలో కొందరు కూడా ఇటువంటి ప్రచార ప్రభావంలో కొట్టుకుపోతుంటారు. పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల దోపిడీని గురించి అవగాహన లేనివారికి ' వారు చెబుతున్నది నిజమేనేమో' అనిపించేంత విస్తృతంగా ఈ ప్రచారం జరుగుతుంటుంది. సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత దోపిడీకి గురవుతున్న వర్గాల పోరాటాలు తాత్కాలికంగా వెనుకపట్టు పట్టినప్పటికీ ఈ ప్రచారం జరుగుతూనే ఉన్నది. శ్రామికప్రజలను పోరాటాల నుండి దూరం చేయటానికి, తద్వారా తమ దోపిడీని యధేచ్ఛగా కొనసాగించుకోవటానికి నిరంతరం ఇటువంటి ప్రచారం చేస్తూ, దోపిడీకి గురవుతున్న వర్గాల ప్రజలను పోరుబాట నుండి మరలించటం ద్వారా తమ ప్రయోజనాలను నెరవేర్చుకోవటానికి దోపిడీ వర్గాలు ప్రయత్నం చేస్తుంటాయి. పీడితప్రజలను పోరాటాలకు సన్నద్ధం చేసే కమ్యూనిస్టులపై నిరంతరం దుష్ప్రచారం చేస్తుంటారు. ఈ ప్రచారాన్ని నమ్మి మోసపోతే, దోపిడీపై పోరాటాలను సడలిస్తే శ్రామికప్రజల ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. శ్రామికప్రజలు తమ ప్రయోజనాల సాధన కోసం దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటాలు చేస్తుంటేనే దోపిడీకి కొంతమేరకు అడ్డుకట్ట వేయగలుగుతారు.

**వర్గపోరాటమే మార్పుకు చోదకశక్తి**

సమాజంలోని వివిధ వర్గాలు తమ ప్రయోజనాల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తుంటాయి. దోపిడీకి గురవుతున్న వర్గాలు, దోపిడీ చేస్తున్న వర్గాలు కొన్ని సందర్భాలలో బహిరంగంగా, ప్రజలందరికీ అర్థం అయ్యేలా, బాహాబాహీగా పోరాటంలో నిమగ్నం అవుతాయి. కొన్ని సందర్భాలలో పైకి కనిపించకుండా, అంతర్గతంగా ఈ పోరాటం జరుగుతుంటుంది. బహిరంగంగా జరిగినా, అంతర్గతంగా జరిగినా దోపిడీ చేస్తున్న వర్గాలు, దోపిడీకి గురవుతున్న వర్గాల మధ్య వర్గ పోరాటం నిరంతరం జరుగుతూనే ఉంటుంది. వర్గపోరాటాన్ని గురించి కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్, ఎంగెల్స్‌లు ఈ విధంగా చెప్పారు. "ఇప్పటి వరకు నడిచిన చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే. పురాతన కాలపు స్వతంత్ర పౌరుడు, బానిస( రోమన్ కాలపు) పాలక వర్గీయుడూ, సామాన్యుడు -ఫ్యూడల్ యుగపు భూస్వామ్య ప్రభువూ, దాసుడు- (మధ్యయుగాల నాటి) వృత్తిసంఘం సభ్యుడు, వృత్తిసంఘ కార్మికుడు, ఒక్కమాటలో చెప్పాలంటే పీడకుడు, పీడితుడూ ఎల్లప్పుడూ పరస్పరం శత్రువులుగా నిలబడి, ఒకప్పుడు బాహాటంగానూ, మరొకప్పుడు ప్రచ్ఛన్నంగానూ నిరంతరం పోరాటం చేస్తూ వచ్చారు." సమాజంలో దోపిడీదారులు, దోపిడీకి గురవుతున్న వారి మధ్య నిరంతరం వర్గ పోరాటం జరుగుతుంటుందని, తమ వర్గ ప్రయోజనాలను సాధించుకోవటం కోసం వివిధ వర్గాలు నిరంతరం పోరాటాలు చేస్తుంటాయని, దోపిడీ జరుగుతున్న సమాజంలో వర్గ పోరాటాన్ని ఆపటం సాధ్యం కాదని పైన పేర్కొన్న వాక్యాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆదిమ కమ్యూనిస్టు సమాజం మినహా మిగతా సమాజాల చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే. ఆదిమ కమ్యూనిస్టు సమాజంలో వర్గ విభజన లేదు. శ్రమ చేయటంలోనూ, శ్రమ ఫలితాన్ని అనుభవించటంలోనూ సమాజంలోని వ్యక్తుల మధ్య ఎటువంటి వ్యత్యాసం లేదు. ప్రతి ఒక్కరూ తమశక్తి కొద్దీ పనిచేసేవారు. తమశ్రమ ద్వారా సంపాదించుకున్న ఆహారాన్ని తమ అవసరం మేరకు అందరూ అనుభవించే వారు. సమాజాభివృద్ధి క్రమంలో మానవుల శ్రమ ఉత్పాదకత పెరగటం వలన సమాజంలో వర్గాలు ఏర్పడ్డాయి. దోపిడీ వర్గాలు, దోపిడీకి గురవుతున్న వర్గాలుగా సమాజంలో వర్గ విభజన జరిగింది. తమవర్గ ప్రయోజనాలను సాధించుకోవటం కోసం వర్గ సమాజంలో ఉనికిలో ఉన్న ప్రతివర్గం నిరంతరం ప్రయత్నం చేస్తుంటుంది. ఆయా వర్గాలు తమ వర్గ ప్రయోజనాలను సాధించుకోవటం కోసం చేసే ప్రయత్నాలు వర్గ పోరాటాలకు దారితీస్తాయి. దీనిని కప్పిపెట్టటానికి, దోపిడీకి గురౌతున్న ప్రజలను మభ్యపెట్టటానికి దోపిడీ వర్గాలు నిరంతరం ప్రయత్నం చేస్తుంటాయి. ఆ క్రమంలోనే మూఢ నమ్మకాలు, దేవుడు, అతీతశక్తులు, విధి, స్వర్గనరకాలు తదితరాలను ప్రచారంలోకి తీసుకొచ్చారు. ఆదిమకాలంలో శాస్త్రీయ అవగాహన లేనందు వలన ఇవి ఏర్పడినా, శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెంది, ఇవన్నీ అవాస్తవాలని రుజువైన తర్వాత కూడా వీటిని మరింత ఎక్కువగా ప్రచారం చేయటంలో దోపిడీదారుల వర్గ ప్రయోజనాలు దాగున్నాయి.

**బానిసవ్యవస్థ**

బానిసలు, బానిస యజమానులుగా సమాజంలో మొదటి వర్గ విభజన జరిగింది. సమాజంలో అత్యంత కౄరమైన, బహిరంగ

> “ ఉత్పత్తిక్రమంలో కార్మికుడు తనశ్రమను వినియోగించి సరుకు లను ఉత్పత్తి చేస్తాడు. ఈ క్రమంలో పెట్టుబడి దారుడు తన శ్రమశక్తికి చెల్లించిన మొత్తం కన్నా కార్మికుడు ఎక్కువ విలువను ఉత్పత్తి చేస్తాడు. కార్మికుని శ్రమశక్తి విలువ, శ్రమచేసే క్రమంలో కార్మికుడు ఉత్పత్తికి జోడించే విలువ వేరుగా ఉంటాయి. ”

దోపిడీ విధానం బానిస వ్యవస్థలో అమలు జరిగింది. బానిస యజమానులు బానిసలను పశువుల వలెనే కట్టివేసి, నిర్బంధంగా పని చేయించుకునేవారు. బానిసలకు కడుపు నిండా తిండికూడా పెట్టేవారు కాదు. 24 గంటలలో నిద్రపోవటానికి కూడా తగిన సమయం ఇచ్చే వారు కాదు. పర్యవేక్షకులను నియమించి, నిము షం కూడా విరామం లేకుండా బానిసల చేత పనిచేయించేవారు. పనిలో ఎవరైనా అలసత్వం చూపితే గొడ్డును బాదినట్లు బాదేవారు. మరోవైపు బానిసలు కూడా తమపై జరుగుతున్న దోపిడీని తగ్గించుకోవటానికి రకరకాలుగా పోరాటాలు చేసేవారు. నిదానంగా పనిచేయటం, తయారు చేసే వస్తువులలో నాణ్యత లేకుండా చేయటం, వస్తువులను పనికిరాకుండా చేయటం తదితర విధాలుగా యజమానులను నష్టపెట్టటానికి పూనుకునేవారు. దోపిడీతో పూర్తిగా విసిగి పోయిన సందర్భాలలో పనిచేయకుండా మొరా యించేవారు. బానిసల చేత పనిచేయించు కోవటానికి అన్ని విధాలుగా ప్రయత్నం చేసిన యజమానులు వారిచేత ఇక పనిచేయించుకో వటం సాధ్యం కాదనుకున్నపుడు వారిని చంపేసేవారు. ఈ విధమైన దోపిడీతో విసిగిపో యిన బానిసలు తిరుగుబాట్లు చేశారు. బానిస లు, బానిస యజమానుల మధ్య భీకరమైన పోరాటాలు జరిగాయి. ఈ పోరాటాల ఫలితంగా బానిస వ్యవస్థ స్థానంలో ఫూడల్ వ్యవస్థ ఉ నికిలోకి వచ్చింది.

### ఫ్యూడల్‌వ్యవస్థలో దోపిడి

ఫ్యూడల్‌వ్యవస్థలో భూయజమానులు, భూదాసులు ప్రధాన వర్గాలుగా ఉన్నారు. భూస్వాములు భూదాసులను దోపిడీచేశారు. భూమి అంతా రాజులు, సంస్థానాధీశులు, అధి కారులు, భూస్వాముల చేతుల్లో ఉండేది. రైతు స్వంతంగా సాగుచేసుకోవటానికి కొద్దిభూమిని మాత్రం కేటాయించి, తమ యాజమాన్యంలోని మిగతా భూమిని రైతులతో ఉచితంగా సాగు చేయించుకునేవారు. తమభూమిలో పండిన పంట మొత్తాన్ని భూస్వాములు తీసుకునే వారు. రైతులకు ఇచ్చిన భూమిలో పండిన పంటలో కూడా కొంతభాగాన్ని తీసుకుని, రైతుకు తిండికి కూడా సరిపోనంత తక్కువ పంటను మాత్రమే వదిలేవారు. ఉత్పత్తిలో తమ భాగాన్ని పెంచుకో వటం కోసం రైతులు నిరంతరం పోరాటం చేస్తుండేవారు. మరోవైపు రాజులు, సామంతు లు, అధికారులు, భూస్వాములు రైతుల నుండి మరింత ఎక్కువ ఉత్తత్తిని కాజేయటానికి ప్రయత్నించేవారు. ఈ విధంగా భూస్వాములు, రైతుల మధ్య నిరంతరం పోరాటం జరుగుతుం డేది. ఈ దోపిడీ తీవ్రం కావటంతో రైతులు తిరుగుబాట్లు చేశారు. తిరుగుబాట్లను అణచి వేయటానికి రాజులు, సామంతులు, జమిం దారులు, భూస్వాములు అన్ని విధాలుగా ప్రయత్నం చేశారు. అయినా రైతుల పోరాటాలు పురోగమించాయి. ఈ పోరాటాల ఫలితంగా భూస్వామ్య వ్యవస్థ స్థానంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. బానిసవ్యవస్థలో కనిపించినంత స్పష్టంగా భూస్వామ్య వ్యవస్థలో దోపిడీ పైకి కనిపించేది కాదు. భూస్వాములకు ఉచితంగా పనిచేస్తున్నా రైతుకు కొంతభూమి ఉండటం, ఉత్పత్తిలో కొంతభాగం రైతుకు లభించటం, కుటుంబంతో కలిసి జీవించే అవకాశం ఉండటం తదితరాలు దోపిడీని కొంతమేరకు మరుగుపరిచాయి.

### పెట్టుబడిదారీ వ్యవస్థలో దోపిడీ జరిగేతీరు

పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారీ వర్గం కార్మికవర్గాన్ని దోపిడీ చేస్తుంది. ఉత్పత్తిలో భాగస్వాములుగా ఉన్న పెట్టుబడిదారులు, కార్మికులు ఎవరి వాటాను వారు పొందు తున్నట్లు, ఒకరిని మరొకరు దోపిడీ చేయటానికి అవకాశం లేనట్లు కనిపించే పెట్టుబడిదారీ వ్యవ స్థలో దోపిడీ ఎలా జరుగుతుంది? పెట్టుబడి దారుడు తనవద్ద ఉన్న పెట్టుబడితో ఫ్యాక్టరీని నిర్మించి, యంత్రాలను కొనుగోలు చేసి, ఉత్పత్తి చేయటం కోసం కార్మికులను పనిలో నియమిం చుకుంటాడు. కార్మికులు యంత్రాలను పని చేయించి, ముడి సరుకులను వినియోగించి, సరుకులను ఉత్పత్తి చేస్తారు. ఉత్పత్తి అయిన సరుకులను మార్కెట్లో విక్రయించిన పెట్టుబడి దారులు ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం కార్మికులకు వేతనాన్ని చెల్లిస్తారు. యంత్రాల వాడకం, ముడి సరుకుల ఖర్చు, కార్మికుల వేతనాలు చెల్లించిన తర్వాత మిగిలిన మొత్తం లాభంగా పెట్టుబడిదారుని ఖాతాలో జమ అవుతుంది. పెట్టుబడిదారులు లాభంగా మిగుల్చుకున్న మొత్తం వారికి ఎక్కడి నుండి వస్తుంది? కార్మికుల శ్రమను దోపిడీ చేయటం ద్వారానే పెట్టుబడిదారులకు లాభాలు వస్తున్నాయి.

పెట్టుబడిదారుడు కార్మికుని శ్రమశక్తికి ఏ విధంగా ధర నిర్ణయిస్తున్నాడు? ఉత్పత్తికి అయిన ఖర్చు ప్రాతిపదికగా సరుకుల ధరలు నిర్ణయించబడతాయి. ఇతర సరుకుల ధరలు నిర్ణయించిన విధంగానే సరుకుగా మారిన శ్రమశక్తి ధరను కూడా దాని ఉత్పత్తికి అయిన ఖర్చు ప్రాతిపదికగా నిర్ణయిస్తారు. ఆ రోజు పనిచేయటం వలన కోల్పోయిన శక్తిని తన శరీరం తిరిగి పొందటానికి, తన భార్యాపిల్లలను పోషించుకోవటానికి, విద్యా, వైద్యం తదితరాలకు అయ్యేఖర్చు కార్మికుని శ్రమశక్తి విలువ. ఆ మొత్తాన్ని చెల్లించి పెట్టుబడిదారుడు కార్మికుని శ్రమశక్తిని కొంటున్నాడు. తాను కొనుగోలు చేసిన కార్మికుని శ్రమశక్తిని పెట్టుబడిదారుడు తన ఫ్యాక్టరీలో సరుకులను ఉత్పత్తి చేయటానికి వినియోగించుకుంటాడు. ఉత్పత్తి క్రమంలో కార్మికుడు తనశ్రమను వినియోగించి సరుకు లను ఉత్పత్తి చేస్తాడు. ఈ క్రమంలో పెట్టుబడి దారుడు తన శ్రమశక్తికి చెల్లించిన మొత్తం కన్నా కార్మికుడు ఎక్కువ విలువను ఉత్పత్తి చేస్తాడు. కార్మికుని శ్రమశక్తి విలువ, శ్రమచేసే క్రమంలో కార్మికుడు ఉత్పత్తికి జోడించే విలువ వేరుగా ఉంటాయి. కార్మికుని శ్రమశక్తిని వినియోగించు కోవటం కోసం పెట్టుబడిదారుడు చెల్లించిన మొత్తాన్ని కార్మికుడు తన పనిదినంలో సగం కన్నా తక్కువ కాలంలోనే ఉత్పత్తి చేస్తాడు. మిగతా కాలం అంతా పెట్టుబడిదారుని కోసం అదనంగా పనిచేస్తాడు. కార్మికుడు ప్రతిరోజూ తాను చేసేశ్రమలో తనకోసం తక్కువ కాలం, పెట్టుబడిదారుని లాభాల కోసం ఎక్కువ కాలం పనిచేస్తాడు. కార్మికుడు చేసే ఈ అదనపు శ్రమలో నుండే అదనపు విలువ ఉత్పత్తి అవుతుంది. ఈ అదనపు విలువ పెట్టుబడి దారునికి లాభంగా మారుతుంది. ఈ విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి క్రమంలోనే

దోపిడీ జరుగుతుంది. కార్మికుడు చేసిన ఉత్పత్తిలో అతని శ్రమ ఫలితం మొత్తాన్ని చెల్లించ కుండా, కొద్దిభాగాన్ని మాత్రమే కార్మికునికి చెల్లించి, మిగతా మొత్తాన్ని లాభం రూపంలో పెట్టుబడిదారుడు తన జేబులో వేసుకుంటాడు. నిరుద్యోగం ఎక్కువైనకొద్దీ పనికోసం కార్మికుల మధ్యపోటీ పెరుగుతుంది. కాబట్టి పనిలో ఉన్న కార్మికులు, నిరుద్యోగుల మధ్య పోటీని ఆధారం చేసుకుని శ్రమశక్తి పునరుత్పత్తి కోసం కార్మికునికి చెల్లించే మొత్తాన్ని పెట్టుబడిదారుడు క్రమంగా తగ్గిస్తుంటాడు. ఆ విధంగా కూడా పెట్టుబడి దారుడు తన లాభాలను పెంచుకుంటుంటాడు. కార్మికునితో చేసుకున్న ఒప్పందం ప్రకారం పెట్టుబడిదారుడు అతనికి వేతనం ఇస్తున్నాడు. ఇందులో పెట్టుబడిదారుడు కార్మికులను దోపిడీ చేయటం ఎక్కడుంది అని ప్రశ్నిస్తారు. సాధ్యమైనంత ఎక్కువగా కార్మికుల శ్రమశక్తిని దోపిడీ చేయటం, తమ లాభాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకోవటం న్యాయమేననేది ఈ వాదన సారాంశం. పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులను దోపిడీ చేసే విధానాన్ని అర్థం చేసుకుని, ఆ దోపిడీని బట్టబయలు చేసి, దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని సమీకరించి, వర్గ పోరాటాన్ని తీవ్రం చేయటం ద్వారా మాత్రమే కార్మికవర్గ ప్రయోజనాలు పరిరక్షించబడతాయి.

**"నూతనంగా అధికారంలోకి వచ్చిన సోవియట్ ప్రభుత్వం కార్మికవర్గానికి అనేక హక్కులను కల్పించింది. ఎనిమిది గంటల పనిదినం, శ్రమకు తగిన వేతనం, ఉచిత విద్య, వైద్యం, వృద్ధులకు పెన్షన్లు, మహిళలకు పురుషులతో సమానంగా వేతనం, సమానహక్కులు, మైనారిటీ జాతులు, బలహీనవర్గాలకు స్వయం పాలన, భాషాసంస్కృతులకు రక్షణ తదితరాలను ఆ ప్రభుత్వం అమలు చేసింది."**



భారత దేశ పెట్టుబడిదారుల క్లబ్‌లో కొందరు ముఖ్యులు

కార్మికుల శ్రమశక్తిని దోపిడీ చేయటం ద్వారానే పెట్టుబడిదారులు సంపన్నులవుతున్నారు. పెట్టుబడిదారుల దోపిడీ తీవ్రం కావటం, లేదా సాపేక్షంగా తగ్గటం అనేది దేశంలో కార్మికవర్గ సంఘటిత శక్తి, అంతర్జాతీయంగా, దేశీయంగా కార్మికవర్గం, పెట్టుబడిదారీ వర్గాల బలాబలాలపై ఆధారపడి ఉంటుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తివ్యవస్థ ప్రారంభ దినాలలో కార్మికసంఘాలు లేవు. పెట్టుబడిదారులు చేస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా ఐక్యం కావాలనే ఆలోచన కార్మికులకు రాలేదు. ఎవరి మానాన వారు పనిచేసేవారు. పెట్టుబడిదారుల దోపిడీని ప్రశ్నించేవారు లేరు. కార్మికుల చేత 14 నుండి 20 గంటల సేపు గొడ్డుచాకిరి చేయిస్తూ, అతి తక్కువ వేతనాలు మాత్రమే చెల్లించేవారు. కార్మికులు అత్యంత దుర్భరమైన జీవితాలను గడిపేవారు. ఇటువంటి పరిస్థితులలో కార్మికుల శ్రమలో అత్యధిక భాగాన్ని పెట్టుబడిదారులు దోపిడీ చేసేవారు. తర్వాతి కాలంలో క్రమంగా కార్మికులు సంఘటితమై కార్మికసంఘాలను ఏర్పాటు చేసుకుని, పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడటం ప్రారంభించారు. పోరాటాలు పురోగమించే కొద్దీ కార్మికులు కొన్ని హక్కులు, మెరుగైన వేతనాలు సాధించుకున్నారు. 1917లో రష్యాలో కమ్యూనిస్టు పార్టి నాయకత్వంలో కార్మికవర్గం సంఘటితమై విప్లవాన్ని జయప్రదం చేసింది. దోపిడీ వర్గాలను అధికారం నుండి తొలగించి, రాజ్యాధికారాన్ని తనచేతుల్లోకి తీసుకున్నది. నూతనంగా అధికారంలోకి వచ్చిన సోవియట్ ప్రభుత్వం కార్మికవర్గానికి అనేక హక్కులను కల్పించింది. ఎనిమిది గంటల పనిదినం, శ్రమకు తగిన వేతనం, ఉచిత విద్య, వైద్యం, వృద్ధులకు పెన్షన్లు, మహిళలకు పురుషులతో సమానంగా వేతనం, సమానహక్కులు, మైనారిటీ జాతులు, బలహీనవర్గాలకు స్వయం పాలన, భాషాసంస్కృతులకు రక్షణ తదితరాలను ఆ ప్రభుత్వం అమలు చేసింది. సోవియట్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మికవర్గ అనుకూల విధానాల ప్రభావం ప్రపంచంలో వివిధ దేశాలలోని కార్మికవర్గం, అభ్యుదయ శక్తులపై పడింది. సోవియట్ యూనియన్ ప్రభావంతో అనేక దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడి కార్మిక వర్గాన్ని కూడగట్టటం ప్రారంభించాయి. కమ్యూనిస్టు పార్టీలు, కార్మికసంఘాలు, వాటి కార్యకలాపాలు శరవేగంతో విస్తరించాయి.కొన్ని దేశాలలో బలమైన కార్మిక పోరాటాలు జరిగాయి. ఈ పరిణామాలతో అనేకదేశాలలో కార్మికులు, ఇతర పీడిత ప్రజలకు దోపిడీదారులు కొన్ని హక్కులు, సదుపాయాలు కల్పించక తప్పలేదు.

1920, 30 దశాబ్దాలలో సామ్రాజ్యవాద దేశాల మధ్య తీవ్రమైన వైరుధ్యాలు రెండవ ప్రపంచయుద్ధానికి దారితీశాయి. యుద్ధంలో ఫాసిస్టు శక్తుల ఓటమి, సామ్రాజ్యవాద దేశాలు దెబ్బతినటంతో సామ్రాజ్యవాదం బలహీన పడింది. సోవియట్ యూనియన్ బలమైన శక్తిగా ఆవిర్భవించింది. తూర్పు యూరప్, చైనా, వియత్నాం, క్యూబా తదితర దేశాలలో శ్రామికవర్గ విప్లవాలు జయప్రదమై కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాన ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కమ్యూనిస్టుల నాయకత్వంలో ఉన్న ప్రభుత్వాలు సోవియట్ ప్రభుత్వం తరహాలోనే కార్మికుల వేతనాలు, పనిగంటలు, ఇతర హక్కుల పరిరక్షణకు చట్టాలు చేశాయి. సోవియట్ ప్రభుత్వం, కమ్యూనిస్టు పారీల నాయకత్వంలోని ఇతర ప్రభుత్వాలు అమలు జరుపుతున్న కార్మికుల, పీడిత ప్రజల ప్రయోజనాలను కాపాడే విధానాలు పెట్టుబడిదారుల ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా తయారయాయి. తమ హక్కుల సాధన కోసం, సోవియట్ తరహా ప్రభుత్వాలను తమ

> **“ బూర్జువా రాజకీయ పార్టీలపై బహుళజాతి, కార్పొరేట్ సంస్థలు ఆధిపత్యం సాధించాయి. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను బూర్జువా పార్టీల నాయకత్వంలోని ప్రభుత్వాలు హరిస్తు న్నాయి. చట్టాలను నీరుగారుస్తున్నాయి. ప్రభు త్వాల అండతో పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు ఇష్టం వచ్చినట్లు కార్మికులను తొలగిస్తున్నారు. ”**

దేశాలలో కూడా ఏర్పాటు చేసుకోవాలనే ఆకాంక్ష ప్రపంచవ్యాపితంగా కార్మికవర్గం, ఇతర పీడిత ప్రజలలో పెరిగింది. కార్మికవర్గానికి కనీస హక్కులైనా ఇవ్వకపోతే కార్మికులు, పీడితప్రజలు సంఘటితమై తమ వర్గపాలనను కూల్చివేస్తారని పెట్టుబడిదారీ వర్గం భావించింది. తత్ఫలితంగా కార్మికులకు కనీస వేతనాలు, సమ్మెహక్కు, సాంఘీక సంక్షేమ పథకాలు, తదితరాలను అమలుచేశారు. ఆ విధంగా దాదాపు అర్ధ శతాబ్దం పాటు కార్మికవర్గం అంతకు ముందు కన్నా సాపేక్షంగా మెరుగైన వేతనాలు, పని పరిస్థితులను సాధించుకున్నది.

70వ దశాబ్దం మధ్యకాలం వచ్చేసరికి తిరిగి పెట్టుబడిదారీ వర్గం సంఘటితమైంది. కార్మికవర్గ ప్రయోజనాలను కాపాడటంలో అగ్రస్థానంలో ఉన్న సోవియట్‌యూనియన్, సోషలిస్టు శిబిరం 80వ దశాబ్దంలో బలహీన పడింది. ఆ దశాబ్దం చివరిలో సోవియట్ యూనియన్ కూలిపోయి, సోషలిస్టు శిబిరం విచ్ఛిన్నమైంది. దానితో కార్మికవర్గం, పీడిత ప్రజలు సాధించుకున్న హక్కులను పెట్టుబడిదారీ వర్గం హరించటం ప్రారంభించింది. వివిధ దేశాలలోని బడా పెట్టుబడిదారులు తమ మధ్య ఉన్న వైరుధ్యాలను తాత్కాలికంగా పక్కన పెట్టి ప్రపంచ కార్మికవర్గాన్ని దోపిడీ చేయటం కోసం ఏకం అయ్యారు. బహుళజాతి, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను కాపాడే నూతన ఆర్థిక విధానాలను ప్రపంచమంతటిపైనా రుద్దారు. దానితో పాటుగా అస్థిత్వవాద ఉద్యమాలను ప్రోత్సహించి, కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేశారు. ఆ విధంగా ఒకవైపు పెట్టుబడిదారీ వర్గం సంఘటితం కావటం, మరోవైపు కార్మిక వర్గం బలహీనపడటం జరిగింది. దీనితో పెట్టుబడిదారీ వర్గం కార్మికవర్గ హక్కులను హరించటం పెరిగింది. అనేక దశాబ్దాల పాటు కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నీరుగారుస్తున్నారు. ఎనిమిది గంటల పనిదినాన్ని తిరిగి పది నుండి పద్నాలుగు గంటల వరకు పెంచుతున్నారు. వేతనాలను తగ్గిస్తున్నారు. కార్మికులకు ఉద్యోగభద్రత లేకుండా చేస్తున్నారు. పెన్షన్, ఇతర సాంఘీక సంక్షేమ పథకాలపై దాడి చేస్తున్నారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులు, ఇతర పీడితవర్గాలపై దాడిని గతంలో కన్నా మరింత తీవ్రం చేసింది. కార్మికవర్గాన్ని, పీడితప్రజలను చీలికలు పేలికలు చేసి, వారి పోరాటశక్తిని నీరుగారుస్తున్నది. బూర్జువా రాజకీయ పార్టీలపై బహుళజాతి, కార్పొరేట్ సంస్థలు ఆధిపత్యం సాధించాయి. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను బూర్జువా పార్టీల నాయకత్వంలోని ప్రభుత్వాలు హరిస్తు న్నాయి. చట్టాలను నీరుగారుస్తున్నాయి. ప్రభు త్వాల అండతో పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు ఇష్టం వచ్చినట్లు కార్మికులను తొలగిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలోని కంపెనీలు ఇష్టం వచ్చి నట్లు ఉద్యోగులను తొలగించటానికి పూనుకో వటంతో పోరాటాలు చేయటానికి సిద్ధపడని ఆ రంగంలోని ఉద్యోగులు కూడా సంఘాలను ఏర్పాటు చేసుకుని, పోరాటాలు చేయకతప్పని పరిస్థితిని కల్పించాయి. బహుళజాతి, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను కాపాడటం కోసం, ప్రభుత్వ సంస్థలను, సామాజిక సంపదను వారికి కట్టబెట్టటం కోసం ప్రభుత్వాలు నిస్సిగ్గుగా పనిచేస్తున్నాయి.


### ఐక్యంగా ప్రపంచ పెట్టుబడిదారులు

కార్మికుల, పీడిత ప్రజల పోరాటాలు శక్తివంతంగా జరగకపోతే వారి ప్రయోజనాలకు దోపిడీదారులు ఏ విధంగా హాని కలిగిస్తారో పై పరిణామాలు వెల్లడిస్తున్నాయి. పెట్టుబడిదారీ వర్గం దోపిడీకి గురవుతున్న వర్గాలను ఏ విధంగా మోసం చేస్తూ, తన దోపిడీని కొనసాగిస్తున్నదో కూడా ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. దోపిడీదారులు అస్థిత్వవాదాలను ప్రచారం చేస్తూ, కార్మికులు, పీడిత ప్రజలను కులాలు, మతాలు, ప్రాంతాలు, భాష, లింగ తదితర ప్రాతిపదికలపై చీలుస్తున్నారు. మరోవైపు ఈ విభేదాలతో నిమిత్తం లేకుండా ప్రపంచ పెట్టుబడిదారులందరూ ఐక్యంగా వ్యవహరిస్తు న్నారు. దోపిడీకి గురవుతున్న వారిని చీలుస్తున్న పెట్టుబడిదారులు తమ వర్గ ప్రయోజనాల పరిరక్షణ కోసం కలిసి వ్యవహరిస్తున్నారు. కార్మికులు, దోపిడీకి గురవుతున్న ప్రజలు చీలిపోతే పెట్టుబడిదారులకు వారిని దోపిడీ చేయటం సులభం అవుతుంది. కార్మికులు, దోపిడీకి గురవుతున్న ఇతర వర్గాలు తమ ప్రయోజనాలను సాధించుకోవటానికి ఐక్యం అయితే దోపిడీదారుల ప్రయోజనాలకు నష్టం కలుగుతుంది. అలా నష్టం జరగకుండా చూడటం కోసం కార్మికవర్గం, పీడితులలో చీలికలు తీసుకురావటం కోసం పెట్టుబడిదారీ వర్గం నిరంతరం ప్రయత్నం చేస్తుంటుంది.. ఈ విధంగా ఉద్యమాలను, కార్మికవర్గాన్ని చీల్చటానికి పెట్టుబడిదారులు రూపొందించిన ప్రణాళికలో ఆయా కుల, మత, ప్రాంతీయ ఉద్యమాలను నిర్వహిస్తున్న వారు సమిధలుగా ఉపయోగపడుతున్నారు. ఈ విధంగా ఉపయోగ పడుతున్న వారిలో కొందరు చైతన్యపూర్వకంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పని చేస్తుంటే మరి కొందరు ఈ ఉద్యమాల వలన నిజంగానే తమ కులం, మతం, ప్రాంతం వారికి ప్రయోజనం కలుగుతుందనే భ్రమలతో చేస్తున్నారు. ఈ విధంగా వర్గ ఐక్యత విచ్ఛిన్నం అయిన ఫలితంగా కార్మికవర్గం, శ్రామిక ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసే కమ్యూనిస్టు ఉద్యమం కూడా బలహీనపడింది. కార్మికవర్గ నాయకునిగా ఆ వర్గాన్ని సమీకరించి, పోరా టాలు నిర్వహించే కమ్యూనిస్టు ఉద్యమం బల హీనపడటం పెట్టుబడిదారులు, వారి ప్రభుత్వా లకు కార్మికవర్గంపై దాడిచేయటాన్ని మరింత సులభం చేసింది.

సరళీకరణ విధానాలు, అస్థిత్వవాద ఉద్యమాలు ప్రారంభం కాకముందు కార్మికులకున్న హక్కులు, చట్టపరమైన రక్షణలు, మొత్తం ఉత్పత్తిలో కార్మికుల వేతనాల వాటా, ఈ ఉద్యమాలు తీవ్రమైన తర్వాత వారి హక్కులు, చట్టాలు, ఉత్పత్తిలో వారి వాటా తదితరాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థం అవు తుంది. వర్గ పోరాటాలు బలహీనపడితే పెట్టుబడి దారీ, భూస్వామ్య వర్గాలు తమ దోపిడీని మరింత తీవ్రం చేస్తాయి. కార్మికుల పోరాటం పూర్తిగా బలహీనపడితే పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రారంభకాలంలోని ఆటవిక దోపిడీని కార్మికు లపై రుద్దటానికి పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలు ఏ మాత్రం సందేహించవు. కార్మికవర్గ

(మిగతా 34వ పేజీలో)

# దిక్కుతోచని స్థితిలో భారత ఆర్థికవ్యవస్థ



రచయిత ప్రముఖ పాత్రికేయులు

**వి. శ్రీధర్**

కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం చేతుల్లో భారతదేశ ఆర్థిక పరిపాలనా విధానం, నోట్ల రద్దు మరియు జి.ఎస్.టి. అమలు వలన జరిగిన తీవ్ర నష్టాన్ని సరిచేయటానికి తంటాలు పడుతున్న స్థితిలోనే కొనసాగుతోంది.

ఆర్థిక మందగమనంతో దేశం యావత్తూ అక్టోబర్ 6వ తేదీన జరగనున్న జి.ఎస్.టి. కౌన్సిల్ సమావేశ నిర్ణయాలకై ఆతృతగా ఎదురు చూసింది. జులై ఒకటవ తేదీనుంచి అమలు అవుతున్న 'విప్లవాత్మక పన్ను' విధానం అని చెప్పబడిన జి.ఎస్.టి. యొక్క వినాశకర ప్రభావాన్ని కొంతమేరకైనా తగ్గించటానికి తాయిలాలు ప్రకటిస్తారేమోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో అన్ని ప్రాంతాలలో ప్రభావం చూపగల చిన్న పరిశ్రమల యజమానులు ఈ మూడు నెలలకాలం నిద్రలేని రాత్రులు గడిపారు.

జి.ఎస్.టి. విధానాన్ని వెనక్కి తీసుకుంటారని అనుకోవటం అతిశయోక్తి అవుతుంది. కానీ దేశంలోని వివిధ ప్రాంతాల నుండి పాడి రైతులు, మందుల రంగంలో వ్యాపారులు, తిరుప్పూరులోని టెక్స్‌టైల్ యజమానులు, చేనేత పరిశ్రమ యజమానులు, కార్మికులు, లక్నోలోని చికెన్ వ్యాపారులు, భివండీలోని పవర్‌లూమ్స్ నడుపువారు, కాన్పూర్, ఘజియాబాద్‌లోని వ్యాపారులు అందరూ తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు.

కేరళ పర్యటనలో ఉన్న అమిత్ షాని ఉన్నపళంగా రమ్మని నరేంద్ర మోడీ పిలిపించి, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీతో భేటీ కావడం మహానాటకానికి తెరదీసింది. అలాగే ఈ సమావేశం చాలా ఆశలను పెంచింది. అదే సమయంలో గత నవంబర్‌లో అనూహ్యంగా ప్రకటించిన నోట్ల రద్దు నిర్ణయంలాగా, మోడీ పాలనలో "ఎప్పుడు ఏదైనా జరగవచ్చు" అనే భయాందోళనలతో ఉన్నవారూ ఎక్కువయ్యారు. ఎక్కువ మంది ఊహించిన విధంగానే జి.ఎస్.టి. కౌన్సిల్ సమావేశం అనంతరం ఉపశమనాలు ఏమీ కానరాలేదు. ఈ కొత్త పన్ను విధానాన్ని పర్యవేక్షించే అత్యున్నత బాడీ ఈ కౌన్సిల్. ఆర్థికమంత్రే కీలక నిర్ణయాలు తీసుకొని ప్రకటిం చేస్తున్నారు. ఈ కౌన్సిల్ నిర్ణయించిన కీలక సవరణలు, పన్నుల రేట్లలో చేసిన మార్పుల లాగానే, మరలా సరుకులు, సేవలు మీద, అలాగే రిటర్న్ సమర్పించే పత్రాలలోనూ స్వల్ప మార్పులు, తద్వారా అర్థమయ్యేదేమిటంటే, వాణిజ్య వ్యాపారాలపై జి.ఎస్.టి. భారం మరింత పెరగనుంది. వారు పన్నురేట్లలో చేసిన మార్పులు చాలా స్వల్పమైనవి. ఎందుకంటే అవి ఇప్పటికే అసంబద్ధ పద్ధతులలో నడపబడుతున్నవి. ఉదాహరణకి కాక్రా అనే గుజరాతీ వంటకం (చిరుతిండి) దానిపై పన్ను మార్పు రానున్న గుజరాత్ రాష్ట్ర ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చేసినది.

అన్నిటికన్నా ముఖ్యంగా జి.ఎస్.టి. అమలు జరగటం మొదలైన దగ్గర్నుంచి నిరంతరం మార్చుతున్న పన్నుల రేట్ల వలన ఒక దేశంయొక్క పన్ను నియంత్రణా వ్యవస్థని, లేదా యంత్రాంగాన్ని అపహాస్యం చేసినట్లే. వాణిజ్య, వ్యాపారవర్గం, వినియోగదారులు ఒక నిలకడ గలిగిన పన్నుల వ్యవస్థని కోరుకుంటారేకాని, ఎప్పుడు ఏది జరుగుతుందో, ఏది మారుతుందో అని ఆందోళన చెందే అనిశ్చిత పరిస్థితిని కోరుకోరు. అంతేకాదు. నిరంతరం పన్నుల రేట్లను, విధానాలను మారుస్తూ ఉంటే పరిపాలనా యంత్రాంగం ఒత్తిడులకు, ప్రలోభాలకు లోనవుతుందనే సంకేతాలు మార్కెట్‌కి వచ్చినట్లే. ఉదాహరణకి యాభైవేల రూపాయల వరకు బంగారం కొనుగోలు చేసేవారు ఎటువంటి వ్యక్తిగత వివరాలు, ఆధారాలు చూపక్కర్లేదని సవరణలు చేశారు. ఒకవైపు ప్రభుత్వం మేము నల్లధనాన్ని ఉక్కుపాదం అణిచివేస్తాము, ఏరివేస్తాము అని వెర్రికేకలు వేస్తూ, పెద్ద నోట్ల రద్దుని కూడా ప్రవేశపెట్టి విపరీతంగా ప్రచారం చేసుకుంటూ ఈ నిర్ణయం తీసుకోవడం ఎంతవరకు సమంజసం. వజ్రాలు, బంగారు నగల వ్యాపార లాబీ బలీయంగా ఒత్తిడి చేసింది కాబట్టి మార్చేశారు.

మరొకవైపు జి.ఎస్.టి. వలన ఎగుమతులు చేసేవారు చాలా తీవ్రంగా నష్టపోయారు. వీళ్ళలో ఎక్కువమంది అతి తక్కువ శాతం లాభంతో పనులు చేస్తారు. అలాగే వీరు ఇప్పటికే కట్టిన పన్నును తిరిగి రాబట్టుకోవడం కష్టసాధ్యం. కనీసం ప్రభుత్వం ప్రటించిన వివిధ రాయితీ విధానాలలోనైనా వీటిని మాఫీ చేయొచ్చు. కానీ అలాగూ జరగలేదు. ఒక అంచనా ప్రకారం జి.ఎస్.టి. వచ్చిన తరువాత ఇలా ఇరుక్కుపోయిన డబ్బు సుమారు అరవై వేల కోట్ల రూపాయలు. జైట్లీగారు ఈ వ్యాలెట్ అనే స్కీము వీరి కొరకు ప్రకటించారు. ఈ విధానంలో ఊహాజనిత పన్ను జమలను దృష్టిలో పెట్టుకొని ఎగుమతిదారులందరూ తమ బాధ్యతగా ఉన్న పన్నును చెల్లించటం.

కానీ ఇది కేవలం తుపాకీ కాల్పులకి బ్యాండెడ్ వాడి కట్టుకట్టినట్లు ఉంది. ఇది తాత్కాలిక పరిష్కారమే. ఆదాయం సంబంధిత పరిణామాలు ఏ క్రమం సంతరించుకుంటాయో తెలియని నేపథ్యంలో ఈ పూతమందులు అక్కరకు రావు.

**భారమే ఊపిరిగా...**

జి.ఎస్.టి. కౌన్సిల్ సమావేశం తరువాత జైట్లీ ప్రకటించిన ప్యాకేజీలో చిన్న, మధ్యతరహా పరిశ్రమాధిపతులకు, చేయూతనందించే పథకంగా ఉందని ప్రశంసించారు. వాస్తవానికి ఈ పారిశ్రామిక వర్గం యొక్క అవస్థలను అవగాహన చేసుకోకుండా, చేసుకుందామనే తపన కూడా లేకుండా ఈ విధానాలను రూపొం

> **“ ఇండియా రేటింగ్స్ సంస్థ ప్రకారం, జి.ఎస్.టి. ప్రభావం వలన ఈ మార్కెట్ దాదాపుగా పెద్ద కంపెనీలకు అనుకూలంగా మారేవిధంగా చేశారని, ఎందుకంటే ధరల నిర్ణయ శాతం వ్యత్యాసం కేవలం 5 నుండి 7 శాతం వరకే ఉందని తెలిపారు. అది కూడా పోయేదశ వచ్చిం దని పేర్కొన్నారు. ”**



జిఎస్‌టి, నోట్ల రద్దుతో చిన్న పరిశ్రమలు మూతపడ్డాయి, లక్షలాది కార్మికులు నిరుద్యోగులయినారు.

దించారు. లేదా కావాలనే తాము అమలు చెయ్యాలనుకున్న విధానాన్నే కొనసాగించి వీరిని దెబ్బతీయాలని నిర్ణయించుకున్నారు. తూతూ మంత్రంగా రాయితీలు ప్రకటించారనటానికి రెండు ఉదాహరణలు. మొదటిది కాంపౌండింగ్ స్కీము యొక్క పరిధిని డెబ్బై ఐదు లక్షల నుంచి కోటి రూపాయలకు పెంచడం. చిన్న చిన్న పరిశ్రమలు ఏవైతే ఈ పరిధి టర్నోవర్‌లో ఉన్నాయో, వారు చేసే ఉత్పత్తిని బట్టి నిర్ణయించ బడిన పన్నురేటు ప్రకారం ఒకటి నుంచి ఐదు శాతం వరకు కట్టడం. వ్యాపారులకు ఒక శాతం, తయారీదారులకు 2 శాతం, సరఫరా దారులకు రెండు శాతం, రెస్టారెంట్లకు ఐదు శాతం. దేశంలో ఉన్న 80-90 లక్షల మంది పన్ను చెల్లించే వారిలో 10-50 లక్షల పారిశ్రామిక యూనిట్లు అంటే, దాదాపు 17 శాతం ఈ స్కీములోకి రావడానికి ముందుకొచ్చారు. ఆ పరిధి పెరగటం వలన జి.ఎస్.టి. పన్ను చెల్లింపుదారులలో ఐదింట ఒకవంతు మంది ఈ స్కీములోకి వచ్చారన్నమాట.

జైట్లీగారు చెప్పినటు ఈ యూనిట్లన్నిటి మీద రిటర్న్ సమర్పించటానికి తక్కువభారం పడుతుందని, మూడు నెలకొకసారి మాత్రమే మరియు సంవత్సరం చివరికి ఒకసారి అనేది ఆకర్షణీయంగా కనుపడుతోంది. కానీ నిజానికి ఇది మోసపూరితమైనది. ఈ స్కీము ద్వారా ఖర్చు తగ్గవచ్చేమోకానీ, ఈ పారిశ్రామిక యూనిట్లు తమ ఉత్పాదక పెట్టుబడి రాయితీలు కోల్పోతాయి.

చిన్న, మధ్యతరగతి వ్యాపారులకు ఉపశమనం కల్పిస్తున్నామనే పేరుతో జైట్లీగారు ఒకటిన్నర కోట్లలోపు వార్షిక టర్నోవర్ ఉన్న వారికి మూడు నెలలకొకసారి మాత్రమే రిటర్న్ దాఖలు చేయవచ్చని, ప్రతినెల అనేక రకాల పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని ప్రకటించారు. ఇది కూడా ఆశించిన ఫలితాలు నివ్వలేదు. జి.ఎస్.టి. అభియోగాలు పరిశీలిస్తే అది మనకి అర్థమౌతుంది. డెడ్‌లైన్ సమీపించే సమయానికి పన్ను రిటర్న్ పత్రాలు సమర్పించే వారి తాకిడి తట్టుకొని సవ్యంగా సాగేలా జి.ఎస్.టి. పరిపాలనా యంత్రాంగం ఏర్పడలేదు. అందుకే జైట్లీగారు అనేకసార్లు ఆఖరుతేదీని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేయాల్సి వచ్చింది.

వాస్తవానికి జైట్లీ ప్రకటించిన ఉపశమనాలు, ఇప్పటికే దెబ్బతిన్న పారిశ్రామిక రంగానికి మరింత భారంగా పరిణమించాయి. ఎందుకంటే, ఉత్పాదకాల పన్ను జమపై హక్కు పొందడానికి వారు మూడు నెలలపాటు వేచి ఉండాలి. ఈ ప్రభావాన్ని తట్టుకోవాలంటే వారి మూలధన పెట్టుబడిని పెంచుకోవాల్సి ఉంటుంది. మూలధనం తరుగుదల వీరికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుంది. ఎందుకంటే వేతనాలు ఇవ్వడం, ముడి పదార్థాలు, ఉత్పాదకాలు, పెట్టుబడి వీరికి నిరంతరం సమస్యగానే ఉంటుంది.

ఇంతేకాకుండా, పెద్ద కంపెనీలు వీరి నుండి కొన్ని ముడి సరుకులకు చాలా ఆలస్యంగా చెల్లించడం ఒక ఆనవాయితీగా ఉండడం వలన, వారిమీద ఆధారపడి బ్రతికేవారిలా చిన్న పరిశ్రమల వారి పరిస్థితి ఉంది. బ్యాంకులతో వీరికున్న కొద్దిపాటి పరపతి వీరి మూలధన సేకరణకి అంతగా ఉపయోగపడడం లేదు. అందువలనే, ఈ చిన పరిశ్రమల వ్యాపారానికి, లాభాలకి డబ్బు ఎప్పుడూ కీలకపాత్ర పోషిస్తుంది. నోట్ల రద్దు వీరి నోట్లో మట్టి కొట్టింది. వారి వ్యాపారమంతా డబ్బు మార్గం ద్వారానే నడుస్తుంది కాబట్టి దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది పరిశ్రమలు, టెక్స్‌టైల్స్ నుంచి లెదర్, పాపడ్, ప్లాస్టిక్ మరియు ఇతర పరిశ్రమలన్నీ నోట్ల రద్దు తరువాత బాగా దెబ్బతిన్నాయి.

జి.ఎస్.టి. వచ్చిన తరువాత వారికి ఇంకొక శాపంలా మూలధన పెట్టుబడి వలయం అవసరమయ్యింది. అలాగే ఈ పరిశ్రమలు తమకు రావాల్సిన బాకీల కోసం ఆగాలన్నా, పన్ను రాయితీ జమలు తిరిగి రావాలన్నా వేచి ఉండే పరిస్థితిలో, ఈ మధ్యకాలంలో మూలధన పెట్టుబడి సమకూర్చుకోవాల్సి ఉంటుంది. నిజానికి వీటిల్లో చాలావరకు అతి తక్కువశాతం లాభాలతో నడుపుతున్నారు. కాబట్టి ఈ పరిస్థితి వారికి ఊపిరి ఆడనీయడం లేదు. ఫిచ్ గ్రూపుకు చెందిన ఇండియా రేటింగ్స్ (రీసెర్చ్ అనే అంతర్జాతీయ రేటింగ్ సంస్థ) జి.ఎస్.టి.ని అధ్యయనం చేసి, దాని ప్రభావం వలన టెక్స్‌టైల్స్ స్టీల్, వినియోగ వస్తువులు మరియు భవన నిర్మాణరంగాల మీద అనేక రూపాల్లో పడిందని తెలిపారు. జి.ఎస్.టి.ని ప్రకటించే ముందే ఉత్పాదక జమలు ఏవైతే ఆగిపోయాయో, వాటిద్వారా మార్కెట్‌లో వచ్చే ఆందోళనలను పోగొట్టటానికి అనేక విడతలుగా రాయితీలను ప్రభుత్వం ప్రటించామని తెలిపింది. భవన నిర్మాణరంగం, వినిమయ వస్తువులు, మెటల్స్

వంటి రంగాలలో ఉత్పాదక పన్నుల రాబడి ఆలస్యం వలన పడే వడ్డీ వలయం ఈ రంగాల లోని చిన్న పరిశ్రమలకు గండంగా మారింది.

అదే మనం స్టీల్‌రంగాన్ని పరిశీలిస్తే, ఇండియా రేటింగ్స్ సంస్థ ప్రకారం, జి.ఎస్.టి. ప్రభావం వలన ఈ మార్కెట్ దాదాపుగా పెద్ద కంపెనీలకు అనుకూలంగా మారేవిధంగా చేశారని, ఎందుకంటే ధరల నిర్ణయ శాతం వ్యత్యాసం కేవలం 5 నుండి 7 శాతం వరకే ఉందని తెలిపారు. అది కూడా పోయేదశ వచ్చిందని పేర్కొన్నారు. అసంఘటిత స్టీలు పరిశ్రమల వాటా మార్కెట్‌లో బాగా పడిపోయే ప్రమాద ముందని, కారణం, వారి మూలధన పెట్టుబడి ఎక్కువగా ఉండటం, రేట్లు తక్కువగా ఉండటం అని తెలిపారు. టెక్స్‌టైల్స్ పరిశ్రమలని పరిశీలిస్తే అది మరింత స్పష్టంగా, తీవ్రంగా కనిపిస్తుంది. నోట్ల రద్దు మరియు జి.ఎస్.టి. వరుసగా దాడి చేయడంతో మొత్తం సరఫరా గొలుసు చక్రం తునాతునకలైంది.

> **“ ఈ మధ్యకాలంలో వెలుగులోకి వచ్చిన సర్వేల ప్రకారం దిగుమ తులు ఈ కాలంలో పెద్దఎత్తున పెరిగాయని, జి.ఎస్.టి. మద్దతుదారులు ఇదొక పురోగామి పరిణామంగా చెప్పుకుంటున్నారు. కానీ జరిగిందేమిటంటే, నోట్ల రద్దు, జి.ఎస్.టి. దెబ్బకి సరఫరా గొలుసు విచ్ఛిన్నం కావడం వలన, ఆ సందులు పూడ్చడానికి, ఆ మార్కెట్‌ను కొల్లగొట్టడానికి దిగుమతులు పెరిగాయి. ”**




నోట్ల రద్దుతో మొదటిగా దెబ్బతిన్నది చిన్న వ్యాపారాలు

జి.ఎస్.టి. వచ్చి తాను అదనంగా సమకూర్చుకున్న సరుకునంతటినీ తన్నుకుపోయిందని, తానే కాదు ఆ చక్రంలో పైనుంచి క్రింది దాకా అందరి పరిస్థితి అలానే ఉందని బెంగ ళూరులోని ఒక రిటైల్ వ్యాపారి తెలిపాడు. జి.ఎస్.టి. రాకముందు, ఆనాటి పరిస్థితులలో ఏది ఫ్యాషన్‌గా ఉందో, తన ఊహలతో లెక్కలు వేసుకొని, సరుకు నింపుకొంటుండేవాడు. ఒకవేళ అమ్మలేని సరుకు ఉంటే దానిని తిరిగి హోల్‌సేల్ వారికి పంపి, భవిష్యత్తులో పంపబడే కొత్త సరుకుకు కట్టే బిల్లులలో సర్దుకునేలా వ్యాపారం చేశారు. ఈ మార్కెట్ లాజిక్ జి.ఎస్. టి. తరువాత పూర్తిగా రివర్స్‌గేర్‌లో పడింది. క్రింద రిటైలర్ నుండి హోల్‌సేల్‌కి అక్కడినుండి తయారీదారుని వరకు వెనక్కి తంతోంది.

**లోపభూయిష్ట విధానం...**

జి.ఎస్.టి. రాజ్యంలో మొత్తం విధానంలో పైనుండి క్రిందివరకు ప్రతి ఒక్క జాబితా ఒకే రకంగా ఉండాలని బిగించింది. ఇటువంటి విధానం జాబితాల (ఇన్వాయిస్) ఏకరూపం అనేది ప్రపంచంలో ఏ జి.ఎస్.టీ. విధానంలో లేదు. ఇది అదనపు భారమే కాక, అనిశ్చితికి కూడా దారితీసింది. ఒక చిన్న కంపెనీ నడుపుతున్న వ్యాపారి తన కంపెనీ కోసం ఒక కారు కొనుక్కున్నాడు. కారు డీలర్ అన్ని వివరాలు ఇన్‌వాయిస్‌లో నమోదు చేసేటట్లు చూసుకున్నాడని, అలా చేయకపోతే పన్ను జమ అడగటానికి తనకి ఇబ్బంది అవుతుందని తెలిపాడు. ఎవరో పన్నుల రిటర్న్ సమర్పించటానికి, నేనెందుకు భరించాలి అని ప్రశ్నించాడు.

అలాగే బెంగుళూరులోని టెక్స్‌టైల్ రిటైలర్, ప్రతి ఇన్‌వాయిస్ చక్రంలో ఉన్న అందరితో ఒకేలా ఉంచటం వలన, తనకున్న వెసులుబాటు తగ్గిపోయి రిస్క్ ఎక్కువయ్యిందని తెలిపారు. హోల్‌సేలర్ నుంచి కొన్న సరుకులో కొంత మిగిలిపోతోందని, అది అతను వెనక్కి తీసుకోవట్లేదు కాబట్టి, సరుకు నిల్వని పూర్తిగా తగ్గించుకొని కొంటున్నానని తెలిపాడు. ఇది ఒక్క టెక్స్‌టైల్‌లోనే కాదు అన్ని రంగాలలో జరుగుతోందని, అందరూ రిస్క్ తగ్గించుకుందామని ప్రయత్నం చేస్తున్నారని తెలిపాడు. మూలధన పెట్టుబడి కొరత వలన ఇదంతా జరుగుతోందని పేర్కొన్నాడు. ఆర్థిక మందగమనానికి కారణం ఇదేనని కూడా విశ్లేషించాడు.

జి.ఎస్.టి. గురించి సమర్థించేవారు, బిల్లులన్నీ మ్యాచ్ అవ్వడం తప్పనిసరి అని, అలా అయితేనే పన్ను ఎగవేతను తప్పించుకోవటం నుంచి బయటపడగలమని వాదిస్తున్నారు. ఇందుకు వారు చైనాను ఉదాహరణగా చూపిస్తున్నారు. కానీ చైనా ఏ విధానం అనుసరిస్తోందో తెలుపరు. చైనాలో ఏ రంగాలవారైనా దేశ వ్యాప్తంగా ఒకేరకమైన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తారు. దీనివలన ఒక దాని తరువాత ఒకటి, వెంట వెంటనే పన్నుల జమగాని, క్లెయిమ్‌లు కాని జరిగిపోతాయి. ఇతర దేశాలన్నింటిలోనూ కొన్ని నమూనాలను మాత్రమే సేకరించి వాటి ప్రామాణికతను పరీక్షించి, ఆ సంస్థల క్లెయిమ్‌లను పన్నుల జమను బహిష్కరిస్తారు. అంతేకాని, ఇలా మొత్తం వ్యవస్థని ఉక్కిరిబిక్కిరి చేసి ప్రతి ఒక్క బిల్లు, సహ వ్యాపారి బిల్లులాగే ఉండాలని ప్రపంచంలో ఎక్కడా లేదు. ఇది కేవలం మన జి.ఎస్.టి. విధానంలో ఉన్న తీవ్రమైన లోపం. అన్నింటికన్నా ఆందోళనకరమైన అంశం ఏమిటంటే ఆర్థికమంత్రిత్వశాఖ కాని, పన్నుల శాఖకాని జి.ఎస్.టి.ని అమలు చేసే యంత్రాంగం యొక్క ఆలోచనా విధానాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. కేంద్రం మరింత వివేకంతో ఆలోచించి ఉంటే ఉపయోగం ఉండేది. అటువంటి ఆలోచన ఉండుంటే, తక్షణం మరియు తాత్కాలిక ఆదాయపు పెంపుకోసం కాకుండా నిజాయితీగల పన్ను సంస్కరణలు తేవచ్చు. అటువంటి వివేకపు ఆలోచన ఉంటే, రాష్ట్రాల ఆదాయాలను కూడా కాపాడే పద్ధతిలో

**“ ఒక సాధారణ పౌరుడు లేదా సాధారణ ప్రజలు వారి ఊహల లో, ఆలోచనలలో వారు కోరుకునే ఉపాధికి, మోడీగారి బుల్లెట్ ట్రైన్, పియూష్ గోయల్‌గారి ప్రవచనాలు సాధారణ ప్రజానీకానికి, అగ్రస్థానంలో ఉన్న రాజకీయ పండితులకి ఎంత దూరం పెరిగిందో మనకి అవగతమౌతుంది. ”**

చర్యలు ఉండేవి. ఎందుకంటే ఈ ప్రక్రియలో రాష్ట్రాలు తమ పన్నుల ద్వారా ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలు అంతరించిపోయాయి కాబట్టి.

జి.ఎస్.టి.ని సమర్థించేవారు, మోడీగారి వంటి మాగధులు నోట్ల రద్దు మరియు జి.ఎస్.టి.లు వ్యాపార వాణిజ్యాలను క్రమబద్ధీకరించాయని, ఆర్థిక పురోగతికి మంచి ఊత మిచ్చాయని గొప్పలు చెబుతున్నారు. కానీ వాస్తవం మరోలా ఉంది. ఈ మధ్యకాలంలో వెలుగులోకి వచ్చిన సర్వేల ప్రకారం దిగుమతులు ఈ కాలంలో పెద్దఎత్తున పెరిగాయని, జి.ఎస్.టి. మద్దతుదారులు ఇదొక పురోగామి పరిణామంగా చెప్పుకుంటున్నారు. కానీ జరిగిందేమిటంటే, నోట్ల రద్దు, జి.ఎస్.టి. దెబ్బకి సరఫరా గొలుసు విచ్ఛిన్నం కావడం వలన, ఆ సందులు పూడ్చడానికి, ఆ మార్కెట్ కొల్లగొట్టడానికి దిగుమతులు పెరిగాయి. అంటే ఈ పరిశ్రమలు తమ చేతగానితనంతో ఇటువంటి అవకాశాన్నిచ్చాయని కాదు. నోట్ల రద్దు, జి.ఎస్.టి. వాటి వెన్ను విరిచాయి. మోడీ మద్దతుదారులు మాత్రం ఈ రెండు ప్రక్రియలు చాలా గొప్పవని, కానీ వాటి అమలు గొప్పగా జరగలేదని, అందుకే ఈ సమస్యలని సెలవిస్తున్నారు. ఇంకా కొంత నోట్ల ముద్రణ జరిగుంటే, ఇంకా కొంత వేగంగా ఎ.టి.ఎమ్‌ల సామర్థ్యం, డబ్బు పంపిణీ పెరుగుంటే, ఇంకా కొంత సమర్థవంతంగా బ్యాంకులు పనిచేసుంటే... ఇలా చెప్పుకుంటూ పోతున్నారు. ఇదే సన్నాయి లను ఇప్పుడు జి.ఎస్.టి. మద్దతుదారులు నొక్కుతున్నారు. జి.ఎస్.టి. అమలు చేసే యంత్రాంగం యొక్క గొలుసుకట్టు బాగాలేదని, రిటర్న్ సమర్పించే సమయంలో అది పలుమార్లు విఫలమైందని చెప్పుకుంటున్నారు. కానీ అసలు సమస్య జి.ఎస్.టి.ని ఏర్పచిన విధానంలోనే ఉంది. పరిశ్రమలు లేదా వాణిజ్యం యొక్క సైజుని పట్టించుకోకుండా ఒకే విధమైన పన్ను విధింపులో ఇది కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అది ఆర్థిక వాస్తవికతలను అంచనా వేయడం, చూడ్డానికి మాత్రం చాలా మధ్యస్తంగా అనిపిస్తుంది కానీ, వాస్తవంలో చిన్న పరిశ్రమలకి వ్యతిరేకంగా అన్ని రంగాలలోనూ వీరిమీద అధిక భారం మోపేలా తయారైంది. జి.ఎస్.టి. ఖచ్చితంగా తటస్తం కాదు. అది చాలా పక్షపాతంతో కూడుకొని బడా కార్పొరేట్లకి ఉపయోగపడేలా ఉంది. తద్వారా ఆర్థిక కండబలం ఒకచోట పేరుకునేలా చేస్తోంది.

ఈ మధ్యకాలంలో పియూష్ గోయల్, రైల్వేలలో జరుగుతున్న వరుస ప్రమాదాల గురించి ఆందోళన పడకుండా, నిరుద్యోగం పెరగటం అనేది యువతలో మంచి పరిణామమని అలా ఉంటేనే వారిలో చాలామంది నూతన పారిశ్రామికవేత్తలు ఆవిర్భవిస్తారని పేర్కొనడం అందరినీ విస్మయానికి గురిచేసింది.

మొదటగా, భారత ఆర్థిక పరిస్థితులు నూతన పారిశ్రామిక వేత్తలకి ఎన్నడూ ఆటంకం కాలేదు. కానీ ఈ రెండు దుర్మాగపు విధానాలు వచ్చిన తరువాత చిన్న చిన్న తయారీ పరిశ్రములు, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ లేదా ఫ్యాక్టరీలు, హోటల్స్‌తోపాటు, కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా మూలధనం సమస్యతో దెబ్బతిన్నాయని వార్తలు వస్తున్నాయి. రెండోది, ఒక సాధారణ పౌరుడు లేదా సాధారణ ప్రజలు వారి ఊహలలో, ఆలోచనలలో వారు కోరుకునే ఉపాధికి, మోడీగారి బుల్లెట్ ట్రైన్, పియూష్ గోయల్‌గారి ప్రవచనాలు సాధారణ ప్రజానీకానికి, అగ్రస్థానంలో ఉన్న రాజకీయ పండితులకి ఎంత దూరం పెరిగిందో మనకి అవగతమౌతుంది.

ఈ రాజకీయ సంక్షోభం రాకముందు, నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్‌లో భాగస్వాములైన మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరిగార్లు దీనిపై తీవ్రంగా స్పందించారు. దీనికి జైట్లీగారు జి.ఎస్.టి. అనేది ఒక నిరంతర ప్రక్రియ అని సెలవిచ్చారు. అదే దాని అర్థం. ముందు ముందు దీనిని ఎప్పుడూ సవరిస్తూనే ఉంటారని, ఇది మోడీ గారు అర్ధరాత్రి పార్లమెంట్‌లో చేసిన ఆర్భాటపు ప్రకటనలకు పూర్తిగా విరుద్ధమైనది. కొన్ని నెలలక్రితం మోడీ చేసిన ప్రమాణం ప్రకారం జి.ఎస్.టి. ఒక విప్లవాత్మకమైన చర్య. వాస్తవానికి, ఈ విప్లవాత్మక పన్ను సంస్కరించబడుతూనే ఉంటుంది. ఒక్కటి మటుకు ఖాయంగా చెప్పవచ్చు. జి.ఎస్.టి. వినాశకర పద్ధతుల్లో నిర్మించబడింది, అది ఎంతోమందిని దారుణంగా గాయపరుస్తుంది.

**అను : లక్కరాజు శ్రీనివాస భారవి**

**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** ‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తిప్రెస్, గవర్నరుపేట, విజయవాడ.

ఆరోగ్యం

# ప్రజారోగ్యాన్ని నాశనం చేసే 'నీట్'

ఎ. కలయారసన్

తమిళనాడులో అత్యధిక ఆరోగ్య సూచికలు చాలా మంచి సామర్థ్యాన్ని కనబరిచినట్లు చూపుతున్నాయి. దీనికి సృజనాత్మక సాంకేతిక జోక్యం, సామాజిక సమీకరణ తోడుకావడం కారణంగా చెప్పవచ్చు. వినూత్న రిజర్వేషన్ విధానాలు, ప్రోత్సాహక నిర్మాణం గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం వ్యక్తిగతంగా అందరికీ అందేలా చేసింది.అయితే జాతీయ అర్హత మరియు ప్రవేశపరీక్ష (నీట్) గతంలో చేరుకున్న అన్ని లక్ష్యాలను వెనక్కి మళ్ళించింది.

భారతదేశంలో వైద్య కళాశాలల్లో ప్రవేశంలో జరుగుతున్న అవినీతిని అరికట్టడానికి నీట్ పనికివచ్చేటట్లు పైకి కనిపిస్తుంది. భారత వైద్యమండలి (ఎం.సి.ఐ.) దీనిని దేశవ్యాప్తంగా ఒక ప్రామాణికంగా చేసేటందుకు ప్రయత్నాలు చేస్తున్నది. అయితే మొత్తంగా చూసినప్పుడు ఈ ప్రవేశపరీక్ష విద్య మరియు సామాజిక న్యాయాలకు హానికరంగా తయారవుతుందని తీవ్రమైన విమర్శను ఎదుర్కొంటుంది. ప్రత్యేకించి తమిళనాడు నీట్ వలన చాలా కోల్పోయింది, అత్యంత సమర్థవంతమైన ప్రజారోగ్య వ్యవస్థ పునాదుల మీద ఇది దాడిచేసింది. వినూత్నమైన రిజర్వేషన్ విధానాలు, ప్రోత్సాహకరమైన నిర్మాణాలతో ఈ రాష్ట్రంలో ప్రజారోగ్యవ్యవస్థ నిర్మించబడింది.

భారత రాజ్యాంగం ప్రకారం ఆరోగ్యం అనేది రాష్ట్రానికి చెందిన అంశం. రాష్ట్ర నాయకులు ఆరోగ్య వ్యవస్థలను చక్కగా నిర్మించడం లేదా నాశనం చేయడం చేయగలరు. అన్ని నిర్మాణాలు చాలా స్పష్టంగా ప్రజారోగ్యం కోసం అమలు చేయబడుతున్నాయి. వ్యవస్థ నిర్మాణంలోనే విభిన్న ప్రభుత్వ సంస్థల బాధ్యతలను చక్కగా స్పష్టంగా చెప్పబడిన, ఒక విధానపరమైన చట్రాన్ని ఏర్పరచటం, బడ్జెట్ కేటాయింపులతో సంబంధం ఏర్పరచడం ద్వారా పటిష్టవ్యవస్థ ఏర్పరచబడింది. నీట్ ఈ చట్టానికి పూర్తి విరుద్ధంగా ఉన్నది.

తమిళనాడులో ప్రభుత్వ ఆరోగ్య నిర్వాహకులు, సాంకేతిక సిబ్బంది మధ్య సమన్వయం ద్వారా ఈ విజయం సాధ్యమైందని సాధారణంగా చెబుతుంటారు. అయితే ఇది కేవలం ఒక భాగం మాత్రమే. దీనికి కొన్ని ప్రత్యేకమైన కారణాలు కూడా ఉన్నాయి. వాస్తవానికి తమిళనాడు యొక్క సామర్థ్యం గడిచిన శతాబ్దకాలంలో జరిగిన సామాజిక ఉద్యమాలు అక్కడ కేంద్రీకృతం కావడం వల్ల దృఢమైన ప్రజారోగ్య వ్యవస్థ నిర్మాణమైందని సంతోష్ మెహరోత్రా వాదిస్తారు. దాని ఫలితంగానే రాష్ట్ర ఆరోగ్య సిబ్బంది సామాజికవర్గ బృందాలను సమీకరించి విస్తృతమైన సంబంధాల ద్వారా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు (పి.హెచ్.సి.) సామాజిక ఆరోగ్యకేంద్రాలు (సి.హెచ్.సి.) మరియు జిల్లా ఆరోగ్య కేంద్రాలు (డి.హెచ్.సి.ఎస్.)ను నిర్వహించారు. అందువల్ల భారతదేశం మిగిలిన రాష్ట్రాలతో పోల్చినప్పుడు తమిళనాడు చాలా తక్కువ తలసరి ఆదాయపు ఖర్చుతో వైద్యంలో మెరుగైన ఫలితాలను అందుకునే వైపుగా ఉందని 2011లో జీన్ డ్రెజ్ మరియు అమర్త్యసేన్ వ్రాశారు.

బాగా తక్కువగా తెలిసిన, ఎక్కువగా గుర్తింపు పొందని, విశ్వజనీన సామాజిక విధానాలను సమీకృతం చేయడం ద్వారా క్రమంగా తమిళనాడు ఆరోగ్యరంగంలో ఉనికిలోకి వచ్చింది. చాలా రాష్ట్రాలు అంతగా ఇష్టపడని తమిళనాడు, విస్తృతమైన సంబంధాలు కలిగిన ప్రభావవంతమైన, సజీవమైన ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, అన్ని సామాజిక వర్గాల అండదండలతో, అందుబాటులో మంచి ఆరోగ్య కేంద్రాలను ఉంచగలగడం, ఉచితంగా అందించడం తమిళనాడులో ఉంది. దశాబ్దాల తరబడి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రాష్ట్రం మంచి స్థితికి చేరగా 'నీట్' ఒక్క దెబ్బతో వీటన్నింటిని తలక్రిందులు చేసిపారేసింది.

**ఆరోగ్య ఫలితాలు...**

తమిళనాడు అత్యధిక ఆరోగ్య సూచికల్లో మంచి సామర్థ్యాన్ని చూపుతుంది. సామాజిక సమీకరణతో కూడిన సృజనాత్మక సాంకేతిక పరిజ్ఞానం దీనికి కారణంగా ఉన్నది. భారత దేశంలో అతి తక్కువ శిశు మరణాల రేటు కలిగి ఉన్న రాష్ట్రం తమిళనాడు అని, ఎస్.ఆర్.ఎస్. గణాంక నివేదిక (2015) తాజాగా ఇచ్చిన రిపోర్టులో పేర్కొన్నారు. వెయ్యి మందికి 19 మంది పిల్లల మరణాలతో కేరళ తర్వాత రెండవస్థానంలో ఉన్నది.

మిగిలిన మొత్తం భారతదేశంలో శిశు మరణాల రేటు ప్రతి 1000 మందిలో 37గా ఉన్నది. (సజీవంగా పుట్టి 5 సం॥ల లోపు మరణించే పిల్లల రేటును శిశు మరణాల రేటుగా లెక్కిస్తారు). అదేవిధంగా తమిళనాడులో మాతృ మరణాల రేటు (ఎం.ఎం.ఆర్.) సం॥కి సజీవంగా జన్మనిస్తున్న లక్ష ప్రసవాల్లో ఏ కారణంతోనైనా లేదా అత్యధికంగా గర్భంతో ముడిపడిన కేసులకు సంబంధించి కాని భారతదేశంలోనే అతి తక్కువగా, దేశ సగటులో కేవలం సగం మాత్రమే తమిళనాడులో ఉన్నాయి. తమిళనాడు భారతదేశంలో అత్యుత్తమ పునరుత్పత్తి ఆరోగ్యం, శిశుసంరక్షణ వ్యవస్థలు కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్నది. ఆరోగ్య వసతులతో ప్రసవాలు జరుగుతున్న మహిళల శాతం తమిళనాడులో 99 శాతంగా ఉన్నది. ఇది భారతదేశంలోనే అత్యధికం. సామాజిక ఐక్యతతో ఈ ఫలితాలు సాధించబడ్డాయి. బహుశా దేశంలోనే ఇవి సమగ్రమైనవిగా చెప్పవచ్చు.

**సామాజిక సమగ్రత**

వినూత్నమైన, ప్రోత్సాహకరమైన నిర్మాణాలు, రిజర్వేషన్ విధానాల ద్వారా, అన్ని సామాజిక వర్గాల బృందాలకు ఆరోగ్య సిబ్బందిలో ప్రాతినిధ్యం ఉండేలా, ఉత్సాహపూరితమైన కార్యకర్తలతో వైద్యం అందరికీ అందేలా తమిళనాడు చేసింది. చిన్న పట్టణాల నుంచి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేయడానికి సుముఖత వ్యక్తం చేసిన కార్యకర్తలను తీసుకుంది. దాని ఫలితంగా అనేక ఆరోగ్య సూచికల్లో సామాజికవర్గాల బృందాలను కలుపుకొని, ఉత్తర భారతదేశంలోని అగ్రవర్ణ సామాజిక వర్గ బృందాలలో కంటే తమిళనాడు మెరుగైన ఫలితాలను సాధించింది.

ఉదాహరణకు, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-3 (2005-06) ప్రకారం, సామాజికవర్గాల వారీగా అందుబాటులో ఉన్న ఆరోగ్య సూచికల ప్రకారం, తమిళనాడులో షెడ్యూలు కులాలలో ప్రతి 1000 మంది శిశువుల్లో మరణాల రేటు 37గా ఉంటే, మొత్తం భారతదేశంలో ఈ రేటు 66గా ఉన్నది. దీనిని

> **❝సాధారణంగా షెడ్యూలు సామాజిక వర్గాల నుంచి వచ్చిన 80 శాతం మంది మహిళలు తమిళనాడులో మెరుగైన ఆరోగ్య సంరక్షణ వసతులు పొందుతూ ఉండగా, ఉత్తరప్రదేశ్‌లో షెడ్యూల్ కులాల్లో 15.80 శాతం మంది ఉన్నత కులాల్లో 21.80 శాతం మంది మాత్రమే పొందుతున్నారు.❞**



తమిళనాడు ప్రభుత్వ మెడికల్ కాలేజీ

ఉత్తరప్రదేశ్‌తో పోల్చి చూసినట్లయితే శిశు మరణాల రేటు షెడ్యూలు కులాల్లో 90.7 శాతంగా ఉన్నది. తమిళనాడులో ఉన్నత కులాల్లో శిశు మరణాల రేటు 38.2 శాతం కాగా, ఇది ఉత్తరప్రదేశ్‌లో 71 శాతంగా ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నత కులాల్లో శిశు మరణాల కంటే తమిళనాడులో షెడ్యూలు కులాల్లో శిశు మరణాల రేటు తక్కువగా ఉన్నది. అక్కడ అది 71 శాతంగా ఉన్నది.

చివరికి పిల్లల వ్యాధి నిరోధక శక్తిని పెంచే విషయంలో, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన సూచికల్లో కూడా వెనుకబడిన సామాజిక వర్గాలు కూడా తమిళనాడులో ఉత్తరప్రదేశ్‌లోని అగ్రకులాల్లో కంటే మెరుగైన ఫలితాలను పొందుతున్నాయి. పిల్లలకు వ్యాధి నిరోధక కార్యక్రమాలను వర్తింపజేయడంలో తమిళనాడు 81 శాతంగా ఉంటే, ఉత్తరప్రదేశ్ 23 శాతంతో పనికిమాలినదిగా ఉన్నది. అదే సమయంలో తమిళనాడులో 88 శాతం గర్భిణీ స్త్రీలు ఆరోగ్య వసతులు కలిగిన కేంద్రాల్లో ప్రసవిస్తూ ఉండగా, ఉత్తరప్రదేశ్‌లో ఇది కేవలం 21 శాతంగానే ఉన్నది. సాధారణంగా షెడ్యూలు సామాజిక వర్గాల నుంచి వచ్చిన 80 శాతం మంది మహిళలు తమిళనాడులో మెరుగైన ఆరోగ్య సంరక్షణ వసతులు పొందుతూ ఉండగా, ఉత్తరప్రదేశ్‌లో షెడ్యూల్ కులాల్లో 15.80 శాతం మంది ఉన్నత కులాల్లో 21.80 శాతం మంది మాత్రమే పొందుతున్నారు.

మరొక సూచిక అయిన స్త్రీ, శిశు ఆరోగ్య సంరక్షణ దామాషాగా చూసినప్పుడు ఆరోగ్య నిపుణుల (డాక్టరు, నర్సు లేక మంత్రసాని) సహాయంతో జరుగుతున్న కాన్పులు, గర్భిణీ స్త్రీలకు వైద్య సిబ్బంది ద్వారా కల్పించబడుతున్న సహాయం తమిళనాడులో 91 శాతం కాగా, ఉత్తరప్రదేశ్‌లో కేవలం 27 శాతం మాత్రమే. ఈ రకమైన సహాయం ఎస్.సి. మహిళల్లో తమిళనాడులో 82 శాతం ఉండగా, ఉత్తరప్రదేశ్‌లో అగ్రకులాల మహిళల్లో కేవలం 40 శాతం, అతి తక్కువగా ఎస్.సి. మహిళల్లో 20 శాతంగా మాత్రమే ఉంది. ఈ రకంగా అన్ని ఆరోగ్య సూచికల్లో అన్ని సామాజిక వర్గ బృందాల్లో తమిళనాడు అద్భుతమైన ప్రగతిని సాధించింది. రాష్ట్రంయొక్క సృజనాత్మకమైన ప్రోత్సాహక నిర్మాణాలు మరియు సామాజిక న్యాయ విధానాల ఫలితాలు అందరికీ అందే విధంగా తీసుకున్న చర్యల ఫలితంగానే ఈ రకమైన ఫలితాలు వస్తున్నాయి.

తమిళనాడులో ఇలా ఎందుకు జరుగుతుంది

ప్రజారోగ్యంలో తమిళనాడు ఈ రకమైన ఫలితాలు సాధించడం అనేది దానికోసం పెట్టే ఖర్చు మొత్తం ప్రభుత్వం పెట్టడంలోనే ఉంది. చాలా దీర్ఘకాలం నుంచి నిలకడగా ఆరోగ్యం మీద రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెడుతున్న మాట వాస్తవం. మొత్తం భారతదేశంలోనే తలసరి ఆరోగ్య వ్యయం విషయంలో అన్ని రాష్ట్రాల కంటే తమిళనాడు అత్యధికంగా ఖర్చు పెడుతున్న మాట వాస్తవం. ఉదాహరణకు: ఇటీవల తమిళనాడు ఆరోగ్య గణాంక వివరాల నివేదిక ప్రకారం 2013-14లో తలసరి వ్యయం 1254 రూ॥లుగా ఉండగా, మిగిలిన భారతదేశపు వ్యయం 1042/- రూ॥లుగా మాత్రమే ఉన్నది. హర్యానా లాంటి ఇతర రాష్ట్రాలు ఆరోగ్యం మీద ఎక్కువ ఖర్చు పెడుతున్నప్పటికీ, ఆరోగ్య ఫలితాలను పొందడంలో తమిళనాడు వాటిని తలదన్నే విధంగా ఉన్నది' అని అమర్త్యసేన్, జీన్‌డ్రెజ్ వాదిస్తారు. ఆరోగ్య సేవలను, ఆరోగ్య ఫలితాలుగా మార్చే దాంట్లో ఈ తర్కం ఉంది. ప్రభుత్వ నిధులను ఉపయోగించే పద్ధతి, ప్రభుత్వ ఆరోగ్య సేవలను అందరికీ అందుబాటులో ఉంచే పద్ధతి ఈ రెండూ కలిసి ఫలితాలను నిర్ణయించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

గ్రామీణ తమిళనాడు విషయంలో మరి కొంత అదనపు వివరణ ఇవ్వవలసి ఉంది. వృత్తి విద్యను అమలు చేసేదాంట్లో అనుసరించిన రిజర్వేషన్ విధానం అన్ని సామాజిక వర్గాల నుండి వైద్యులను తయారుచేసే విధంగా ఉన్నది. ఆరోగ్య సేవలు సమగ్రంగా సమాజంలో అందరికీ అందుబాటులో ఉండడానికి ఈ విధానమే ముఖ్యమైన కారణంగా ఉన్నది.

అదే సమయంలో దానికి సమాంతరంగా, రాష్ట్రం ఏర్పాటు చేసిన ఆరోగ్య మౌలిక వసతులు, నైపుణ్యంతో కూడిన విధానాలు, ప్రాధాన్యతా నియమాలతో ప్రణాళికాయుతంగా ప్రాథమిక మరియు తృతీయ ఆరోగ్య సంరక్షణ అందరికీ అందేటట్లు చేసింది.

తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ముందుగా

ఆరోగ్యంమీద పర్యవేక్షణా యంత్రాంగంతో మాల్కోమ్ ఆదిశేషయ్య అధ్యక్షతన ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఆరోగ్య సేవలతో సమస్యలను తీవ్రంగా పరిగణించి, దానికదే పనిచేసే కొన్ని విభాగాలను ఏర్పరిచింది. ఆరోగ్య సేవలు, వైద్య విద్య, కుటుంబ నియంత్రణ, పౌష్టికాహారం, పారిశుధ్యం, స్వచ్ఛంద సంస్థల పాత్ర, హోమియోపతి లాంటి దేశీయ వైద్యం, మందులు తదితరాలను ఏర్పాటు చేసింది.

తరువాత రాష్ట్రం 22 వైద్యకళాశాలలను ఏర్పాటు చేసింది. ఏ రాష్ట్రంలోలేని విధంగా దేశంలోనివైద్య కళాశాలలలో 11.9 శాతం రాష్ట్రంలోనే ఏర్పాటు చేసింది. మహారాష్ట్రలో కళాశాలల శాతం 10.8 గా ఉన్నది. భారత దేశంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు పొందడంలో అత్యధికంగా తమిళనాడు రాష్ట్రం 11.1 శాతం వాటాను కలిగి ఉంది.

**ప్రజారోగ్యానికి వ్యతిరేకంగా నీట్**

గ్రామీణ వైద్యవ్యవస్థలో వైద్యులను నిలకడగా ఉండేటట్లు చేయడానికి తమిళనాడు వినూత్న ప్రోత్సాహక నిర్మాణాన్ని తయారు చేసింది. భిన్నమైన సామాజిక పరిస్థితులు కలిగిన గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేయడానికి వైద్య అధికారులు అంగీకరించడం ఈ కీలకమైన ఫలితంలో ఒక ప్రధానమైన అంశం. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇతర రాష్ట్రాలతో పోల్చితే మంచి పరికరాలను కలిగి బాగా పనిచేసేవిగా ఉన్నాయి. డాక్టర్లకు మరొక ముఖ్యమైన ప్రోత్సాహకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా జిల్లా వైద్యశాలల్లో కనీసం 2 సం॥లు సర్వీసు పూర్తిచేసిన వారిని 'ప్రాధాన్యతా కోటా' క్రింద తీసుకోవడం. ప్రభుత్వంచేత నడపబడుతున్న అన్ని మెడికల్ కళాశాలల్లో 50 శాతం మందిని పోస్ట్ గ్రాడ్యుయేట్ కార్యక్రమాలకు ఇన్‌సర్వీస్ కోటా క్రింద ప్రభుత్వం తీసుకుంటుంది, సూపర్ స్పెషాలిటీ కోర్సులలో కూడా ఇది అమలు చేయబడుతుంది. 'ఇన్ సర్వీస్'వారికి ఆఖరికి ప్రైవేటు కళాశాల్లో కూడా ప్రభుత్వం సీట్లు కేటాయించడం జరుగుతుంది.

వైద్య విద్య ప్రవేశ పద్ధతులలో ఆ రకమైన ప్రోత్సాహక విధానాలు, రాష్ట్ర వైద్య రంగంలో వైద్యులను నిలిపి ఉంచడాన్ని గ్యారంటీ చేసింది. ప్రత్యేక నిపుణులుగా ఉన్నవారిని, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఎవరు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారో వారందరినీ నిలకడగా ఉంచింది. ఉదాహరణకు 2015–16లో (నీట్‌కు ముందు) (రాష్ట్ర కోటాలో 50 శాతం మంది) ప్రభుత్వ కళాశాల్లో ఇన్‌సర్వీస్ కోటా క్రింద

**❝ రాష్ట్ర కోటాలో 50 శాతం మంది ప్రభుత్వ కళాశాల్లో ఇన్‌సర్వీస్ కోటా క్రింద ఎం.డి./ఎం.ఎస్. పూర్తి చేసిన కనీసం 300 మంది డాక్టర్లు గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో పనిచేయడానికి వెళ్ళారు. ప్రైవేటు కళాశాలల్లో ప్రభుత్వ వాటా సీట్లను కూడా కలిపినట్లైతే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. ❞**



ఎం.డి./ఎం.ఎస్. పూర్తి చేసిన కనీసం 300 మంది డాక్టర్లు గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో పనిచేయడానికి వెళ్ళారు. ప్రైవేటు కళాశాలల్లో ప్రభుత్వ వాటా సీట్లను కూడా కలిపినట్లైతే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. దీనికి సమానమైన ప్రోత్సాహక నిర్మాణాలు సూపర్ స్పెషాలిటీ కోర్సులైన డి.ఎం./ఎం.సిహెచ్.లలో కూడా అమలు చేయబడినాయి. సామాజిక సమీకృత ఆరోగ్య ఫలితాలకు కారణమైన, అత్యంత సమర్ధవంతంగా పనిచేసే ఈ రకమైన అన్ని ప్రోత్సాహక నిర్మాణాలను పక్కదారి పట్టించే విధంగా 'నీట్' ఉన్నది.

ఆరోగ్య వ్యవస్థను కార్పొరేటీకరణ చేసేటందుకు ప్రారంభదశగా నీట్‌ను ప్రవేశ పెట్టడం జరిగింది. సమర్ధవంతమైన ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ ఉన్నప్పటికీ, రాష్ట్రం ప్రైవేటీకరణ వైపు మొగ్గుచూపడం ఇటీవలి కాలంలో మనం చూస్తాం. కార్పొరేట్ శక్తులు ప్రధానంగా వైద్యరంగంలోకి చొచ్చుకువస్తున్నాయి. ఉదాహరణకు అపోలో భారతదేశపు మొట్టమొదటి ప్రైవేటు లిమిటెడ్ హాస్పటల్. 'విజయవంతమైన ప్రైవేటు ఆరోగ్య సంరక్షణ విధానం అనే కల్పిత కట్టుకథల తయారీ' ద్వారా దీని ఏర్పాటు జరిగింది. ఇది సూపర్ స్పెషాలిటి వైద్య కేంద్రాన్ని కార్పొరేట్ మార్గంలో ఎలా నడపాలి అనే దాంట్లో ఒక స్పష్టత కల్పించింది. రాష్ట్రంలో వైద్య సంరక్షణను కార్పొరేటీకరణ చేయడానికి 'నీట్' ఒక అదనపు ఆయుధంగా ఉపయోగపడుతుంది.

పదే పదే మెట్రోపాలిటన్ నగరాల్లో ఉన్న కోచింగ్ సెంటర్లకు అన్ని వైపుల నుంచి పెద్దమొత్తంలో డబ్బు, ఇతర వనరులను ఖర్చుపెట్టి వస్తున్న నీట్ ఆశావహుల యొక్క కలలు, అపోలోలాంటి ప్రపంచస్థాయి కార్పొరేట్ ఆసుపత్రుల కలలకు నీట్ అనుకూలంగా ఉంటుంది. నీట్‌కు అర్హత సాధించలేకపోయి ఆత్మహత్యలకు పాల్పడిన ఒక దళిత శ్రామికుడి కుమార్తె అయిన అనితలాంటి విద్యార్థుల కలలు నీట్‌ద్వారా నీరుగారిపోతాయి.

మొత్తంమీద ఆరోగ్యరంగంలో తమిళనాడు సాధించిన అన్ని విజయాలను వెనక్కు నెట్టేశక్తి నీట్ కలిగి ఉన్నది. సంవత్సరాల తరబడి కష్టమైన కృషితో నిర్మించబడిన వైద్య ఆరోగ్య సిబ్బంది దాడికి గురవుతుంది. తన పౌరులకు బాధ్యతాయుతమైన ఆరోగ్య పంపిణీ విధానం, సంస్థాగతమైన కట్టుబాట్లు తదితరాలు త్వరలోనే కనుమరుగవుతాయి. నీట్ అనేది వైద్యరంగంలో సామాజిక కృషిపై ఎక్కుపెట్టిన దాడి. సామాజిక సంక్షేమ దృష్టితో కొనసాగుతున్న వైద్యరంగాన్ని ఇది సర్వనాశనం చేస్తుంది.

**(అనువాదం: కె. నాగమల్లేశ్వర రావు)**

# బూర్జువా పార్టీల్లాగా సిపిఎం అధికారంకోసం ప్రజలను మభ్యపెట్టదు

సందేహాలు సమాధానాలు



- బి.వి.రాఘవులు

**1. రాష్ట్రంలో వున్న అధికార ప్రతిపక్ష పార్టీలు రెండూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పాదయాత్రలకు సిద్ధమౌతున్నాయి. మన పార్టీ కూడా అటువంటివి ఎందుకు చేయడం లేదు?**

మన రాష్ట్రంలో పాదయాత్రలు కొత్తేమీకాదు. గతంలో కాంగ్రెస్, టిడిపి, వైఎస్సార్‌సిపి నాయకులు సుదీర్ఘ పాదయాత్రలు చేశారు. ఇప్పుడు కూడా మరలా సిద్ధం అవుతూ ఉండవచ్చు. ప్రజలను ఆకర్శించడానికి వారు ఆమాత్రం శారీరక ఇబ్బందికి సిద్ధం కావడాన్ని ఆహ్వానించాల్సిందే. కానీ వారు ఎన్ని యాత్రలు చేసినా, ప్రజలనుండి దరఖాస్తులు స్వీకరించినా, వారి విధానాలు మాత్రం ధనవంతులకు, పాలకపార్టీల నాయకులకు ఉపయోగపడే విధంగా ఉంటాయనేది గత అనుభవం. ఇప్పుడు కూడా అందుకు భిన్నంగా ఏమీ ఉండదు. సిపిఐ(యం) వరకు వస్తే, గతంలో సిపిఐ(యం) ప్రజలను కలుసుకునేందుకు, ప్రజా ఉద్యమాలు పురిగొల్పేందుకు అనేక దఫాలు జిల్లా వ్యాపిత, రాష్ట్రవ్యాపిత పాదయాత్రలను నిర్వహించింది. జిల్లాల సమగ్రాభివృద్ధికోసం, సామాజికన్యాయం కోసం, నీటిపారుదల ప్రాజెక్టులకోసం ఇవి జరిగాయి. రాష్ట్ర విభజన తరువాత రెండు రాష్ట్రాల్లో ఇటువంటి పాదయాత్రలు అనేకం జరిగాయి. తెలంగాణాలో సామాజిక న్యాయం కోసం 4000 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర పార్టీ ఆధ్వర్యంలో ఈ మధ్య జరిగింది. సిపిఐ(యం) ఉద్యమంకోసం, ప్రజలకోసం పాదయాత్రలు నిర్వహిస్తుంది. బూర్జువా పార్టీలలాగా అధికారంకోసం ప్రజలను మభ్యపెట్టేందుకు కాదు. భవిష్యత్తులోనూ అవసరమనుకున్నప్పుడు పాదయాత్ర రూపాన్ని పార్టీ తప్పకుండా వినియోగిస్తుంది.

**2. గ్లోబల్ సంపన్న వర్గాల జాబితాలో చైనీయులు ఉన్నారు. అక్కడ కమ్యూనిస్టు ప్రభుత్వం వారిని ఎందుకు నియంత్రించడం లేదు?**

ప్రపంచస్థాయి సంపన్నులలో చైనీయులు కూడా కొంతమంది వున్నారు. చైనాలో మార్కెట్ సంస్కరణలు ప్రవేశపెట్టిన తరువాత ప్రయివేటు సంస్థలను ప్రారంభించేందుకు, నడిపేందుకు అవకాశం కలిగింది. ఇందు మూలంగా ఒక సంపన్నవర్గం ఆవిర్భవించింది. ఆర్థిక వ్యత్యాసాలు కూడా తీవ్రమయ్యాయి. అయితే ఈ ఆర్థిక వ్యత్యాసాలు మిగిలిన దేశాలతో పోల్చుకున్నప్పుడు చైనాలో తక్కువ. ఈ మధ్య థామస్ పికెటి అనే ఆర్థిక శాస్త్రవేత్త చేసిన అధ్యయనం ప్రకారం మనదేశంలో ఎగువనున్న ఒక్కశాతం కుటుంబాల చేతిలో 22 శాతం ఆదాయం కేంద్రీకరించబడింది. ఎగువ ఒక్కశాతం, దిగువ 50శాతం ప్రజలమధ్య ఆదాయ వ్యత్యాసం మనదేశంలో 13 రెట్లు వుండగా చైనాలో ఆతేడా 6 రెట్లు మాత్రమే వుంది. అమెరికాలోనైతే ఈ వ్యత్యాసం 77 రెట్లు వున్నది. వ్యత్యాసం ఎక్కువా, తక్కువా అన్నది అటుంచితే సంపన్నుల పెరుగుదల సోషలిజం నిర్మాణానికి నష్టమా? కాదా? సంపన్నుల పెరుగుదలను ఎలా చైనా కమ్యూనిస్టు పార్టీ ఎలా అరికడుతుంది అన్న ముఖ్యమైన ప్రశ్నలు. ఆర్థిక తారతమ్యాల పెరుగుదలను చైనా కమ్యూనిస్టు పార్టీ గమనిస్తున్నది. ఇప్పటికీ సోషలిస్టు ఆర్థిక ప్రక్రియే ప్రధానంగా వుందని, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ పర్యవసానాలు అదుపులో వున్నాయని, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందే కొద్దీ అధిక వ్యత్యాసాలను తగ్గించి తుదకు నిర్మూలించే వైపుకు వెళతామని చైనా కమ్యూనిస్టు పార్టీ చెబుతున్నది. చైనా పార్టీ చెప్పినట్లుగా జరిగితే సోషలిజం బలపడు తుంది. లేకపోతే ఇబ్బందులెదురుకావచ్చు.

❋

# వర్గ పోరాటం అదనపు విలువ పంపిణీ

(26వ పేజీ తరువాయి)

పోరాటాలు తీవ్రం అవుతుంటే తప్పనిసరి పరిస్థితులలో మాత్రమే వారికి కొన్ని హక్కులు ఇవ్వటానికి అంగీకరిస్తారు.

**పోరాటాలతోనే కార్మికుల వాటా పెరుగుతుంది**

కార్మికుల సంఘటిత శక్తి స్థాయి ఉత్పత్తి చేసిన విలువలో వారి వాటాను నిర్ణయి స్తుంది. కార్మికులు బలంగా సంఘటితమై ఉంటే అదనపు విలువలో వారికి దక్కేవాటా పెరుగుతుంది. వారి సంఘటితశక్తి బలహీనంగా ఉంటే వారికి లభించే వాటా తగ్గుతుంది. మొత్తం ఉత్పత్తిలో ఉన్నతస్థాయిలో ఉన్న ఒక శాతం ధనికుల సంపద క్రమంగా పెరుగుతూ కార్మికులు, ఇతర శ్రామిక ప్రజల సంపద తగ్గుతున్నది. 2010లో పై స్థాయిలోని ఒకశాతం ధనికుల సంపద 40.3 శాతం ఉండగా, 2014 నాటికి 49 శాతానికి చేరింది. 2015లో 53 శాతానికి, 2016లో 58.4 శాతానికి పెరిగింది. 2010 నుండి 14 వరకు నాలుగు సంవత్స రాలలో 8.7 శాతం పెరగగా, 2015 -16 రెండు సంవత్సరాలలో 9.4 శాతం పెరిగింది. మరో వైపు దిగువస్థాయిలోని 50 శాతం మంది వద్ద 1.80 శాతం సంపద మాత్రమే ఉన్నది. దేశసంపదను ధనికులకు కట్టబెట్టే విధానాలలో కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల మధ్య వ్యత్యాసం లేదని, బిజెపి పాలనలో ఈ క్రమం మరింత వేగం పుంజుకున్నదన్న విషయాన్ని కూడా పై వివరాలు స్పష్టం చేస్తున్నాయి.

అందువలన తాము ఉత్పత్తి చేసిన అదనపు విలువలో కార్మికవర్గం పొందేవాటా పెరగాలంటే ఆ వర్గాన్ని ఐక్యం చేయటానికి, పోరాటాలను ఉధృతం చేయటానికి నిరంతరం కృషిచేయాలి. వర్గ పోరాటాలు తీవ్రమౌతున్న క్రమంలోనే కార్మికులు పొందేభాగం పెరుగుతుంది. పోరాటాలు పెరిగే క్రమంలోనే కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్న పెట్టుబడిదారుల ప్రయత్నాలను తిప్పికొట్టటం, సమాజంలో విస్తరిస్తున్న మూఢ విశ్వాసాలు, అశాస్త్రీయ భావాలను వెనక్కుకొట్టటం సాధ్యం అవుతుంది. పెట్టుబడిదారీ వర్గం చేతిలో అధికారం ఉన్నంత వరకు ఎంత బలమైన పోరాటాలు చేసినా కార్మికవర్గంపై జరుగుతున్న దోపిడీని పూర్తిగా నిర్మూలించటం సాధ్యం కాదు. దోపిడీ వర్గాలను అధికారం నుండి తొలగించి, కార్మికవర్గం పాలకవర్గం అయినపుడు మాత్రమే దోపిడీని అంతం చేయటం సాధ్యం అవుతుంది. ఆ లక్ష్యసాధన కోసం కార్మికవర్గాన్ని ఐక్యం చేయటానికి, వర్గ పోరాటాలను ఉధృతం చేయటానికి పూనుకోవాలి. ❋

# దోపిడి వర్గాల మెడలు వంచిన ఆదివాసుల పోరాటం

(2వ పేజీ తరువాయి)

ఈ మెలకువకు, సమర్థతకు నేను రిచ్చబోయాను. ఊహించడానికి కూడా సాధ్యం కాని విషయం. ఒక్క మెయిన్ స్విచ్ ఆపుచేస్తే ఒక ప్రాంతంలో లైట్లు అన్ని ఎలా ఆరిపోతాయో, అలాగే దహనులో సమ్మె నిర్ణయం తీసుకోగానే దాని చుట్టూ మైళ్ల తరబడి అడవులలో పని ఆగిపోయింది.

బండ్లు అపేయ్యాలి అనే నిర్ణయం ఆదివాసులు తమంతగా తీసుకున్నది. నిరసన చిహ్నం అది. కిసాన్ సభ బండ్లు ఆపేందుకు పిలుపు ఇవ్వలేదు అనే వాదనతో వ్యాపారులు, కాంట్రాక్టర్లు, భూస్వాములు బండ్లు మరలా కట్టించేందుకు వారి శక్తీ కొద్దీ ప్రయత్నించారు. ఆదివాసులకు రేషన్‌షాపుల అనుభవం ఉంది. అక్కడ పర్మిట్ లేని వారికి వస్తువులు ఇవ్వని విషయం వారికి తెలుసు. ఆ అనుభవంతో వారు సహేతుకమైన రేట్లకు బండ్లుకట్టమని కిసాన్‌సభ నుండి అనుమతి తెచ్చుకోవాల్సిందిగా వ్యాపారులకు, కాంట్రాక్టర్లకు చెప్పారు. అలా అనుమతి పత్రాలను తెచ్చుకుంటేనే ఎడ్లబండ్లు కట్టే విషయం ఆలోచిస్తామని చేప్పేవారు.

ఈ సమయంలో దహనులో పాటిల్ ఇంట్లో వుండే మా ఆఫీసుకు పనివుండి ఒకసారి వెళ్లాను. కామ్రేడ్ కామా రణదివే ట్రంకు పెట్టే ముందు పద్మాసనం వేసుకుని కూర్చుని, ఏదో అతి తొందరగా రాసేస్తున్నాడు. అక్కడ ఎదురుచూస్తు నిల్చుని వున్న భూస్వాములకు కాగితపు చీట్లు ఇస్తున్నాడు. ఎందుకు అంత ఓపికగా కాచుకుని వున్నారో అర్థం కాలేదు. వారంతా వెళ్లిన తర్వాత కామ్రేడ్ కామా రణదివే విషయం వివరించాడు. కిసాన్‌సభ డిమాండ్ ప్రకారం కూలీ ఇచ్చేందుకు కొందరు భూస్వాములు అంగీకరించారు. ఎర్రజెండా అనుమతి పత్రం వుంటే తప్ప అలాంటి వారికి కూడా గడ్డికోయమని ఆదివాసులంటున్నారు. ఆదివాసుల ఎడ్లబండి బాడుగకు తీసుకెళ్లేందుకు కూడా అనుమతి పత్రం కావాలి. అందువల్ల భూస్వాములకు మా ఆఫీసుకు రాక తప్పలేదు. నష్టాలు భరించేందుకు ఇష్టపడని, లేక శక్తిలేని భూస్వాములు కిసాన్ సభ అడిగిన కూలి ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. అలాంటి వారికి అనుమతి పత్రాలు ఇస్తున్నారు. వారు కూలీలను వినియోగించుకోవచ్చు. అలాంటి యజమానులకు గడ్డికోయవచ్చని ప్రకటన చేసేవారు.

సమ్మె శాంతియుతంగా సాగుతున్నది. భూస్వాములు, వడ్డీ వ్యాపారులు గత సంవత్సరం లాగే కుట్రలు పన్నడం ప్రారంభించారు. రైతాంగానికి వ్యతిరేకంగా పోలీసు కేసులు పెడుతున్నారు.

ప్రభుత్వం, భూస్వాములు కూడా 144 సెక్షన్ విధించేందుకు ఒక సాకుకోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. దాని చాటునవారు అనుకున్న అక్రమాలు సాగించవచ్చని వారి ఆలోచన. కన్నాలు వేశారని, దొంగతనాలు చేశారనే తప్పుడు ఆరోపణలలో రెమ్‌టైల్ గ్రామం, ఆ చుట్టుపట్లా 55 మంది ఆదివాసులను పోలీసు ఆధీనంలో ఉంచారు. తమ అమాయక సోదరులను అన్యాయంగా అరెస్టు చేయడంతో ఆదివాసు



లలో క్రోధం కలిగింది. జైలుపైకి వెళ్లి అరెస్టు అయినవారిని విడుదల చేయించుకునే ఉద్దేశ్యంతో వేలాది మంది ఆదివాసులు దహనూకు బయలుదేరారు. ఈ విషయం కామ్రేడ్ కామా రణదివేకు తెలిసింది. ఎలాంటి దుర్ఘటన జరగకుండా నివారించేందుకు ఆయన వారిని త్రోవలోనే కలిసాడు. ఇండ్లకు తిరిగి వెళ్లమని వారికి విజ్ఞప్తి చేశాడు. ఎర్రజెండాపైన, దాని ఆజ్ఞలమీద, ఆదివాసులకు గల తిరుగులేని విశ్వాసం మూలంగానే వారు తిరిగి వెళ్లారు. ఇలా ఆదివాసులను రెచ్చగొట్టే ప్రయత్నాలు విఫలం కావడంతో, వారిపై దమనకాండ ప్రారంభించారు. సన్‌జాన్ వద్ద ఒక ఆదివాసిని విపరీతంగా కొట్టారు. నాలుగురోజుల తర్వాత అతను ఆ దెబ్బల వల్ల ఆసుపత్రిలో మరణించాడు. ఆదివాసులు, భూస్వాముల వలలో పడలేదు. నిర్ణయించిన కార్యవిధానాన్ని తూచా తప్పక అమలు జరిపారు. రోజులు గడిచాయి. సమ్మె సాగుతోంది. గడ్డికోత జరగలేదు. సమ్మె ధోరణిని గమనించారు కొందరు భూస్వాములు. మా కూలి డిమాండ్లను అంగీకరిస్తూ వ్యక్తులుగా ఒప్పందాలకు వచ్చారు. ఆదివాసులపై మోపిన కేసులు ఉపసంహరించుకున్నారు. అయితే ఆదివాసులు ఇంతటితో సంతృప్తి పడలేదు. మొదట తమ మీద అక్రమ కేసులు బనాయించినందుకు పరిహారంగా జరిమానాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ మొత్తం ఎంతో గ్రామస్థులు నిర్ణయిస్తారు. ఆ మొత్తం గ్రామానికి చెల్లించాలి. కొందరు భూస్వాములు ఈ షరతుకు కూడా అంగీకరించారు. గడ్డి చేలో వుంచుకొని వేలు నష్టపడడం కన్నా 100 నుండి 500 వరకూ వుండే జుల్మానా చెల్లించడం మంచిదని వారు భావించి వుండాలి. క్రమేణా మిగతా భూస్వాము లంతా వీరిని అనుసరించారు. కిసాన్‌సభ డిమాండ్ చేసిన కూలిని చెల్లించారు. జగత్ కిషోర్ వంటి కోటీశ్వరులు మాత్రం తమ వాదనకు కట్టుబడి వుండిపోయారు. మిగతా వారంతా కలెక్టర్ ప్రకటించిన అధికార కూలిని విస్మరించారు. కోటీశ్వరులు మాత్రం ప్రభుత్వ మద్దతుతో నిర్బంధంగా తమపని చేయించుకోవాలని నిశ్చయించుకున్నారు. ఈ విధానం వల్ల వాటిల్ల గల నష్టాన్ని భరించేందుకు వారు సిద్ధపడ్డారు. ఏ పరిస్థితి లోనూ కిసాన్‌సభ డిమాండ్‌చేసిన కూలి ఇవ్వ రాదని ప్రతిజ్ఞబూనారు. అన్నిరకాల నిర్బంధపు ఎత్తుగడలు అవలంభించారు. ప్రతిసారి విఫలం చెందారు. వారి గడ్డి ఎవరూ కోయలేదు.

అటవీ కార్మికులు సమ్మె ప్రశాంతంగా సాగుతోంది. వ్యాపారస్తులు ఈ వ్యాపారంలో రెండున్నర కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టారు. సమ్మె విరమించే సూచన కనిపించలేదు. వేలాది రూపాయలు నష్టం రాబోతుందనే ఆలోచనతో వ్యాపారస్తులు సతమతం కావడం ప్రారంభమైంది. ఈ వాతావరణం సంప్రదింపులకు అనుకూలంగా వుందని భావించి వెల్‌ఫేర్ ప్రాంత్ అధికారి శ్రీ ఎ.హెచ్ ఖాన్ సంప్రదింపులకు ఏర్పాటు చేశాడు. వ్యాపారుల తరపున కలప వ్యాపారుల సంఘ అధ్యక్షులు శ్రీ బాబూ భాయ్ ఫాండా, ఆయన సహచరులు, కిసాన్ సభ తరపున నేను, కామ్రేడ్ పరులేకర్ ఈ సంభాషణల్లో పాల్గన్నాం. పీస్ రేట్‌తో గాని, కూలిగానీ ఎలా పనిచేసినా తలకు రోజుకు 1.25 లు కూలి వచ్చే పద్ధతిని రూపొందించాం.

పనిచేస్తున్న సందర్భంలో దెబ్బ తగిలినా, పనిచేయలేని స్థితి వచ్చినా నష్టపరిహారం ఇవ్వడం వంటి కొన్ని ఇతర డిమాండ్లపైన ఒప్పందం కుదిరింది. ఈ డిమాండ్లను పొందుపరుస్తూ ఒప్పందం రాశారు. కిసాన్‌సభ తరపున దహను ప్రముఖుడు, ఆ సంఘ అధ్యక్షుడు అయిన శ్రీ పిపాండా, వ్యాపారస్తులకు ప్రాతినిధ్యం వహించే ఆయన సహచరులు మరొకరు ప్రాంత్ అధికారి ముందు వారి ఇంట్లో సంతకాలు చేశాం. పాండా హైస్కూల్ ప్రిన్సిపాల్ కే.శే వి.బి కార్నిక్ సాక్షి సంతకం చేశారు. ప్రాంత్ అధికారి మధ్య వర్తిత్వంలో మొత్తం సమస్య అందరికీ తృప్తికరమైన పద్ధతిలో పరిష్కారమైంది. ఈ ఒప్పందానికి కలప వ్యాపారుల సంఘ సర్వజన సభ ఆమోదం ప్రకటించింది. నిర్బంధాలను లెక్కచేయకుండా సమైక్య పోరాటంతో ఆదివాసులు సాధించిన విజయం ఇది.

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-11-2017 (36 pages) Postal Regd. No VJ/172/2015-17

# అధికారం చేతులు మారిన ఆ రోజు...



**– వి.ఐ. లెనిన్**

లెనిన్ అక్టోబరు 24 వ (ఆధునిక క్యాలెండర్ ప్రకారం నవంబర్ 6వ) తేది రాత్రి స్మోల్నిలో ప్రవేశించి తిరుగుబాటుకు స్వయంగా నాయకత్వం వహించారు. ఆ రాత్రంతా సైనిక విప్లవ దళాలు, రెడ్‌గార్డు దళాలు స్మోల్నికి వస్తూనే వున్నాయి. బోల్షివిక్కులు వారిని రాజధాని నగరం మధ్య భాగంలో తాత్కాలిక ప్రభుత్వం తిష్టవేసుకు కూర్చున్న వింటర్ భవనాన్ని ముట్టడించడానికి పంపించారు. అక్టోబర్ 25వ తేదిన (నవంబర్7) రెడ్‌గార్డులు, విప్లవ సైనికులు, రైల్వేస్టేషన్లను, పోస్టాఫీసును, టెలిగ్రాఫ్ ఆఫీసును, మంత్రివర్గ కార్యాలయాలను, ప్రభుత్వ బ్యాంకును స్వాధీనపరుచుకొన్నారు. తొలి పార్లమెంట్ రద్దు చేయబడింది.

పెట్రోగ్రాడ్ సోవియట్ యొక్క బోల్షివిక్ సెంట్రల్ కమిటీ యొక్క ప్రధాన కార్యాలయమైన స్మోల్నీ విప్లవ ప్రధాన కార్యాలయమైంది. అక్కడినుంచే పోరాటానికి ఉత్తర్వులు జారీ చేయబడేవి. బోల్షివిక్ పార్టీ నాయకత్వాన పెట్రోగ్రాడ్ కార్మికులు పొందిన అద్భుతమైన తర్ఫీదును ఆ రోజుల్లో వారు ప్రదర్శించారు. బోల్షివిక్కుల కృషిచే తిరుగుబాటుకు సన్నద్ధపరచబడిన విప్లవ సైనిక దళాలు పోరాట ఉత్తర్వులను తూచ తప్పకుండా పాటించారు. రెడ్‌గార్డులతో భుజం భుజం కలిపి వారు పోరాడారు. సైన్యానికి నావికులు ఏ మాత్రమూ తీసిపోలేదు. బోల్షివిక్ పార్టీకి క్రాన్‌స్టాట్ మంచి బలమైన కేంద్రం. అది చాలాకాలం నుండే తాత్కాలిక ప్రభుత్వ అధికారాన్ని గుర్తించ నిరాకరించింది. అరోరా యుద్ధనౌక (క్రూయిజర్) వింటర్ భవనంపైకి తన ఫిరంగులను ఎక్కుపెట్టింది. అక్టోబరు 25వ తేదిన (నవంబర్7న) అరోరా యుద్ధ నౌక ఫిరంగి గర్జనతో ఒక నూతన శకం, సోషలిస్టు విప్లవ శకం ప్రారంభమయింది. అక్టోబర్ 25వ తేదిన (నవంబర్ 7) బోల్షివిక్కులు "రష్యన్ పౌరులకు విజ్ఞప్తి" నొకదానిని ప్రకటించారు. అందులో బూర్జువా తాత్కాలిక ప్రభుత్వం కూలద్రోయబడిందనీ, రాజ్యాంగ అధికారం సోవియట్ల హస్తగతమయిందని తెలియజేశారు. తాత్కాలిక ప్రభుత్వం వింటర్ ప్యాలెస్‌లో కేడెట్ల, మెరుపు దళాల రక్షణ క్రింద తలదాచుకుంది. అక్టోబరు 25వ తేది (నవంబర్7) రాత్రి కార్మికుల, సైనికులు, నావికులు, వింటర్ ప్యాలెస్‌ను చుట్టుముట్టి, తాత్కాలిక ప్రభుత్వాని అరెస్టు చేశారు. పెట్రోగ్రాడ్‌లో సాయుధ తిరుగుబాటు విజయం పొందింది. 1917 అక్టోబర్ 25 (నవంబర్7) రాత్రి 10 గంటల 45 నిమిషాలకు స్మోల్నిలో అఖిల రష్యన్ సోవియట్ల రెండవ కాంగ్రెస్ ప్రారంభమయింది. అప్పటికే తిరుగుబాటు విజయవాహినిలో పెట్రోగ్రాడ్ మునిగిపోయింది. రాజధాని నగరంలో అధికారం పెట్రోగ్రాడ్ సోవియట్ చేతికి వచ్చింది. కాంగ్రెస్‌లో బోల్షివిక్కులకు అత్యధికమైన మెజార్టీ వచ్చింది. మెన్షివిక్కులు, 'బండ్' అనుచరులు, మితవాద సోషలిస్టు రివల్యూషనరీలు తమకు ఆఖరి ఘడియలు వచ్చాయని తెలుసుకున్నారు. కాంగ్రెస్‌లో తాము ఏ విధంగానూ పాల్గొన నిరాకరించుతున్నామని ప్రకటించుతూ వెళ్ళిపోయారు. సోవియట్ల కాంగ్రెస్‌లో వారు చదివిన ప్రకటనలలో అక్టోబర్ విప్లవాన్ని ఒక "సైనిక కుట్ర"గా పేర్కొన్నారు. మెన్షివిక్కులను, సోషలిస్టు – రివల్యూషనరీలను కాంగ్రెస్ ఖండించింది. వారు వెళ్లిపోయినందుకు విచారించలేదు సరిగదా పైగా సంతోషించింది. ఈ ద్రోహులు వెళ్లిపోయిన ఫలితంగా కాంగ్రెస్ నిజమైన కార్మిక, సైనిక ప్రతినిధుల విప్లవ కాంగ్రెస్‌గా మారిందని అది ప్రకటించింది. కాంగ్రెస్ అధికారమంతా సోవియట్ల చేతుల్లోకి వచ్చిందని ఒక ప్రకటన చేసింది. ఆ ప్రకటన ఇలా వుంది. "కార్మికులు, సైనికులు, రైతులలో అత్యధిక సంఖ్యాకులు బలపరుచుట వల్ల పెట్రోగ్రాడ్‌లో సంభవించిన కార్మికుల, సైనికుల విజయవంతమైన తిరుగుబాటు వల్ల, కాంగ్రెస్ అధికారాన్ని తన హస్తగతం చేసుకొంది".

1917 అక్టోబర్ 26వ తేది (నవంబర్8) రాత్రి సోవియట్ల రెండవ కాం్రగెస్ శాంతికి సంబంధించిన ఒకచట్టాన్ని ఆమోదించింది. శాంతికై రాయబారాలు కొనసాగించేందుకుగాను, తక్షణం కనీసం మూడు మాసాలకు తక్కువ లేకుండా యుద్ధ విరామ సంధి చేసుకోవాలని యుద్ధం చేస్తున్న దేశాలను కాంగ్రెస్ కోరింది. యుద్ధం చేస్తున్న ప్రభుత్వాలన్నింటికి అదే సమయంలో విజ్ఞప్తి చేసింది. ఆ విజ్ఞప్తి "మానవ జాతిలో ఎంతో అభివృద్ధి చెందిన మూడు దేశాల వర్గ చైతన్యం గల కార్మికులకు – అనగా ప్రస్తుత యుద్ధంలో పాల్గొంటున్న దేశాలన్నింటిలోకి పెద్దవైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీల యొక్క వర్గ చైతన్యం గల కార్మికులకు" ఉద్దేశించబడింది. "విజయవంతంగా శాంతిని నెలకొల్పాలని అదే సమయంలో పీడిత ప్రజాసామాన్యాన్ని అన్ని రకాల బానిసత్వం నుండి దోపిడి నుండి విముక్తి చేయాలని " ఈ కార్మికులకు కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. అదే రాత్రి సోవియట్ల రెండవ కాంగ్రెస్ భూమిహక్కుపై ఒక చట్టాన్ని ఆమోదించింది. "ఈ క్షణం నుండి ఎట్టి నష్టపరిహారం ఈయకుండానే భూస్వాములకు గల భూమి హక్కు రద్దుచేయబడింది" అని ఈ చట్టం ప్రకటించింది.

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.12, No.7. Published on November 1, 2017